www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 39 Vol సంచిక : 14 No | విజయవాడ, సోమవారం 14 జనవరి 2019 | 12+12 పేజీలు వెల : 4.00 Rs

ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్

విజేత బెంగళూరు

- హోరాహోరీ ఫైనల్లో ముంబయిపై గెలుపు

12



సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నాగాయలంకలో కన్నుల పండువగా పడవ పోటీల నిర్వహణ (వార్త 2వ పేజీలో)

కళ తప్పిన సంక్రాంతి

- బావురుమంటున్న తెలుగు లోగిళ్లు
- వరుస విపత్తులతో సాగు కుదేలు
- రూ.పది వేల కోట్ల పంట నష్టాలు
- మొక్కుబడిగా పెద్ద పండగ



తిత్లీ తుఫానకు నష్ట పోయిన పంట పోలాలు (ఫైల్)

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

సంక్రాంతి పక్కా వ్యవసాయ పండగ. తెలుగు వారికి పెద్ద పండగ. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతికొచ్చే వేళ. ఖరీఫ్ ధాన్యపు రాశులు ఇంటికొచ్చే సందర్భం. అందుకే తెలుగు పల్లెల్లో సం'క్రాంతు'లు ప్రకాశిస్తాయి. సంస్కృతి సంప్రదాయాలు వికసిస్తాయి. వ్యవసాయం కుదేలవడంతో ఈ తడవ సంక్రాంతి కళ తప్పింది. ఒకే సీజనులో కరువు, తుపాన్లు, వరదలు చుట్టుముట్టి అన్నదాతలను చిదిమేశాయి. పంటలు చేతికందాల్సిన సమయంలో లక్షలాది ఎకరాల్లో వైపరీత్యాలతో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వాలు నామ్‌కేవాస్తే విదిల్చే పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ)లు, రుణ మాఫీ కిస్తులు, పంటల బీమా క్లెయిముల కోసం కళ్లల్లో వత్తులేసుకొని నిరీక్షించాల్సిన ఆందోళనకర పరిస్థితి ఈ ఏడాది రైతులకు దాపురించింది. ఒక వైపు వ్యవసాయరంగ స్థూల ఆదాయపు విలువ (గ్రాస్ వాల్యూ యాడెడ్-జివిఎ) ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోందని చంద్రబాబు సర్కారు చెబుతుండగా మరో వైపు ఈ ఒక్క సీజనులోనే రూ.పది వేల కోట్లకు పైన రైతులు నష్టపోయారని అంచనా. దాదాపు 12 లక్షల ఎకరాల్లో పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. మరో పది లక్షల ఎకరాలు సాగు లేక బీడుపడ్డాయి. దాదాపు పాతిక లక్షల మంది రైతులకు పెద్ద పండగ సంతోషం దరి చేరలేదు. కౌలు రైతుల బాధ వర్ణనాతీతం.

సగం దుర్భిక్షమే

గత ఏడాది వర్షాభావం ఉన్నా అడపాదడపా కురిసిన వర్షాలకు కాస్తో కూస్తో పంటలు తెప్పరిల్లాయి. ఈ మారు ఖరీఫ్ ఆరంభం నుంచే రాష్ట్రంలో ముప్పావు వంతు అనావృష్టి తిష్ట వేసింది. రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు, విజయనగరం జిల్లాల్లో వర్షాభావం నెలకొంది. సాంకేతికంగా గుంటూరు, విజయనగరం కరువు నుంచి మిగతా 9లో

అపార నష్టం

విపత్తు	నష్ట పోయిన విస్తీర్ణం (ఎకరాలు)	రైతుల సంఖ్య	వాస్తవ నష్టం రూ.కోట్లు	సర్కారీ ఇన్‌పుట్ సబ్సిడీ రూ.కోట్లు
కరువు	6 లక్షలు	15 లక్షలు	6,000	2,000
తిత్లీ	3 లక్షలు	4 లక్షలు	2,000	475
పెథాయి	2 లక్షలు	3 లక్షలు	1,000	300
భారీ వర్షాలు	60 వేలు	50 వేలు	100	32

ఇది కాక ఖరీఫ్‌లో బీడుపడ్డ భూమి 10 లక్షల ఎకరాలు




యుపిలో అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం : రాహుల్

న్యూఢిల్లీ/దుబాయ్ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని అన్ని స్థానాల నుండి పోటీ చేస్తామని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. యుపిలో సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీలు పొత్తు పెట్టుకొని కూటమిగా ఏర్పడి అందులో కాంగ్రెస్‌కు స్థానం కల్పించకపోవడంతో ఆయన ఈ విధంగా స్పందించారు. తమ సిద్ధాంతాలకే కట్టుబడి, అన్ని లోక్‌సభ స్థానాల నుండి కాంగ్రెస్ ఎన్నికల బరిలోకి దిగనుందని తెలిపారు. దుబాయ్‌లోని ఓ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆ రెండు పార్టీల నేతల పట్ల తనకు అమితమైన గౌరవం ఉందని, వారేమి చేయాలనుకుంటున్నారో అది చేసే హక్కు వారికుందని అన్నారు. బిఎస్‌పి, ఎస్‌పిలు రాజకీయపరమైన నిర్ణయాలు తీసుకున్నాయని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో తమ పార్టీని బలపరిచి, పూర్తి సామర్థ్యంతో ఎన్నికల్లో పోటీ చేస్తామని పునరుద్ఘాటించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో యుపిలో ఎస్‌పి, బిఎస్‌పి కూటమిగా ఏర్పడి..లోక్‌సభ స్థానాలను చెరి సమం పంచుకున్న సంగతి తెలిసిందే. యుపిఎ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ మీద గౌరవంతో అమేథీ, రాయబరేలీలలో పోటీ నుండి విరమించుకున్నట్లు ఆ పార్టీలు ప్రకటించాయి.

వ్యవసాయానికి 9 గంటల విద్యుత్

- మార్చికల్లా పెండింగ్ కనెక్షన్లు మంజూరు చేయాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వ్యవసాయానికి ప్రస్తుతం అందిస్తున్న 7గంటల ఉచిత విద్యుత్‌ను 9 గంటలకు పెంచాలని, ఇందుకు సంబంధించిన విధివిధానాలను రూపొందించాలని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంధన శాఖ అధికారులను ఆదేశించారు. ఇంధన శాఖ మంత్రి కళా వెంకట్రావుతో కలిసి ఆదివారం ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉచిత విద్యుత్ సరఫరాతో సుమారు 17లక్షల మంది రైతులు లబ్ధి పొందుతారని ముఖ్యమంత్రి చెప్పారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా 15 రోజుల క్రితం 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా గురించి ప్రకటించామని గుర్తు చేశారు. 9 గంటల ఉచిత విద్యుత్తు సరఫరాకు అదనంగా 2800 మిలియన్ యూనిట్లు అవసరమని అధికారులు వివరించారు. ఏడు గంటల ఉచిత విద్యుత్‌కు రూ.6,030 కోట్లు రాయితీ ఇస్తున్నట్టు, తొమ్మిది గంటలకు పెంచితే రూ.7,230కోట్లు ఇవ్వాల్సి వుంటుందని ఇంధన శాఖ కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. కొత్త వ్యవసాయ కనెక్షన్లు కోసం దరఖాస్తు చేసినవారిలో అర్హులందరికీ మార్చి లోగా కనెక్షన్లు ఇవ్వాలని సిఎం ఆదేశించారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి తాను కట్టుబడి ఉంటానని ఆయన చెప్పారు. ఇంధన సామర్థ్య పంపు సెట్ల ద్వారా 30శాతం విద్యుత్ ఆదాతో 15శాతం నీటి పంపింగ్ సాధ్యమవుతుందన్నారు. 9గంటల ఉచిత విద్యుత్ సరఫరాకు సంబంధించి సమగ్ర నివేదికను త్వరలో అందజేస్తామని ట్రాన్స్‌కో సిఎండి కె విజయానంద్ ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా, సిఎం ప్రత్యేక కార్యదర్శి సతీశ్ చంద్ర, ముఖ్య కార్యదర్శి జి సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జమ్ము కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

ఇద్దరు ఉగ్రవాదులు మృతి 8

లక్ష్యాలకు దూరంగా రుణమేళాలు

ఇప్పటి వరకు 7 శాతం మందికే లబ్ధి 2



'టోల్' వివాదం

- సర్కారు రద్దు చేసినా కొనసాగిన వసూళ్లు ఉదయం నుంచి ఉద్రిక్తత
- సాయంత్రానికి సాఫీగా...

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంక్రాంతి పండగ దృష్ట్యా వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆదివారంతో పాటు ఈ నెల 16న టోల్ గేట్ల వద్ద ఛార్జీ వసూలును రద్దు చేస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయినా టోల్ గేట్ నిర్వాహకులు మాత్రం ఫీజు చెల్లించకుండా వాహనాలు పంపకపోవడంతో రాష్ట్రంలోని ప్రధాన టోల్ గేట్ల వద్ద ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిజిపి ఆర్‌పి ఠాకూర్ ఆదేశాలతో పోలీసులు జోక్యం చేసుకుని టోల్ ఫీజు వసూలు చేయకుండా వాహనాలను ముందుకు పంపడంతో సాయంత్రానికి వివాదం సద్దుమణిగింది. సంక్రాంతి పండుగ కావడంతో ఉద్యోగులందరూ తమ సొంత గ్రామాలకు పయనమయ్యారు. దీంతో రహదారులన్నీ కార్లు, బస్సులతో కిటకిటలాడాయి. టోల్ ఫీజులు వసూలు చేసేందుకు ఎక్కువ సమయం పడుతుండటంతో ప్రధాన రహదారులపై వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. దీంతో వాహన దారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టోల్ ఫీజు ఎత్తేసినా ఎందుకు వసూలు చేస్తున్నారంటూ టోల్ గేట్ సిబ్బందితో ప్రయాణికులు వాగ్వాదానికి దిగారు. రాష్ట్ర మిగతా 9లో

ఈ ఎన్నికలు తొలి అడుగు

- రాజకీయ వ్యవస్థలో మార్పు రావాలి
- రాష్ట్ర భవిష్యత్‌ను మార్చేశక్తి యువతకే ఉంది
- తెనాలి సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్



తెనాలి రోడ్‌షోలో పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - తెనాలిటౌన్ (గుంటూరు జిల్లా)

రాజకీయ అవినీతి పీడిస్తున్నందున వ్యవస్థలో మార్పు కోసం ప్రజల ముందుకు రావాల్సి వచ్చిందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలి మండలంలోని పెదరావూరులోని మాజీ స్పీకర్, జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్ వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాల్లో పవన్ ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీ అంటే ప్రజలకు సేవ చేయాలేగాని లక్షల కోట్ల రూపాయలు దోచుకోవటమేమిటని ప్రశ్నించారు. తనకు పదవి అక్కర్లేదని, అదే కావాలనుకుంటే 2014లో సిఎం, పిఎం ఇద్దర్లో ఏ ఒక్కరూ కాదనేవారు కాదని పేర్కొన్నారు. అలాగని ఆస్తులు సంపాదించుకోవాలనుకుంటే సినిమాల్లోనే ఉండేవాడినన్నారు. అవినీతి ఊబిలో కూరుకుపోయిన రాజకీయాలతో విసిగి, ప్రజల కోసం, రాజకీయాల్లో మార్పు కోసం పార్టీ పెట్టానని చెప్పారు. కులం, మతం అంటూ ఆయా వర్గాలు రాజకీయ లబ్ధి కోసం సృష్టించే విభేదాల కోసం పోరాడేవారే తప్ప అవినీతిని ప్రశ్నించే నాయకులే లేరన్నారు. ఎవరినీ వ్యక్తిగతంగా మాట్లాడనని, కొన్నిసార్లు తప్పక మాట్లాడాల్సి వస్తోందని చెప్పారు. మళ్లీ చంద్రబాబే ముఖ్యమంత్రి కావాలి, ఆ తరువాత ఆయన బాబు రావాలి అన్న తపనేగాని, అవినీతికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం లేదన్నారు. జగన్ మూడు దశాబ్దాలు తనే ముఖ్యమంత్రి కావాలని కోరటం స్వార్థపూరితమన్నారు. 2014లో టిడిపికి మద్దతిచ్చింది పార్టీ పెట్టలేక కాదని, అవినీతి రహిత పాలనతో రాష్ట్రం బాగుండాలనే ఉద్దేశంతోనేనని చెప్పారు. రాష్ట్ర విభజన పాలకుల పాపమైతే, దాని ఫలితం ప్రజలు అనుభవిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు అక్కడి ప్రజలు ఎంతో పట్టుదలతో రకరకాల ఆందోళనలు చేశారని, ఇక్కడివారూ అదే స్ఫూర్తితో అవినీతి పాలనను పారదోలాలని పిలుపునిచ్చారు. 'జాగోరే జాగో' కార్యక్రమంలో యువత మార్పు కోసం చర్చించాలనే ఉద్దేశంతో చేపట్టామని పేర్కొన్నారు. ప్రజలకు కావాల్సింది 25 కిలోల రేషన్ బియ్యం కాదని, 25 ఏళ్ల భవితవ్యమని అన్నారు. ఎంత ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలవుతుందని, 2019 ఎన్నికలతో వేసే తొలి అడుగు మార్పునకు నాంది పలకాలని, సంక్రాంతి వేడుకలు, భోగి మంటలతో అవినీతి పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.

రానున్న రోజుల్లో తెనాలి శాటిలైట్ సిటీ

ఆంధ్రా ప్యారిస్‌గా పిలిచే తెనాలికి అతి సమీపంలోని బాపట్లలోనే తాను పుట్టినట్లు పవన్ గుర్తు చేసుకున్నారు. తెనాలి మిగతా 9లో

నాలుగేళ్లుగా గ్యాంగ్ రేప్

- మైనర్‌బాలికపై దారుణం
- పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు
- స్థానికులు ఆందోళనతో నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ మైనర్ బాలికపై సమీప బంధువుతో పాటు మరో ముగ్గురు యువకులు నాలుగేళ్ళుగా అత్యాచారానికి పాల్పడ్డ దారుణ సంఘటన ఇది! కుటుంబ సభ్యుల సహకారంతో ఆ బాలిక పోలీసులను ఆశ్రయించడంతో ఆదివారం ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఇంత జరిగినా నిందుతుల్లో ఒకరిని అరెస్టు చేయడంలో పోలీసులు జాప్యం చేయడం, అతనినే సాక్షిగా చూపడంతో స్థానికులు మిగతా 9లో



కత్తి ఎక్కడ పెట్టుకున్నావు? ఎలా తీశావు?

విశాఖ ఎయిర్‌పోర్టులో శ్రీనివాస్‌ను ప్రశ్నించి న ఎన్‌ఐఎ

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో, పిఎం పాలెం

ఎయిర్‌పోర్టులోకి కత్తి ఎలా తీసుకువెళ్లావు?'దాడి చేయడానికి ముందు ఎక్కడున్నావు? ఎటువైపు నిలబడ్డావు? విఐపి ఎక్కడున్నారు? కత్తి ఎక్కడ పెట్టుకున్నావు? ఎలా తీశావు... ఎలా దాడి చేశావు?' ఇవి జగన్‌పై దాడి కేసులో నిందితుడు శ్రీనివాసరావును ఎన్‌ఐఎ అధికారులు విశాఖ ఎయిర్‌పోర్టులో వేసిన ప్రశ్నలు! విచారణ ప్రక్రియలో భాగంగా ఆదివారం ఎన్‌ఐఎ అధికారులు శ్రీనివాసరావును విశాఖ విమానాశ్రయానికి తీసుకువెళ్లారు. నేరం జరిగిన సెల్ఫీ సన్నివేశాన్ని పున: సృష్టించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుపై ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం. జగన్ చుట్టూ పలువురు ఉన్నప్పటికీ, మిగతా 9లో

ఎపి ఎన్జీఓల నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా

చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసరావు



చంద్రశేఖర్ రెడ్డి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బండి శ్రీనివాస రావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడ గాంధీ నగర్‌లోని ఎన్జీఓ అసోసియేషన్ హాలులో రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న సి.హెచ్ పురుషోత్తం నాయుడు ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, బండి శ్రీనివాసరావులు మాట్లాడుతూ రాష్ట్రంలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు ఐదు లక్షల మంది, పెన్షనర్‌లు మరో నాలుగు లక్షల మంది సంక్షేమమే లక్ష్యంగా పని చేయనున్నట్లు చెప్పారు. వీరి న్యాయమైన కోర్కెలను పరిష్కరించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి 35 శాతం మధ్యంతర భృతి మంజూరు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ బద్రత, పెన్షనర్లకు గృహాలు నిర్మించేందుకు స్థలాల మంజూరు వంటి ప్రధాన సమస్యపై రాజీ లేని పోరాటం చేస్తామన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులకు మంజూరు చేసిన మిగతా 9లో

కేంద్రం సహకరించడం లేదు

ధాన్యం కొనుగోళ్లపై సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ధాన్యం కొనుగోళ్లకు కేంద్రం సహకరించడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రంగు మారిన ధాన్యం కొనుగోళ్లకు వీలుగా ఎఫ్‌సిఐ నిబంధనలను సడలించాల్సిఉన్నా కేంద్రం ఆ దిశలో స్పందించడంలేదని చెప్పారు. ఆదివారం రాత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్లు, పార్టీ భాద్యుతలతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తడిసిన ధాన్యం కొనుగోళ్లపై రైతుల ఇబ్బందులను పార్టీ నేతలు సిఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పత్తిపాటి పుల్లారావులు ఢిల్లీ వెళ్లాలని, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఆదేశించారు. పెంచిన ఫించన్లను ఫిబ్రవరిలో అందరికీ భోజనాలు పెట్టి పింఛన్లు అందజేయాలన్నారు.



కన్నుల పండుగగా గాలిపటాల పండగ

ప్రారంభించిన ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంక్రాంతి పండగ సందర్భంగా తెలంగాణ పర్యాటక, సంస్కృతిక శాఖ వరుసగా మూడో ఏడాది సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ కైట్ ఆకట్టుకుంది. సుమారు 20 దేశాల నుంచి ఔత్సాహికులు గాలిపటాల పండుగలో పాల్గొన్నారు, అంతర్జాతీయ కైట్ క్లబ్‌లు కూడా పాల్గొన్నాయి. రంగు రంగుల ఆకృతుల్లో, భారీ సైజు పతంగులు కనువిందు చేశాయి. చైనా దేశానికి చెందిన యువకులు ఎగరవేసిన గాలిపటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు పర్యాటక శాఖ కార్యదర్శి వెంకటేశం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వీట్ ఫెస్టివల్‌కు కూడా విశేష ఆదరణ లభిస్తోంది. హైదరాబాద్ నగరంలో స్థిరపడిన వివిధ రాష్ట్రాలు, దేశాలకు చెందిన ప్రజలు ఆయా ప్రాంతాల్లో పేరుగాంచిన మిఠాయిలను అక్కడికక్కడే తయారుచేసి విక్రయించడం స్వీట్ ఫెస్టివల్ ప్రత్యేకత. ఆంధ్ర మిఠాయిలు కాకినాడ కాజా, బందరు లడ్డు, పూతరేకులు, అరిశలు స్టాల్స్ వద్ద సందర్శకులు రద్దీ కనిపించింది. ఈ వేడుకలను ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో సంక్రాంతి కళ ఉట్టిపడుతోందన్నారు. ప్రభుత్వాలు పండుగలకు ప్రోత్సాహకాలను ఇవ్వడం హర్షణీయమన్నారు. ప్రజలు అన్ని రకాల కళలను ఆస్వాదించాలని చెప్పారు. భారతీయ వంటకాలు కాలప్రవాహాన్ని తట్టుకొని నిలబడ్డాయి అని అన్నారు.



కొనసాగుతున్న ద్రోణి

రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో

రెండ్రోజుల క్రితం ఏర్పడిన ద్రోణి ఆదివారం నాటికి కర్నాటక నుంచి మహారాష్ట్ర వరకు కొనసాగుతోంది. ఇది రాష్ట్రంపై ఎలాంటి ప్రభావం చూపదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. కోస్తా, సీమల్లో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 27 నుంచి 32.5 వరకు, రాత్రి పూట 14 నుంచి 20.7 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. దీంతో సాధారణ చలి కొనసాగుతోంది. మరో మూడు నాలుగు రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని అధికారులు తెలిపారు. తర్వాత పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందంటున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ప్రజ్ఞ

1. టెన్నిస్ ఆటకు వీడ్కోలు పలికిన బ్రిటన్ క్రీడాకారుడు ఎవరు?
2. ఇస్రో మానవ సహిత గగన్‌యాన్ ప్రాజెక్టును ఎప్పుడు చేపట్టనుంది?
3. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ చైర్మన్‌గా ఎవరు రాజీనామా చేశారు?
4. ఇటీవల హాకీ జట్టు కోచ్ పదవి నుండి ఎవరిని తొలగించారు?
5. ఎప్పటినుండి 5వ ప్రవాసీ భారతీయ దివస్ జరగనుంది?

సమాధానాలు 7లో

లక్ష్యాలకు దూరంగా రుణ మేళాలు

ఇప్పటి వరకు 7 శాతం మందికే లబ్ధి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వివిధ కార్పొరేషన్లు, ఫెడరేషన్‌ల ద్వారా నిర్ధేశించిన లక్ష్యాల మేరకు రుణాలు ఇవ్వడంలో ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందింది. మెగా రుణ మేళాలు నిర్వహిస్తున్నప్పటికీ వాటి ద్వారా రుణాలు అందుకున్న వారి సంఖ్య మాత్రం తక్కువే! ఇప్పటి వరకు నిర్వహించిన మూడు మెగా రుణ మేళాల ద్వారా కేవలం 23వేల మందికే రుణాలు పంపిణీ చేశారు. నిర్ధేశించిన లక్ష్యంతో పోలిస్తే ఇది కేవలం ఏడు శాతం మాత్రమే! నిర్ణయించుకున్న లక్ష్యం మేరకు మూడు రుణమేళాల్లో మూడు లక్షల మందికి సుమారు 2,580 కోట్ల రూపాయల మొత్తాన్ని రుణంగా ఇవ్వాల్సిఉంది.ఈ వాస్తవానికి భిన్నంగా లక్షలాది మందికి రుణాలు పంపిణీ చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం గమనార్హం. మొదటి మెగా మేళాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 16619 మందికి రూ. 70 కోట్లతో రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు రూ.53 కోట్లతో 6989 మందికే ఇచ్చారు. ట్రైకార్ ద్వారా రూ.16 కోట్లతో 1611 మందికి, బిసి కార్పొరేషన్ ద్వారా రూ.195 కోట్లతో 24201 మందికి రుణాలివ్వాలని టార్గెట్‌గా పెట్టుకోగా ట్రైకార్ ద్వారా రూ.6 కోట్లతో 864 మంది గిరిజనులకు, బిసి కార్పొరేషన్ ద్వారా 24 కోట్లతో 3799 మంది వెనుకబడిన తరగతుల వారికి రుణాలు ఇచ్చినట్టు అధికారులు పేర్కొంటున్నారు. రెండో మెగా రుణమేళాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.252 కోట్లతో 28056 మందికి, ట్రైకార్ ద్వారా రూ.26 కోట్లతో 3320 మంది గిరిజనులకు, బిసి కార్పొరేషన్ ద్వారా రూ.166 కోట్లతో 18428 మందికి రుణాలు ఇవ్వాల్సి ఉండగా, నేటి వరకు రూ.5 కోట్లతో 764 మంది ఎస్సీలకు, రూ.1 కోటితో 160 మంది గిరిజనులకు, రూ.3 కోట్లతో 569 మందికి మాత్రమే రుణాలు అందించారు. మూడో మెగా రుణమేళాలో ఇంకా దారుణం. రూ.24 కోట్లతో 2252 మంది గిరిజనులకు గాను రూ.64 లక్షలతో 84 మంది మాత్రమే పంపిణీ చేశారు. రూ. 237 కోట్లతో 24956 మందికి గాను రూ.5 కోట్లతో 729 మంది ఎస్సీలకు మాత్రమే అందించడం గమనార్హం.



కార్పొరేషన్ల మెగా రుణమేళాలు ఇలా!

	లక్ష్యం		ఇచ్చింది(కోట్లల్లో)	
	లబ్ధిదారుల సంఖ్య	కేటాయింపులు (కోట్లల్లో)	లబ్ధిదారుల సంఖ్య	ఇచ్చిన మొత్తం
మొదటి మెగా రుణమేళ	1 లక్ష	849.99	19701	141.86
రోండో మెగా రుణమేళ	1 లక్ష	857	2358	16.10
మూడో మెగా రుణమేళ	100269	874	1574	10.47

అదే బాటలో ఫెడరేషన్‌లు

ఫెడరేషన్‌ల రుణాల పరిస్థితి కూడా అదే విధంగా ఉంది. మొదటి మేళాలో రజక ఫెడరేషన్ నుంచి 3,102 మందికి రూ.20.24 కోట్లతో రుణాలివ్వాలని టార్గెట్‌గా పెట్టుకోగా, రూ.2.60 కోట్లతో కేవలం 348 మందికి మాత్రమే ఇచ్చారు. నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ నుంచి 2,311 మందికి రూ.19.81 కోట్లతో రుణాలివ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ. 3 కోట్లతో 431 మందికే అందించారు. కుమ్మరి ఫెడరేషన్ ద్వారా రూ.11.46 కోట్లతో 1630 మందికిగాను రూ. 50 లక్షలతో కేవలం 62 మందికి, విశ్వబ్రాహ్మణ ఫెడరేషన్ ద్వారా 1708 మందికి రూ.12.68 కోట్లతో రుణాలివ్వాల్సి ఉండగా రూ.1 కోటితో 199 మందికి మాత్రమే పంపిణీ చేశారు. కల్లుగీత కోఆపరేటివ్ కార్పొరేషన్ ద్వారా రూ.11.59 కోట్లతో 1819 మందికి రుణాలు లక్ష్యంగా ఉండగా, రూ. 1.91 కోట్లతో 274 మందికి మాత్రమే ఇవ్వగలిగారు. రెండు, మూడు మేళాల్లో అయితే రుణాల ఖాతానే తెరవ లేదు. ఎక్కువ ఫెడరేషన్‌ల ద్వారా ఇంత వరకు ఇచ్చింది సున్నా శాతం. రెండో మేళాలో ఉప్పర, కృష్ణ బలిజ, భట్రాజ, మేదర ఫెడరేషన్‌ల ద్వారా ఒక్కరికి కూడా రుణాలివ్వలేదు. ఇక మూడో మేళా పరిస్థితి కూడా అంతే. ఏడు ఫెడరేషన్‌లలో నేటి వరకు రుణాలే ఇవ్వలేదు. వడ్డెర, ఉప్పర, కృష్ణ బలిజ, వాల్మీకి, భట్రాజ, కుమ్మరి, విశ్వబ్రాహ్మణ, మేదర ఫెడరేషన్‌ల ద్వారా సున్నా శాతం రుణాలిచ్చారు.

తాగునీటికి కటకట...!

2 వేల గ్రామాల్లో సమస్య తీవ్రం

శ్వేతపత్రంలో వాస్తవాలకు చోటేదీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 55 శాతం ఆవాసాలకు ప్రతి మనిషికీ రోజుకు 55 లీటర్ల నీటిని అందజేయస్తున్నట్లు, 2020 నాటికి నూరు శాతం ఆవాసాలకు ఈ సరఫరా విస్తరించనున్నట్లు ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేసిన గ్రామీణ మౌలిక సదుపాయాల శ్వేతపత్రంలో పేర్కొన్నారు.

అయితే, రాష్ట్రంలో తాగునీటి సరఫరా మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా వున్నట్లు స్పష్టమవుతోంది. గ్రామాల్లో తాగునీటి సమస్య ఆరు జిల్లాల్లో తీవ్ర రూపం దాల్చింది. వీటిలో ప్రకాశం, కడప, చిత్తూరు, నెల్లూరు, గుంటూరు, కర్నూలు జిల్లాల్లో 2,017 గ్రామాల్లో తాగునీటి కొరత ఉంది. ఆయా జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు తాగునీటి కోసం స్థానిక ఆర్డీఓ, మండల పరిషత్ కార్యాలయాల వద్ద, ప్రధాన రహదారిలపై ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించిన తమ నిరసన తెలిపారు. ఇటీవల చిత్తూరు జిల్లాలో రామసముద్రం గ్రామంలో జన్మభూమి కార్యక్రమానికి హాజరైన అధికారులకు ఖాళీ బిందెలతో స్థానికులు నిరసన తెలిపారు. ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నా పూర్తి స్థాయిలో నీరందడం లేదు. ట్యాంకర్లతో 8 వేల ట్రిప్పులను లక్ష్యంగా పట్టుకోగా 70 నుంచి 80 శాతం లక్ష్యాన్ని మాత్రమే చేరుకుంటున్నారు. ఆర్టీజిఎస్ సర్వేలో 18 శాతం మంది తమ ప్రాంతానికి ట్యాంక్లు రావడం లేదని సమాధానం ఇచ్చారు. మరోవైపు ఇతర గ్రామాల్లో ప్రతి మనిషికీ రోజుకు 55 లీటర్ల నీటిని అందించడం లేదనే విషయం ఆర్టీజిఎస్ సర్వేలో స్పష్టమవుతోంది. తాగునీటి సరఫరాపై సంతృప్తి శాతం నవంబరులో 62.19 శాతం ఉండగా డిసెంబరులో 58.73 శాతానికి తగ్గడం ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. కుళాయిల నుంచి చాలా తక్కువ సమయం నీరు విడుదల చేస్తున్నారని 30 శాతం మంది చెప్పారు. విశాఖటప్నం, తూర్పుగోదావరి, విజయనగరం, అనంతపురం, నెల్లూరు జిల్లాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. ఇస్తున్న నీరు పరిశుభ్రంగా ఉండటం లేదని 21.51 శాతం మంది తెలిపారు.

వ్యక్తిగత కుళాయి కనెక్షన్లు రాష్ట్రంలో చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయి. జాతీయ గ్రామీణ నీటి సరఫరా కార్యక్రమం గణాంకాల ప్రకారం 91.29 లక్షల ఇళ్లు ఉండగా కేవలం 22.79 లక్షల ఇళ్లకు మాత్రమే కుళాయి కనెక్షన్ల సౌకర్యం ఉంది. 24.96 శాతం ఇళ్లకు వ్యక్తిగత కుళాయి కనెక్షన్లు ఉండగా మిగిలిన ఇళ్లల్లోని ప్రజలు తాగునీటి కోసం వీధి కుళాయిలు, చేతి పంపులు, బోర్లు, ఇతర వనరులపై ఆధారపడుతున్నారు. 48,363 ఆవాసాలకు గాను 14,482 ఆవాసాల్లో తాగునీటి సరఫరా పాక్షికంగానే జరుగుతోందని ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2024 నాటికి ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వాలని ప్రభుత్వం రూ.22 వేల కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. ఇది ఎన్నికల నేపథ్యంలో ప్రజల్ని మభ్యపెట్టడానికే అన్న వాదనలు వినిపిస్తున్నాయి.

సంస్కృతిని చాటి చెప్పే పండుగే సంక్రాంతి

రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మన సంస్కతిని ప్రపంచానికి చాటిచెప్పే సజనాత్మక వేడుకే సంక్రాంతి పండుగ అని చంద్రబాబు అన్నారు. పేద ప్రజల కళ్లల్లో వెలుగులు చూడటమే తనకు నిజమైన సంక్రాంతి అన్నారు. పెన్షన్లను రెట్టింపు చేసి ఇంటికి పెద్దకొడుకుగా సంక్రాంతి కానుక ఇచ్చామని, ఇది తనకెంతో సంతప్తినిస్తోందన్నారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలుగు ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.. భోగిమంటలతో ప్రారంభమయ్యే సంక్రాంతి సంబరాలు కనుమతో ముగించడం మన సంప్రదాయమని గుర్తు చేశారు. రంగురంగుల రంగవల్లులు, వైవిధ్యమైన ముగ్గులు తెలుగింటి ఆడపడుచుల కళా సజనకు నిదర్శనమని చెప్పారు. జీవన సమరంలో ఎక్కడో దూర ప్రాంతాల్లో ఉంటూ పండుగ వేళ కుటుంబ సభ్యులు, బంధు, మిత్రులు కలుసుకుంటున్నారని, ఇది మన దేశ కుటుంబ వ్యవస్థ గొప్పదనమని, పల్లె సీమల్లో వెల్లివిరిసే ఆత్మీయతకు, సుహద్భావ సంబంధాలకు నిదర్శనమన్నారు. పంట చేతికొచ్చిన సంతోషంతో ప్రజలు జరుపుకునే పండగే సంక్రాంతి అని, ఇది రైతులకు నిజమైన పండుగని, చంద్రబాబు అన్నారు.

డ్రై రీసోర్స్ సెంటర్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రేటర్ విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని బాలచెరువు మీ సేవ కేంద్రం గ్రౌండ్‌లో జివిఎంసి ఏర్పాటు చేయాలని నిర్ణయించిన డ్రై రీసోర్స్ సెంటర్(డంపింగ్ యార్డ్) ఏర్పాటును ఉపసంహరించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు ఆదివారం లేఖ రాశారు. ప్రజల ఆవాసాల మధ్య ఈ సెంటర్ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నారని, దీని వల్ల 20వేల మంది ఆరోగ్యాలపై దుష్ప్రభావం కలుగుతుందని పేర్కొన్నారు. సెంటర్ ఏర్పాటుకు వ్యతిరేకంగా సీకువానిపాలెం, పెదకోరాడ, చినకోరాడ, బాలచెరువు, పెదగంట్యాడ ప్రజలు రెండు వారాల నుంచి తీవ్రపోరాటం చేస్తున్నారని, రాత్రింబవళ్లు అక్కడే ఉండి నిరసన తెలుపుతున్నారని తెలిపారు. డ్రై



రీసోర్స్ సెంటర్ పేరుతో చెత్త, చెదారం, ప్లాస్టిక్, అట్టపెట్టెలు, కాగితాల వంటి వ్యర్థపదార్థాలు జనావాసాల మధ్యకు తరలించడం చట్ట వ్యతిరేకమని, దీని వల్ల ఆ ప్రాంతం మొత్తం విషకాలుష్య మౌతుందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే తన స్వప్రయోజనాల కోసం ప్రజలకు హాని తలపెట్టడం సరైంది కాదని తెలిపారు. సిఎం జోక్యం చేసుకుని డ్రై రీసోర్స్ సెంటర్ ఏర్పాటు చేయకుండా తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఆ స్థలాన్ని స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు కేటాయించారని, ఆ ప్రాంతంలో ప్రజలకు కళ్యాణ మండపం, కళావేదిక, గ్రంథాలయం, బాలల విజ్ఞాన కేంద్రం, జిమ్ వంటి వాటిని ఏర్పాటు చేయాలని కోరారు.

సిద్దార్థ నగర్‌ను 22-ఎ నుంచి తొలగించాలి

విశాఖపట్నం జిల్లా గాజువాక మండలం సిద్దార్థ నగర్ ప్రాంతాన్ని 22-ఎ నుంచి తొలగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు ఆదివారం లేఖ రాశారు. 1989లో రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని బిహెచ్‌పివి ఎంప్లాయీస్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి, ఎస్సీ, ఎస్టీ బలహీన వర్గాల కోసం కేటాయించిందని, ప్రభుత్వం ఆదేశించిన రేటు ప్రకారం మొత్తం తొమ్మిది ఎకరాలకు సభ్యులు డబ్బు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. మొత్తం ఉడా అనుమతి కూడా పొందారని, మొత్తం 272 ఇళ్లు నిర్మించుకుని 30 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నారని పేర్కొన్నారు.

ఆ ప్రాంతాన్ని 22-ఎ పరిధిలోకి తీసుకొచ్చి భూ రిజిస్ట్రేషన్‌ను నిలుపుదల చేశారని, ఇది చట్ట విరుద్ధమని తెలిపారు. 272 కుటుంబాలు బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు వీలు కావడం లేదని, తక్షణం 22-ఎ నుంచి ఆ భూమిని డీనోటిఫై చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

23, 24 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా మెగా జాబ్ మేళా : కృతికా శుక్లా

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసి) ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కెరీర్ ఎక్స్‌పో పేరుతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఎపిఎస్ఎస్‌డిసి ఎండి, సిఇవో డాక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో . ఒక్కో జిల్లాలో నిర్వహించే కెరీర్ ఎక్స్‌పోకు 50 నుంచి 60 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, 23 వేలమంది ముఖ్యమంత్రి యువనేస్తం శిక్షణ లబ్ధిదారులతో పాటు డిప్లొమా, ఐటిఐ, డిగ్రీ, పిజి, ఇంజనీరింగ్ పూర్తిచేసిన 20 నుంచి 35 ఏళ్లలోపు వారు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. నిరుద్యోగ యువత 21 తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఎపిఎస్ఎస్‌డిసి వెబ్‌సైట్‌లో పేర్లను నమోదు చేసుకున్నవారు పోర్టల్లోని 'అప్‌కమింగ్ ఈవెంట్స్' విభాగంలో 'సెలక్ట్ జాబ్ ' సెక్షన్‌లో జాబ్‌మేళాపై క్లిక్ చేసి లాగిన్లై అప్లై చేసుకోవాలని, ఇక జాబ్‌మేళాకి మొదటిసారి అప్లై చేసుకుంటోన్న అభ్యర్థులు తమ పేర్లను https ://www.apssdc.in/home/candi-dateregisration లో నమోదు చేసుకోవాలని తెలిపారు. నిరుద్యోగ యువత దీన్ని సద్వినియోగపరుచుకోవాలని కృతికాశుక్లా సూచించారు.

ప్రత్యేకం

ఆరోగ్య కేంద్రాల్లో తగ్గుతున్న ప్రసవాలు

సదుపాయాల కొరతతో పెద్దాస్పత్రులకు పరుగులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరుగుతోందంటూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం అంతంతమాత్రమే! నిజానికి ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య కొన్ని సంవత్సరాలుగా తగ్గుతూ వస్తోంది. ఈ ఆరోగ్య కేంద్రాల్లో కనీస వసతులు లేకపోవడంతో గ్రామీణ ప్రభుత్వ పెద్దాసుపత్రులకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ఆ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరుగుతోంది. ఈ లెక్కలనే చూపిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మొత్తం ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరుగుతున్నట్లుగా చెప్పుకుంటోంది. ఇటీవల ముఖ్యమంత్రి విడుదల చేసిన శ్వేతపత్రంలోనూ ఇదే తరహా మాయాజాలానికి పాల్పడ్డారన్న విమర్శలు వస్తున్నాయి. 2014-15లో వైద్యవిధాన పరిషత్ కింద ఉన్న సిహెచ్‌సి, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో నిర్దేశిత లక్ష్యం కంటే అదనంగా 8 శాతం ప్రసవాలు జరగగా 2015-16లో 98 శాతం, 16-17లో 91.5 శాతం, 2017-18కి 92 శాతం మాత్రమే ప్రసవాలు జరిగాయి. అంటే, 2014-15 తరువాత నిర్దేశిత లక్ష్యాన్ని అందుకోలేక పోయాయి. ఈ అంశాలను మాత్రం ముఖ్యమంత్రి విడుదల చేసిన శ్వేతపత్రంలో ఎక్కడా పేర్కొనలేదు. గ్రామీణ ప్రజలకు చేరువలో ఉండే ప్రాథమిక, సామాజిక, ఏరియా ఆస్పత్రుల్లో వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. వైద్యుల కొరత వెంటాడుతోంది. పభుత్వ ఆస్పత్రుల్లో పడకలు పెంచామని, ఏపివివిపి ఆస్పత్రుల్లో ఈ నాలుగేళ్లలో 900 పడకలు పెరిగినట్లు వైద్యఆరోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. అయితే పెరుగుతున్న జనాభా మేరకు వాటి పెంపు నామమాత్రమేనని విమర్శలు వస్తున్నాయి. గత నాలుగేళ్లలో జిల్లా ఆస్పత్రుల్లో 9 మాతాశిశు సంరక్షణా కేంద్రాలను (ఎంసిహెచ్ బ్లాక్), కొత్తగా 5 సిహెచ్‌సిలను ఏర్పాటు చేసింది. వీటితో కలిపే పడకల సంఖ్య పెరిగినట్లు చెబుతున్నారు. మరోవైపు సిహెచ్‌సిల్లో గైనకాలజిస్ట్, అనస్థీషియన్, పిడియాట్రిషియన్, జనరల్ సర్జన్, ఫిజిషియన్ అందుబాటులో ఉండాల్సి ఉన్నా అనేక ఆసుపత్రుల్లో ఆ పరిస్థితి లేదు. ప్రసూతి కేసులు అత్యవసరమైతే సిజేరియన్ చేయాలన్నా, పుట్టిన బిడ్డకు ఏమైనా అనుకోని అనారోగ్యం వచ్చినా చికిత్స అందించేందుకు తప్పనిసరిగా పిడియాట్రిషియన్, అందుబాటులో ఉండాలి. వాటితోపాటు బ్లడ్ బ్యాంక్, ఎక్స్‌రే, స్కానింగ్, ఆక్సిజన్ సదుపాయాలు సిహెచ్‌సిలో ఉండాలి. ఇవన్నీ ఉంటే సిహెచ్‌సిలలో సేవలు మెరుగుపడతాయని పలువురు వైద్యులు సూచిస్తున్నారు.



జనాభాకు తగినట్లుగా లేని సిహెచ్‌సిలు, స్పెషలిస్టులు

2016 జాతీయ గ్రామీణ ఆరోగ్య గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 1.2 లక్షల మంది జనాభాకు ఒక సామాజిక ఆరోగ్య కేంద్రం అందుబాటులో ఉండాలి. ఆ ప్రకారం చూస్తే రాష్ట్రంలో 423 సిహెచ్‌సిలు అందుబాటులో ఉండాలి. కానీ ప్రస్తుతం దాదాపు 299 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అలాగే స్పెషలిస్ట్ వైద్యుల కొరత కూడా ఎక్కువగానే ఉంది. దాదాపు 800 మందికి పైగా స్పెషలిస్టులు అవసరముంటే ఇటీవల ఏపి వైద్యవిధాన పరిషత్ ప్రత్యక్ష నియామకాల ద్వారా 155 మంది గైనకాలజిస్ట్, అనస్థీషియన్లను నియమించారు. అయినప్పటికీ ఇంకా దాదాపు 600 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం.

24 సిహెచ్‌సిలకు 0 గ్రేడింగ్

సిహెచ్‌సిల్లో మానవవనరులు, మౌలిక సదుపాయాలు, మందులు, అందుబాటులో ఉన్న సేవలు, రోగిసంతృప్తి స్థాయి, సేవల వినియోగం అంశాలను కొలమానంగా తీసుకొని కేంద్ర వైద్యఆరోగ్యశాఖ హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్‌ఎమ్‌ఐఎస్) ద్వారా రాష్ట్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలకు గ్రేడింగ్ ఇచ్చింది. ఈ గ్రేడింగ్‌లో రాష్ట్రంలోని 24 సిహెచ్‌సిలలో 0 ర్యాంకును సొంతం చేసుకున్నాయి. దీనర్థం వీటిలో వైద్యులతో పాటు, వసతులు కూడా లేవనే!

పోటాపోటీగా సంప్రదాయ పడవల పోటీలు

- నేడు కోల ఫైనల్ పోటీలు
- నాకౌట్‌లో డ్రాగన్ పోటీలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-కృష్ణాజిల్లా ప్రతినిధి

కృష్ణాజిల్లా దివిసీమలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. నాగాయలంక శ్రీపాదక్షేత్రం పుష్కరఘాట్ వద్ద రాష్ట్ర పర్యాటకశాఖ, స్వచ్ఛ నాగాయలంక, నాగాయలంక పంచాయతీల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని శనివారం సంప్రదాయ పడవలు (కోల), మహిళలకు ముగ్గులు, లెమన్ అండ్ స్పూన్, బాల్ అండ్ త్రో పోటీలు నిర్వహించారు. పోటీలు ఆసక్తికరంగా సాగాయి. కోల పోటీలకు 16 జట్లు పోటీపడ్డాయి. 4 బ్యాచ్‌లుగా లీగ్ పద్ధతిలో పోటీలను నిర్వహించారు. ఒక్కో బ్యాచ్‌లో 4 బృందాలను నదిలోకి పంపారు. ఒక్కో పడవపైనా ఎనిమిది మంది బృందం తెడ్లు వేయగా మరొకరు చుక్కాని (మార్గ నిర్దేశకుడు)గా ఉన్నారు. 500 మీటర్లలో ముందు వరుస పడవల్లో బృందాలను విజేతలుగా గుర్తించారు. నాలుగు బ్యాచ్‌లలో మొదటిస్థానం వచ్చిన మరో నాలుగు టీంలకు సోమవారం ఫైనల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలను మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ జయరామిరెడ్డి, విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ గ్రంధి భవానీ ప్రసాద్ పడవ పోటీలను లాంచనంగా జెండా ఊపి ప్రారంభించారు. ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, టిడిపి కృష్ణాజిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి బచ్చుల అర్జునుడు తదితరులు పోటీలను తిలకించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సోమవారం ఉదయం నుంచి నాకౌట్ పద్ధతిలో డ్రాగన్ పడవ పోటీలు జరగనున్నాయి. సాయంత్రం సంప్రదాయ పడవల ఫైనల్ పోటీలు జరుగుతాయి.



తెనాలిలో భోగి మంటలు



ఐసిడిఎస్ వంటకాలను పరిశీలిస్తున్న నారా భువనేశ్వరి, బ్రాహ్మణి

సంక్రాంతి ఆటాపాటా

ప్రజాశక్తి యంత్రాంగం

సంక్రాంతి సందర్భంగా రాష్ట్రంలో అనేక జిల్లాల్లో సంప్రదాయ పద్ధతిలో సంబరాలు నిర్వహించారు.

గుంటూరు జిల్లా తెనాలిలో మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన గంగిరెద్దుల విన్యాసాలు, చెక్కభజనలు, రంగవల్లులు అలరించాయి. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆయా కార్యక్రమాల్లో నాయకులు జనసేన అధినేత పవన్ కళ్యాణ్, మనోహర్,తోట చంద్రశేఖర్, మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు, శ్రీధర్, టి.వెంకటరమణారావు, మేకల రవి కుమార్, ఎ.హరికృష్ణ, కాలేషా, జి.వేణు, వి.మురళి పాల్గొన్నారు.

దుగ్గిరాలలో దోస్ట్ సంస్థ ఆధ్వర్యంలో సంబరాలు ఆదివారం అత్యంత సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. బోగిమంటలు, రెండు కిలోమీటర్ల మేర ఎడ్లబండ్ల వరుసలు, కొత్తబియ్యంతో మహిళలు చేసిన పొంగలి, గాలిపటాలు, రంగవల్లులు, ఇతర పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. సంబరాల్లో అమెరికా నుండి వచ్చిన తానా మాజీ అధ్యక్షులు జంపాల ఈశ్వర్‌చౌదరి, అమెరికాలోని ప్రముఖ బీమా కంపెనీ సిగ్నా మేనేజర్ డైరెక్టర్ డాక్టర్ అజని, మరికొందరితో పాటు వారి అమెరికా స్నేహితులు పాల్గొన్నారు. సినీనటి టీనాచౌదరి కూచిపూడి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చేతుల్లో తలపై అగ్నిపిడతలు పెట్టుకొని గ్లాసులు, మేకులపై నాట్యం చేయడం అందర్నీ మంత్రముగ్ధుల్ని చేసింది.

నారావారిపల్లిలో బాబు కుటుంబం

సిఎం స్వగ్రామం నారావారిపల్లెలో సంక్రాంతి సందడి మొదలైంది. పండగకు నారా కుటుంబ సభ్యులు రావడంతో ఆదివారం నారావారిపల్లి టిటిడి కళ్యాణ మండపంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఉదయం 10:30 గంటలకు నారా భువనేశ్వరి గ్రామస్తులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో నారా భువనేశ్వరి మాట్లాడుతూ నలుగురికీ ఆదర్శంగా ఉండాలనే ఉద్దేశంతోనే పది సంవత్సరాలుగా తమ కుటుంబ సభ్యులందరూ నారావారిపల్లెలో సంక్రాంతి పండగను వైభవంగా జరుపుకుంటున్నామన్నారు. అనంతరం ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళలకు నారా భువనేశ్వరి, నారా దేవాన్ష్ బహుమతులు అందజేశారు. నారావారిపల్లె పరిసర గ్రామాలైన పుల్లయ్యగారిపల్లె, ఎ.రంగంపేట, కందులవారిపల్లె, శేషాపురం, బి.కొంగరవారిపల్లె, చిన్నరామాపురం, భీమవరం, యల్లంపల్లె, కొండ్రెడ్డికండ్రిగ పంచాయతీల్లోని విద్యార్థినులకు మ్యూజికల్ చైర్స్, బెలూన్ బ్లాస్టింగ్, షటిల్ రన్నింగ్, తదితర పోటీలు నిర్వహించారు. నారావారిపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రంలో సంక్రాంతి పండగ సందర్భంగా తిరుపతి సిమ్స్ డాక్టర్లతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 500 మంది రోగులకు వివిధ చికిత్సలు చేసి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. స్విమ్స్ ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన కోసం ఏర్పాటు చేసిన పింక్ బస్సును సందర్శించారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పలు వంటకాలతో ప్రదర్శనలు నిర్వహించారు. వంటల స్టాల్స్‌ను నారా బ్రాహ్మిణి, నారా భువనేశ్వరి పరిశీలించారు.

మరో వివాదంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్

- సబ్ కలెక్టర్ మిషా సింగ్ సూచనలతో రంగంలోకి దిగిన పోలీసులు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

రెవెన్యూ అధికారులతో పాటు విజయవాడ సబ్‌కలెక్టర్ మిషాసింగ్ పట్ల అనుచితంగా ప్రవర్తించి, ఆమె విధులకు ఆటంకం కలిగించిన ఘటనలో పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌పై జిల్లా అధికార యంత్రాంగం చర్యలకు సిద్ధమైంది. పెనమలూరు నియోజకవర్గం వణుకూరు గ్రామంలో ఎమ్మెల్యే అనుచరులు పుల్లేరు కాలువ, ప్రభుత్వ పోరంబోకు భూములను అక్రమంగా తవ్వుతుండగా శనివారం అడ్డుకున్న రెవెన్యూ సిబ్బందిపై ఎమ్మెల్యే జులుం ప్రదర్శించి సీజ్ చేసిన జెసిబిని సైతం తీసుకెళ్లారు. అక్కడకు వెళ్లిన సబ్ కలెక్టర్ విధులకు సైతం ఆటంకం కలిగించేలా ఎమ్మెల్యే ప్రవర్తించారు. దీంతో రెవెన్యూ అధికారుల సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న విజయవాడ సబ్ కలెక్టర్ మిషాసింగ్ విధులను అడ్డగించినందుకు, ఆక్రమణ దారులకు కొమ్ముకాసినందుకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, వైస్ ఎంపీపీ కోయ ఆనంద్, కంకిపాడు ఎంపీపీ దేవినేని రాజా, అక్రమణ దారుడు పుట్టగుంట రవిలపై కేసు నమోదు చేయమని సంబంధిత ఏరియా ఏసీపీ అంకినీడు ప్రసాద్, సీఐ పెద్దిరాజులకు సబ్ కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే వైఖరిపై జిల్లా ఉన్నతాధికారులు సైతం ఒకింత సీరియస్‌గా ఉండటంతో ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకునే యోచనలో పోలీసులు ఉన్నట్లు తెలిసింది.

సతీష్‌చంద్రను కలిసిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్

ఈ వివాదం తన మెడకు ఉచ్చు బిగుస్తున్న క్రమంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆఘమేఘాల మీద ఆదివారం కొందరు నాయకులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసేందుకు వెళ్లారు. అయితే ముఖ్యమంత్రి అందుబాటులో లేకపోవడంతో సిఎం కార్యదర్శి సతీష్‌చంద్రను కలిశారు. ఈ మేరకు జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన జరిగిన ఘటనపై వివరణ ఇచ్చారు. ముఖ్యమంత్రి అందుబాటులో లేకపోవడంతో సతీష్ చంద్రను కలిసి ఘటన జరిగిన తీరును తెలిపానని, మరో రెండు రోజులలో ముఖ్యమంత్రిని సైతం కలుస్తానని బోడే వివరించారు. రైతులకు అండగా నిలబడటం తాను చేసిన తప్పు అన్నట్లుగా ఉందని, రైతు తప్పు చేసినట్లు నిరూపిస్తే తాను ఫైన్ చెల్లిస్తానని సబ్ కలెక్టర్ మీషాసింగ్‌కు చెప్పినా వినిపించుకోలేదన్నారు. హంతకుని ఆఫీసు తనిఖీ చేసినట్లు నా ఆఫీసును తనిఖీ చేశారన్నారు.



కొత్త ప్రాంతాల్లో పందేల బరులు ?

- నాలుగు జిల్లాల్లో వెయ్యికిపైనే
- పోలీసులపై ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు
- 'నోట్ల'తో అడ్డుకట్ట

ప్రజాశక్తి ఏలూరు/ రాజమహేంద్రవరం ప్రతినిధులు

ఈసారీ కోడిపందేలు యథేచ్ఛగా సాగిపోనున్నాయా పాలకపక్ష పెద్దల నుంచి పరోక్షంగా గ్రీన్‌సిగ్నల్ వచ్చేసిందా.. భోగిరోజైన సోమవారం నుంచి పందేలు ముమ్మరం కానున్నాయా అంటే అవుననే సమాధానం వస్తోంది. ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పందేల కోసం బరులు సిద్ధమయ్యాయి. నాలుగు జిల్లాల్లో దాదాపు వెయ్యికిపైనే బరులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈసారి కొత్త ప్రాంతాల్లో బరులు ఏర్పాటు చేశారు. ఎలాంటి హడావిడీ లేకుండా నిర్వహణకు సన్నాహాలు పూర్తయ్యాయి. గుండాట, పేకాటకూ రంగం సిద్ధమైంది. మద్యం ప్రియుల కోసం దాన్నీ సిద్ధం చేస్తున్నారు. సోమవారం భోగి రోజు నుంచి మూడు రోజులు గ్రామాలు పందేలతో సందడిగా మారనున్నాయి. కోడిపందేల నిర్వాహకులు ఈసారి గుట్టు చప్పుడు కాకుండా బరులను సిద్ధం చేశారని ప్రచారం జరుగుతోంది. కో'ఢీ' కోసం పోలీసులు, రెవెన్యూ శాఖలపై ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారీ రాజకీయ ఒత్తిళ్లు పనిచేశాయి. పండుగ మూడు రోజుల్లో పోలీసుల నిఘా అధికంగా ఉంటుందని భావించి అనేక ప్రాంతాల్లో ప్రస్తుతం పోలీసుల జాడ లేదు. పందేల జోలికి వెళ్లొద్దని ఎంఎల్ఏలు ఆదేశించడంతో పోలీసులు వెనుకడుగు వేశారని ప్రచారం జరుగుతోంది. పోలీసులు, రెవెన్యూ అధికారులను 'నోట్ల కట్టల'తో నిర్వాహకులు అదుపు చేశారనే ప్రచారం జరుగుతోంది. కేసులు పెట్టుకునేందుకు కొందరి పేర్లు తామే ఇస్తామని నిర్వాహకులు పోలీసులకు చెప్పారనే ప్రచారం జరుగుతోంది. దీంతో పోలీసులు బరి వద్దకు వెళ్లడంలేదు.టిడిపి నేత రఘురామకృష్ణంరాజు పందేలకు శ్రీకారం చుట్టి చేసిన వ్యాఖ్యలే దీనికి నిదర్శనంగా చెబుతున్నారు. ఇప్పటి వరకూ తెగ హడావుడి చేసిన పోలీసులు పండుగ మూడు రోజులూ స్టేషన్లకు పరిమితం కావాల్సిందేననే చర్చ సాగుతోంది. టిడిపి నేత రఘురామకృష్ణంరాజు గతంలో మాదిరిగానే ఈసారి పెదఅమిరంలోని తన నివాసంలో డింకీ పందేలంటూ రెండు కోడి పుంజులను పోట్లాటకు వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిపందేలు సంక్రాంతి సంప్రదాయమని, హింస లేకుండా ఉండాలని సిఎం గతంలోనే చెప్పారంటూ తెలిపారు. భోగిరోజు నుంచి పండుగ మూడురోజులు యథావిధిగా పందేలు జరగనున్నట్లు పందెంరాయుళ్లు ఘంటాపథంగా చెబుతున్నారు. ఈసారి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా మొత్తం 600కు పైగా బరుల్లో కోడిపందేలు జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈసారి రూ.200 కోట్లు వరకూ చేతులు మారనున్నట్లు అంచనా వేస్తున్నారు. భీమవరం ప్రాంతంలో వెంప, జంగారెడ్డి గూడెం మండలం శ్రీనివాసపురం, దెందులూరు నియోజకవర్గంలో, పాలకొల్లు ప్రాంతంలో పెద్దఎత్తున పందేలు సాగనున్నట్లు చెబుతున్నారు. . తూర్పుగోదావరి కోనసీమలో పగలు, రాత్రి సమయాల్లో పందేలు నిర్వహించాలని నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారని సమాచారం. ఐ.పోలవరం మండలం మురమళ్లలో రెండేళ్లుగా భారీస్థాయిలో పందేలు జరిగాయి. అయితే పోలీసుల ఆంక్షల నేపథ్యంలో ఈసారి ప్రదేశం మార్చారని చెబుతున్నారు. అల్లవరం, అంబాజీపేట, మలికిపురం, రావులపాలెం ప్రాంతాల్లో గతేడాది నిర్వహించిన ప్రాంతాల్లో కాకుండా వేరే చోట బరులు సిద్ధమయ్యాయని ప్రచారం జరుగుతోంది. అనపర్తి మండలంలో ఆరు చోట్ల పందెం బరులు సిద్ధమయ్యాయి. ఆదివారం రాత్రి నుంచే పందేలు, జూదం, గుండాట నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. ఆత్రేయపురం మండలం తాడిపూడి, ర్యాలి, లొల్ల, పులిదిండి, పేరవరం గ్రామాల్లో బరులు సిద్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న తహశీల్దారు పి.రామోజీ, ఎస్ఐ కె.నాగరాజు యజమానులకు నోటీసులు జారీ చేసినప్పటికీ రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో సోమవారం నుంచి పందేలకు రంగం సిద్ధమైంది. కాట్రేనికోన మండలం గెద్దనాపల్లి, చెయ్యేరు, నడవపల్లి, పల్లంకుర్రు ప్రాంతాల్లో బరులు సిద్ధమయ్యాయి.

కృష్ణా నది పరివాహక ప్రాంతంలో రెండు ఎకరాలకుపైగా స్థలంలో రెండు బరులను ఏర్పాటు చేశారు. టిడిపి జెండాలు, ఫ్లెక్సీలతో పెద్ద తిరుణాళ్లనే తలపించేలా ఏర్పాట్లు చేశారు. పోటీలను స్థానిక ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ సాయంత్రం ఆరు గంటలు దాటిన తర్వాత వీక్షించడం గమనార్హం.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-చిత్తూరు నగరం

స్మగ్లర్లు ఉపయోగించిన వాహనం సహా 80 ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన ఆదివారం పాకాల మండలం నేంద్రగుంట వద్ద చోటుచేసుకుంది. పోలీసులకు అందిన సమాచారం మేరకు ఆదివారం నేంద్రగుంట రోడ్డుపై రాజ ఇండ్లు బస్టాప్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. టాటా ఇండిగో వాహనంలోని వారు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేశారు. అందులోని 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను విచారించగా పెనుమూరు - నేంద్రగుంట అడవి ప్రాంతం వద్ద ఎర్రచందనం దుంగల డంప్ ఉందని చెప్పారు. దీంతో పోలీసులు అక్కడ కూడా తనిఖీ చేపట్టారు. మరో 60 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో ఒక ఇండిగో వాహనం. ఒక టన్ను 83 కేజీల బరువు గల 70 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మావుళ్లమ్మ ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మావుళ్లమ్మ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 32 రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలను నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం, దాతల సహకారం, మావుళ్లమ్మ దేవస్థానం సౌజన్యంతో ఉత్సవ కమిటీ నాయకులు ప్రారంభించారు. అమ్మవారి పలు రూపాలతో కూడిన భారీ సెట్టింగ్స్‌ను ప్రధాన రహదారుల ముఖద్వారాల వద్ద విద్యుత్ దీపాలంకరణతో ఏర్పాటు చేశారు.



కూలిన అమ్మవారి ఆలయ ప్రహరీగోడ

ప్రజాశక్తి-శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబదేవి ఆలయ ప్రహరీగోడ శనివారం రాత్రి కూలిపోయింది. ఘటన స్థలాన్ని ఆలయ అధికారులు ఆదివారం పరిశీలించారు. ప్రహరీ గోడ వందల ఏళ్లనాటి కట్టడాలు కావడంతో బలహీన పడ్డాయన్నారు. నిర్మాణ పనుల సమయంలో గోడ కూలిందన్నారు. భక్తులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందన్నారు.

కర్నూలు డిఎంహెచ్‌ఒలో అగ్నిప్రమాదం

- పోలియో వ్యాక్సిన్‌లు, ఇతర పరికరాలు దగ్ధం
- రేకెత్తిస్తున్న పలు అనుమానాలు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ప్రాంగణంలోని శీతలీకరణ భవన సముదాయంలో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దాదాపు రూ. 50 లక్షల విలువ చేసే పోలియో వ్యాక్సిన్‌లు, ఇతర సామాగ్రి కాలిపోయాయి. డిఐఒ డాక్టర్ వెంకటరమణ వివరాల మేరకు..జిల్లా ఇమ్యునైజేషన్ భవనంలో పోలియో, ఎంఆర్, రోటోవైరస్, టిటి, హెపటైటిస్ వంటి వ్యాక్సిన్‌లు నిల్వ ఉంచుతారు. ఫిబ్రవరి 3న చేపట్టనున్న పోలియో కార్యక్రమంలో వినియోగించేందుకు 6,40,000 వ్యాక్సిన్లను 32 వేల వాయిల్స్‌లో నిల్వ ఉంచాం. ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బంది రూరల్ సర్కిల్ పోలీసు స్టేషన్ వెనుక భాగంలో దట్టమైన పొగలు రావడాన్ని గుర్తించి మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు సమాచారమిచ్చారు. పెద్దాసుపత్రిలోని పోలీసు అవుట్‌పోస్టు ఏఎస్ఐ రవికుమార్, కానిస్టేబుల్ నాగరాజులు సంఘటనను గుర్తించి అగ్నిమాపక శాఖ సిబ్బందికి విషయం తెలిపారు. మూడు ఫైరింజన్‌లు, దాదాపు 30 మందికి పైగా ఫైర్ సిబ్బంది మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో నిల్వ ఉంచిన పోలియో వ్యాక్సిన్లు అన్నీ కాలిపోయాయి. దాదాపు రూ.50 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించింది. సమాచారం తెలుసుకున్న కర్నూలు ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తక్షణమే వ్యాక్సిన్‌లు తెప్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బూడిదైన వ్యాక్సిన్లు, ఫర్నీచర్

శీతలీకరణ భవన సముదాయంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భవనంలో ఉన్న మందులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సరఫరా చేయాల్సి ఉండగానే ఇక్కడే ఉంచినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ మందులు కాలం చెల్లిపోవడంతో ఉద్దేశ్య పూర్వకంగానే వాటిని దగ్ధం చేసినట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

మరోపక్క శీతలీకరణ కేంద్రంలో ఫ్రిడ్జ్‌లు, వాకింగ్ కూలర్స్, వాకింగ్ రిఫ్రిజిరేటర్‌లు మైనస్ డిగ్రీలకు చేరుకున్నప్పుడు మళ్లీ యథాస్థితికి తీసుకొచ్చేందుకు సిబ్బంది అక్కడే ఉండాలి. ఆదివారం వైద్యాధికారుల నిర్లక్ష్యం వలనే కూలింగ్ సరిచేసే సిబ్బంది లేకపోవడంతో విద్యుత్ హైఓల్టేజ్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని మరికొందరి వాదన. అగ్ని ప్రమాదం జరిగిన భవనం పక్కనే ఒక గోదాము ఉంది. ఈ గోదాములో మందుల కొత్త స్టాక్ దింపినట్లు సమాచారం. ఈ మందులన్నీ మైనస్ డిగ్రీల్లోనే పెట్టాలి. అయితే వీటిని పెట్టాలంటే పాత మందులన్నీ తొలగించాల్సి ఉంది. అందులోనూ పాతమందులన్నీ కాలం చెల్లిపోవడం, రూ. లక్షల ధనం దుర్వినియోగం బయటపడుతుందని అగ్నిప్రమాదం సృష్టించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మరింత విచారణ చేపడతాం : సిఐ హనుమంతప్ప

డిఎంహెచ్‌ఒ కార్యాలయంలోని ఇమ్యునైజేషన్ అధికారి కార్యాలంలో సిసి కెమెరాలు బిగించే సమయంలో వైరింగ్ లూజుగా ఉండడం వల్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఈ సంఘటనపై మరింత లోతుగా విచారణ చేపడతామన్నారు.

కలగానే సొంతిల్లు

ఎన్నికల అస్త్రంగా టిడిపి పావులు

విజయవాడలో పూర్తికాని గృహ నిర్మాణాలు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

నవ్యాంధ్ర రాజధాని విజయవాడలో సామాన్యుడి ఇంటి కల కలగానే మిగిలిపోతోంది. నాలుగున్నరేళ్ల క్రితం ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే ఇళ్లను నిర్మించి పేదల సొంతింటి కలను నిజం చేస్తామని ప్రకటించిన నేతలు ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు.

విజయవాడ నగరం రాజధానిగా మారిన తర్వాత ఇక్కడి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలతో పాటుగా పలు ప్రయివేటు సంస్థల కార్యాలయాలకు ఇక్కడికి రావడంతో అద్దె ఇళ్లకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. ఇలాంటి పరిస్థితిలో నాలుగున్నరేళ్ల క్రితం వచ్చిన ఎన్నికల్లో తాము అధికారం చేపడితే పేదల సొంతింటి కలను నిజం చేస్తామని ఎన్నికల్లో టిడిపి నేతలు హామీలు గుప్పించారు. ఆ తర్వాత 2016 ఏప్రిల్ 14న జక్కంపూడి కాలనీలో 28,630 గృహాలను రెండు దశల్లో జి ప్లస్ త్రీ పద్ధతిలో నిర్మించేందుకు సిఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. అందులో 10,500 గృహాలను ఎపి టిడ్కోకు కాంట్రాక్టును ఇచ్చారు. దీనికి



టెండర్లను కూడా ఖరారు చేశారు. అయితే నిర్మాణాలకు సరిపడా స్థలాన్ని మాత్రం కేటాయించలేదు. దీంతో ఇప్పటికీ కనీసం 5 వేల గృహాలనూ నిర్మించలేని దుస్థితి నెలకొంది. కానీ పాలకులు మాత్రం ఎన్నికల సమయానికే మొత్తం ఇళ్లను నిర్మించి ఇస్తామని చెపుతున్నారు. నాలుగున్నరేళ్లుగా నిర్మాణం సాధ్యం కాని గృహాలు కేవలం రెండు మూడునెలల్లో ఎలా నిర్మిస్తారనేది బేతాళ ప్రశ్నగా మిగిలింది. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని సింగ్‌నగర్, రాజేశ్వరిపేట వంటి ప్రాంతాల్లో పదేళ్ల క్రితం మూడువేల నివాసాలను నిర్మిస్తామని శంకుస్థాపనలు చేశారు. కానీ వాటిని నేటికీ పూర్తి చేయలేదు. నాలుగున్నరేళ్ల క్రితం ఎన్నికల సమయంలో సెంట్రల్ ఎంఎల్ఎ బోండా ఉమామహేశ్వరరావు ఎన్నికల ప్రచారంలో తాను అధికారంలోకి వస్తే ఈ ఇళ్లను నిర్మిస్తానని హామీనిచ్చారు. తర్వాత ఈ ప్రాంతాల్లో ఆయన అసలు కనిపించడమే మానేశారని ప్రజలు వాపోతున్నారు. ఎన్నికల సమయం దగ్గరపడడంతో ఇప్పుడు ఆయన ఈ ఇళ్ల నిర్మాణాల పల్లవిని మళ్లీ ఎత్తుకున్నారు.

పెరిగిన అద్దెలు

నగరంలో ఏ ప్రాంతంలో చూసినా అద్దెలు విపరీతంగా పెరిగిపోయాయి. కనీసం రూ.7 వేల నుంచి రూ.20 వేలు పెడితే గానీ అద్దె ఇల్లు దొరికే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో పేదలు ఇటు అద్దెలు చెల్లించలేక, అటు సొంతింటి కల సాకారం కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చే ఇంటి నిర్మాణానికి రూ.10 వేలు చెల్లిస్తే బ్యాంకు రూ.50 వేలు రుణంగా ఇచ్చేది. మిగిలింది ప్రభుత్వం వాటాగా వేసి ఇంటిని నిర్మించేది. కానీ నేడు దాన్ని రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షలకు ప్రభుత్వం పెంచేసింది. దీంతో లబ్ధిదారుడు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఏరో స్పోర్ట్స్ ఫెస్ట్ ప్రారంభం


ఐటిడిఎ ఆధ్వర్యాన 16వ తేదీ వరకూ నిర్వహణ

ప్రజాశక్తి- సీతంపేట (శ్రీకాకుళం జిల్లా)

రాష్ట్రంలోనే ప్రప్రథమంగా ఏరో స్పోర్ట్స్ ఫెస్టివల్‌కు శ్రీకాకుళం జిల్లా సీతంపేటలోని ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కు వేదికైంది. సాహసం చేయరా డింభకా నినాదంతో ఐటిడిఎ ఆధ్వర్యాన చేపట్టిన ఈ ఫెస్ట్‌ను జిల్లా కలెక్టర్ కె.ధనంజయరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ నెల 16వ తేదీ వరకూ ఈ ఫెస్ట్ జరగనుంది. హాట్ ఎయిర్ బెలూన్‌లో కలెక్టర్, ఐటిడిఎ పిఒ ఎల్.శివశంకర్ విహరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి సాహస క్రీడలు నిర్వహించడం రాష్ట్ర చరిత్రలో వినూత్నమని తెలిపారు. ఐటిడిఎ పిఒ శివశంకర్ మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి 15 మంది పైలెట్లు ఇందులో భాగస్వామ్యమయ్యారని తెలిపారు. ఐటిడిఎకు చెందిన ఇద్దరు పైలెట్లు, 40 మంది సహాయక సభ్యులు ఈ ఫెస్ట్‌లో ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. పారా సెయిలింగ్‌లో పాల్గొనేందుకు రూ.200, హాట్ ఎయిర్ బెలూన్‌కు రూ.500, పారా మోటరింగ్‌కు రూ.వెయ్యి టికెట్ ధర నిర్ణయించామని తెలిపారు. ఇప్పటివరకూ 240 మంది ఐటిడిఎ సీతంపేట వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకున్నట్లు చెప్పారు.

ప్రముఖ విద్యావేత్త ఎస్‌ఎం కొండయ్య మృతి

నేడు అంత్యక్రియలు




ప్రజాశక్తి- విజయవాడ అర్బన్


ప్రముఖ విద్యావేత్త, అనూబుక్ కార్పొరేషన్ అధినేత సుంకె మాలకొండయ్య (సుకుమార్) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన వయస్సు 82 సంవత్సరాలు. శనివారం మధ్యాహ్నం విజయవాడ మారుతీనగర్ మసీదువీధిలోని స్వగృహంలో మృతిచెందిన ఆయన రాష్ట్రమంతటా సుపరిచితులు. ప్రకాశం జిల్లా కనిగిరి ప్రాంతానికి చెందిన ఆయన విజయవాడలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే ...పబ్లికేషన్స్ రంగంలో అడుగుపెట్టారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలలకు అవసరమైన విద్యాబోధన, బోధనేతర మెటీరియల్‌ను రాష్ట్ర మంతటా పరిచయం చేసిన పబ్లిషర్‌గా పేరొందారు. వివిధ పుస్తకాల ప్రచురణ ద్వారా ఎంతో మందికి మార్గదర్శకంగా నిలిచారు. ఆయన కుమారులు ఇప్పటికీ పబ్లికేషన్స్ను నిర్వహిస్తున్నారు. కుమారుల్లో మురళీ అనుపాంట్ మురళీగా ప్రసిద్ధిచెందారు. అమెరికాలో ఉన్న ఆయన కుమారుడు సోమవారం ఉదయం నగరానికి రానున్నారు. ఉదయం 11 గంటలకు మాలకొండయ్య భౌతికకాయానికి అంత్యక్రియలు జరగనున్నాయి.

31న రాజకీయ నిర్ణయం : కాపు జెఎసి

ప్రజాశక్తి - కాకినాడ

కాపుల రిజర్వేషన్ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఖరి అనుకూలంగా లేనందున ఈనెల 31న కత్తిపూడిలో జరిగే రాష్ట్రస్థాయి కాపు జెఎసి సమావేశంలో రాజకీయపరమైన నిర్ణయం తీసుకుంటామని కాపు జెఎసి నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడరూరల్ రమణయ్యపేటలోని ఆయన స్వగృహంలో ఆదివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి ఏసుదాసు, ఆకుల రామకృష్ణ, నల్లా విష్ణు తదితరులు మాట్లాడారు. కాపులను బిసిల్లో చేరుస్తామని, కాపుల పిల్లలకు ఎల్‌కెజి నుంచి పీజీ వరకూ ఉచితంగా విద్యనందిస్తామని, ఏటా రూ.1000 కోట్ల నిధులను కాపుల అభివృద్ధికి కేటాయిస్తామని గత ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం మొదటిసారిగా తునిలో సమావేశం నిర్వహించామని తెలిపారు.





కొడిగట్టిన నక్షత్ర నీడల్లో జడుస్తూ
నడిచిన కాలానికి / శాద్వలంలా
పరుచుకున్న కాంతి
స్వాగతపతాకాలెత్తింది
వర్షంలా కురిసిన హిమతమస్సులో
వణుకు పుట్టిన కాలవిహంగానికి / చైతన్యంలా
ఉబికి వచ్చిన సంక్రాంతి/ సరికొత్త లెక్కలందించింది.

– సి నారాయణ రెడ్డి

సంక్రాంతి బోధ

శోభ మోస్తూ, వచ్చిన సంక్రాంతి
సుబోధ చేస్తోంది గ్రహించండి
శుభం పలుకుతోంది చెవినపట్టండి

మూలపడిన మేజాలు, దర్వాజాలే కాదు
బూజు పట్టిన భావాల్ని
పోగు పడ్డ విభేదాల్ని
నష్టపరిచే నమ్మకాల్ని
అక్కరకు రాని ఆవేశాల్ని
రక్కున కూల్చేయమంటూ
మంటల్లో కాల్చేయమంటూ
వెచ్చగా చెబుతోంది భోగి పండుగ!

ఇరు భుజాల నుంచి
బతుకు తెరువు బరువుల్ని కొంచెం దించి
పిలిచిన పలికే పల్లెను చేరి
నిన్ను తలిచే వాడను చేరి
దూరమైన హితుల్ని చూసి
ఊరంతా బంధువులని తలచి
కాలం చేసిన పెద్దల కొలిచి
కలిసి నడవడమే కుశలం కాదా అంటూ
కలకాలం ఇదే స్ఫూర్తి పాటించమంటూ
ఆర్తితో చెబుతోంది సంక్రాంతి!

పాడి పంటల నొసగే
నీ కనుల పండుగై నిలిచే
ప్రకృతినీ, పశువులను ఆదరించాలని
దోస్తులుగా భావించాలని
కమ్మగా చెబుతోంది కనుమ!

మూడు రోజుల సందడినీ,
ముచ్చటైన సంస్క తినీ
పండుగ చెప్పిన సంగతినీ
ఏడాది పొడవునా గుర్తుంచుకొందాం
గుండెలో దాచుకుని ముందుకి పోదాం


– డా.డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ,
94408 36931


19న ఏడవ రుతువు ఆవిష్కరణ

కవయిత్రి వైష్ణవిశ్రీ కవిత్వ సంపుటి ఏడవ రుతువు ఆవిష్కరణ సభ ఈనెల 19వ తేదీ శనివారం సాయంత్రం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో జరుగుతుంది. ఆరోజు సాయంత్రం 5.30 గంటలకు జరిగే ఈ సభలో ప్రముఖ సాహిత్య విమర్శకులు తెలకపల్లి రవి, సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సత్యరంజన్, వొర్రప్రసాద్ తదితరులు పాల్గొంటారు.

ఇద్దరు కథకులు.. రెండు కథలు

సందర్భం





ప్రేంచంద్ పేరు భారతదేశంలో చాలామందికి తెలుసు. ఆయన సాహిత్యం తెలుగులోకి కూడా విరివిగా అనువాదమైంది. 1880లో పుట్టిన ప్రేంచంద్ 1936లో తన 56 ఏళ్ల వయసులోనే మరణించారు. ప్రేంచంద్ పుట్టిన ముప్పై అయిదేళ్ళ తరువాత తెలుగుగడ్డ మీద రచయితలకే రచయిత అని పేరు పొందిన చాగంటి సోమయాజులు (చాసో) పుట్టాడు. ప్రేంచంద్ రాసిన ఆఖరి కథ 'కఫన్'. చాసో 1968లో రాసిన 'బండపాటు' కథకూ, ప్రేంచంద్ 1936లో రాసిన 'కఫన్' కథకూ కొన్ని పోలికలు కనిపిస్తాయి. మనుషులు అమానవీకరణ చెందిన తీరునూ, దానికి దారితీసిన పరిస్థితులనూ ఈ ఇద్దరూ ఎలా వివరించాలో పరిశీలించటం ఆసక్తికరమైన వ్యాపకం.

ప్రేంచంద్, చాసోల రచనల్లో ముఖ్యమైన పోలిక ఏమిటంటే ఇద్దరూ, జీవితంలో మనం ఉన్నాయనుకునే విలువలన్నీ కూడా ఆర్థిక చట్రాన్ని దాటినవి కావు అన్న వాస్తవాన్ని గుర్తిస్తూ నిరూపిస్తూ రచనలు చేసినవారే! బతుకు సూక్ష్మాన్ని గ్రహించి కథలు రాసిన రచయిత చాసో. అందుకే ఆయన కథలు నిండుగా ఉంటాయి. వైవిధ్యభరితంగా ఉంటాయి. ఈ వైవిధ్యంతోబాటు ఆయన కథల్లోని అంతస్సూత్రం ఒకటే! పరిస్థితులను తట్టుకుంటూ, అలవాటు పడుతూ, బయటపడే మార్గాలు వెదుకుతూ, మనిషి పోరాడతాడు. ఈ పోరాటంలో ఆర్థిక శక్తుల ప్రభావం కీలకమైనది. తన కథలకు తనే పెద్ద విమర్శకుడై, ఎలాంటి మమకారం లేకుండా పొదుపుగా యాభై లోపు కథలను మనకు అందించి, కథకుడిగా తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు చాసో.

కథకుడిగా నెమ్మదిగా ఎదుగుతూ వచ్చి పరిణతి సాధించిన మేధావి ప్రేంచంద్. ప్రేంచంద్ కాలంనాటి హిందీ సాహిత్యం కూడా మబ్బుల్లోనే విహారం చేస్తుండేది. ఆ పరిస్థితుల్లో ఒక్కసారిగా కథను కిందకి దించి నేలమీద నడిపించిన రచయిత ప్రేంచంద్. పేదరైతులూ, కూలీలూ, గ్రామీణ జీవితం... వీటిమీద ఆయన దృష్టి పెట్టాడు. మతం, ఆచారాలు గ్రామీణుల అమాయకత్వం మీద ఆడుకుంటున్నాయని గ్రహించాడు. ఉత్తర భారతదేశంలో భూమి, డబ్బు చేతుల్లో ఉన్నవాళ్ళు వడ్డీ వ్యాపారంలోకి దిగి పేదలను పీడించారు. మతాచారాల పేరుతో అజమాయిషీ, వాళ్ళు చెప్పినట్టు చెయ్యకపోతే నరకానికి పోతామనే నమ్మకంతో ఉండే అమాయకమైన రైతులూ.. ఇలాటివాళ్ళంతా ఉన్న గ్రామీణ సమాజాన్ని చూశాడు ప్రేంచంద్. జమీందార్లూ దోచుకునేవాళ్ళూ లేని గ్రామీణ భారతం కావాలని ఆశించాడు. రైతులు పటిష్టంగా ఉండే భారతదేశం కావాలని కోరుకున్నాడు.

చాసో, ప్రేంచంద్ ఇద్దరూ కూడా మనం బతుకుతున్న మార్గానికి మించిన ఉన్నత మార్గం, అందరూ సౌఖ్యంగా బతికే ఇంకేదో మార్గం ఉంది, అది మనకి కావాలి అని ఆశించిన వాస్తవికవాదులే! చాసో ఆ మార్గం మార్క్సిజం అని నిర్ధారణకు వచ్చాడు. చాసో రాసిన 'బండపాటు' కథలో కొండల్లో బండలు కొట్టుకుంటూ బతికే జనం ఉంటారు. అందులో రామిగాడు ఒకడు. అతనో పెద్ద బండ నెత్తిమీద పడి అక్కడికక్కడే చనిపోతాడు. మేస్త్రి సత్యం తెలివైనవాడు. లోకం తీరు తెలిసినవాడు. ఇలాంటి చావులను చూడటం, వాటిని లాభానికి వాడుకోవటం అతనికి అలవాటైపోయింది. రామిగాడు చచ్చిపోగానే కాంట్రాక్టర్ మీద దెబ్బలాటకి వెళ్లి లోపాయకారీగా డబ్బులు వసూలు చేస్తాడు. ఆ డబ్బులో ఓ మూడు వందలు రామిగాడి భార్య పార్వతికి ఇస్తాడు. శవదహనం అయ్యాక అందరికీ విందు ఏర్పాటు చేస్తాడు. తానో రెండొందలు నొక్కేస్తాడు. అక్కడ ఏమేం జరుగుతున్నాయో 'కనిపెడుతూ' ఉండే కనకమ్మ అనే మరో కూలీ తనకో కోక కొనిమ్మని డిమాండ్ చేస్తుంది సత్యాన్ని. కథ పొడవునా కనకమ్మా, మేస్త్రీల మధ్య జరిగే మాటల్లో మహా కటువైన సత్యాలు బండరాళ్లలా దొర్లుకొచ్చి భయపెడతాయి. వీళ్ళిద్దరి మాటల్లోనే పార్వతికో ప్రియుడున్నాడనీ, భర్త చావువల్ల పార్వతికి దక్కిన డబ్బుని పెట్టి గేదెని కొనబోతున్నాడనీ మనకి తెలుస్తుంది. అస్తవ్యస్తంగా ఉన్న వ్యవస్థలో రామిగాడి చావుతో ఎంతమంది ఎలా లాభపడ్డారో వివరిస్తుంది ఈ కథ.

ప్రేంచంద్ 'కఫన్' కథలో– ఒక ఊర్లో ఇద్దరు తండ్రీ కొడుకులు. చమార్ అనే దళిత కులానికి చెందిన వాళ్ళ పేర్లు ఘిసూ, మాధవ్. సోమరిపోతులు. మాధవ్‌కి పెళ్లవుతుంది. భార్య పేరు బుధియా. ఆమె పురుటినొప్పులు పడుతుండగా కథ మొదలౌతుంది. కాన్పు కష్టమై ఆమె చచ్చిపోతోందని తెలిసి కూడా వీళ్ళిద్దరూ ఏమీ పట్టించుకోకుండా, గొప్పవాళ్ళ ఇళ్ళలో జరిగే పెళ్లివిందుల గురించి మాట్లాడుకుంటూ, బంగాళా దుంపలు కాల్చుకు తింటూ.. గుడిసె బయటే కాలం గడిపేస్తారు. రాత్రంతా బాధపడి, కనలేక, తెల్లారేసరికి ఆమె చచ్చిపోతుంది. దహన సంస్కారం కోసం అందర్నీ అడిగి ఒక అయిదు రూపాయలు సంపాదిస్తారు తండ్రీకొడుకులు. శవానికి కొత్తబట్ట కప్పి దహనం చెయ్యాలి. ఆ బట్టను కఫన్ అంటారు. ఆ 'కఫన్' కోసం దుకాణాలు తిరుగుతూ మద్యం దుకాణం దగ్గరికి వస్తారు. ఆ డబ్బుతో శుభ్రంగా తిని తాగి పడిపోతారు. ఈ కథలో చావు పర్యవసానంగా పుట్టిన డబ్బును తాగి తిని ఖర్చు చేసేస్తారు ఘిసూ, మాధవ్. చాసో కథలో ఆ డబ్బును పంచుకుంటారు. ఈ రెండు కథల్లోనూ చచ్చిపోయిన మనుషుల గురించి పెద్దగా ఉండదు. వాళ్ళ చావు గురించే వర్ణన.

మధ్య తరగతి వాళ్ళం చక్కగా భోంచేసి కూర్చుని ఈ కథలు చదివితే 'అమ్మో ఇంత మానవత్వం లేకుండా మనుషులు బతుకుతారా' అని వెగటు పుట్టొచ్చు. కానీ, మనుషుల్లో అమానవీయ లక్షణాలని వేటిని అనుకుంటామో అవి చావు సందర్భాల్లో బాగా బైటపడతాయి. ఎకనామిక్ ఈక్వేషన్స్ అంతోకొంతో లేకుండా ఒట్టి దుఃఖమయంగా ఏ చావూ వెళ్ళదు. మనిషి బతుకులాగే మనిషి 'చావు' కూడా లాభనష్టాల లెక్కే. ఈ చావుకథలు రెండిటినీ చాలా కటువైన స్వరాలతోనే చెప్పారు రచయితలిద్దరూ కూడా.

బెంగాలీ దర్శకుడు మృణాల్‌సేన్ 'కఫన్'ను 1977 లో 'ఒక ఊరి కథ' పేరుతో సినిమా తీశాడు. అందులో తండ్రి 'పనిదెయ్యం పట్టుకుంటే వదలదురా' అని కొడుకుతో చెప్పి పని చెయ్యకుండా బతకటంలోనే సుఖం ఉందని బోధిస్తాడు. ప్రేంచంద్ 1920 ప్రాంతాల్లో ఇంకోకథ రాశాడు. 'సవాసేర్ గేహూ' అనే ఆ కథలో పావుశేరు గోధుమలు అప్పు తీసుకున్న ధార్మికుడైన ఒక చిన్నరైతు క్రమంగా ఒక వడ్డీవ్యాపారికి వెట్టికూలీగా ఎలా మారాడో వివరిస్తాడు ప్రేంచంద్. ఘీసూ మాధవ్ ఆ చిన్నరైతుకంటే ఎక్కువ స్వేచ్ఛాజీవులు. కానీ ఆ స్వేచ్ఛ కోసం వాళ్ళు పణంపెట్టిన విలువలు ఎన్నో. 'కఫన్'లో ప్రేంచంద్ ఏమంటాడంటే, 'పనిచేసే రైతుల బలహీనతలను కనిపెట్టి, వాళ్ళను మోసం చేస్తూ సుఖంగా హాయిగా బతగ్గలిగేవాళ్ళున్న సమాజం మనది. ఇలాంటి పరిస్థితులున్నచోట ఘీసూ మాధవ్ లాంటివాళ్ళు తయారవటంలో ఆశ్చర్యం లేద'ని. ఈ నిజాన్ని నిరూపించటం కోసమే ఇంత ఘోరమైన తండ్రీ కొడుకులని సృష్టించాడా అనిపిస్తుంది. ఒకరకంగా వీళ్ళిద్దరిదీ దోపిడీమీద చేసిన తిరుగుబాటే. కానీ అది పరమ వంకరబుద్ధితో కూడిన వ్యక్తిగతమైన తిరుగుబాటు.

చాసో 'బండపాటు' కథ రాసేనాటికి స్వాతంత్ర్యం వచ్చేసింది. అభివృద్ధి ప్రణాళికలు జరిగిపోతున్నాయి. పెద్దపెద్ద ప్రాజెక్టులు కట్టి ప్రకృతిని ధ్వంసం చేయటం, అన్ని స్థాయిల్లో అవినీతి, చట్టాల్లో లొసుగులను వాడుకుని మోసాలు చేసే పద్ధతులు కనిపెట్టటం... ఇలాంటివన్నీ బాగా పెరిగిపోయాయి. ఇవన్నీ మనం చాసో కథలు బండపాటు, వజ్రహస్తం, ఆహాహా లాంటి కథల్లో చూస్తాం. జనానికి మనుగడే పెద్ద సమస్య అయిపోయి, అందులోనే కొట్టుకుంటూ చిన్న చిన్న పరిష్కారాలు చేసుకుంటూ ఆ దోపిడీ వ్యవస్థ కొనసాగటానికే ఎలా సహకరిస్తూ ఉంటారో 'బండపాటు' కథలో చూస్తాం. కఫన్‌ను వాస్తవికవాద కథ అని కూడా పూర్తిగా అనలేం. మార్మికత, తీవ్రమైన నిరాశావాదం, వ్యవస్థలో ఉన్న వంకర్లన్నిటి మీదా ఘిసూ వేసే విసుర్లూ ... వీటన్నిటితో కూడిన ఈ కథను మొదటిసారి చదవటం చాలా షాకింగ్‌గా ఉంటుంది. చాసో రాసిన 'పరబ్రహ్మము' కూడా మార్మికమైన కథే. 'కఫన్' లో తిండి యావా, వర్ణనా చాలా ఉంటుంది. 'పరబ్రహ్మము' కథ పిచ్చివాడి ఆకలితో మొదలై ఆకలి స్వరూపాన్ని అన్వేషించి, చెత్తకుండీ దగ్గర మిలిటరీ హోటల్ వాళ్ళు విసిరిన ఎంగిలాకుల దగ్గర సత్యాన్ని కనుక్కుంటుంది. 'ఆకలి' విశ్వరూపాన్ని కఫన్‌లోనూ, 'పరబ్రహ్మము'లోనూ మనం చూడవచ్చు. శవదహనం చేసేముందు కఫన్ కొనటం చాలా ముఖ్యం. దీనిని కూడా ఘిసూ తర్కిస్తాడు. బతికున్న మనిషికి ఒళ్ళు కప్పుకునేందుకు చిన్న పీలిక దొరకదుగానీ చచ్చిపోయిన మనిషికి కప్పటానికి కొత్త బట్ట దేనికని విసుక్కుంటాడు. మనిషి బతికివున్నప్పుడు పట్టించుకోని సమాజం మనిషి పోయాక చేసే తంతులకు చెయ్యి విదిల్చి దానం చేస్తుంది. ఇలాంటి బూటకపు ధార్మికత ఉన్నచోట ఘిసూ మాటలను కాదనలేం.

సమస్త పార్శ్వాలనుంచి జీవితాన్ని దర్శించటంతోబాటు, పారిశ్రామికీకరణ జరిగే క్రమంలో భద్రత కరువై అమానవీకరణ కూడా ఎంతగా జరిగిపోయిందో చాసో చూశాడు. వలస పాలన తెచ్చిన నవ ఫ్యూడల్ వ్యవస్థలో గ్రామాల్లో సామాజిక ఆర్థిక మానవీయ సంబంధ సూత్రాల లొంగుబాటూ కుంగుబాటూ క్రమంగా ఎలా జరిగిపోయిందో ప్రేంచంద్ ఆవిష్కరించాడు. ఇప్పటికీ ఇలాంటి అమానవీయ సంబంధాలు కొనసాగుతూనే ఉండటం మనం చూస్తున్నాం. అందుకే ఈ కథలకు కాలం చెల్లదు.

బండపాటుకూ, కఫన్‌కూ ఉన్న ముఖ్యమైన తేడా ఏమిటంటే, 'బండపాటు'లో ఉన్న మనుషులంతా చాతనైన విధంగా బతుకుకోసం పోరాడుతున్నవాళ్ళు. అందువల్ల బండపాటు కథను 'బ్లాక్ కామెడి' అనొచ్చు. కఫన్‌లో బతుకు పోరాటాన్నే వదిలేసి కూర్చుంటారు ఘిసూ, మాధవ్. తాము నాశనం కాకుండా ఉండగలిగామన్న మిధ్యానందాన్ని నాటకీయంగా కూడగట్టుకుంటూ ముత్యంలాంటి తమ ఆడమనిషి చావుకు కారణమౌతారు. అలవికాని బీభత్సం. 'కఫన్' ఒక బ్లాక్ ట్రాజెడీ. బండ నెత్తిమీద పడినంత వేగంతో నడుస్తుంది బండపాటు కథనం. చావు తరువాతి సంఘటనలన్నీ జోరుగా జరిగిపోతాయి. మనిషితనం నశించినవాళ్ళ ప్రవర్తన ఎంత హీనంగా ఉండగలదో పదునైన వ్యంగ్యంతో వర్ణిస్తూ బాధాకరంగా 'కఫన్'ను నడిపిస్తాడు ప్రేంచంద్. రెండు కథలూ కూడా ఆ మనుషుల ప్రవర్తన వెనకున్న వ్యవస్థ తాలూకు అమానుషత్వాన్ని చూడమంటాయి. రెండు కథల్లోనూ ఉన్న బీభత్సకరమైన వాస్తవికవాదం, అమానవీకరణ జరిగిపోయిన తీరు, ఇవి మనం నమ్ముతున్న వ్యవస్థ పట్ల సందేహాలను పెంచి, మన ఆలోచనలను పొరలు పొరలుగా చీల్చి, ఉద్విగ్నతను రేకెత్తిస్తాయి. ప్రశ్నలు ఎలా వేసుకోవాలో తెలుసుకొమ్మని సవాలు చేస్తాయి.

(ఈనెల 17న చాసో 104 జయంతి. ఈ సందర్భంగా ఆరోజు విజయనగరంలో చాసో స్ఫూర్తి పురస్కార ప్రదాన సభ జరుగుతుంది)

– పి.లలిత
81713 85168

వంశధార కళింగ జీవధార

పుస్తకం



వంశధార కళింగసీమ జీవధార. ఇప్పుడు ఉత్తరాంధ్రగా కుంచించుకుపోయిన ప్రాంతం.. ఒకప్పుడు మహానది నుంచి గోదావరినది వరకూ విలసిల్లిన ఉజ్వల సంస్కృతికి ప్రతీక. ప్రపంచ చరిత్రలోనే కీలక ఘట్టాలకు భూమికగా నిలిచిన ప్రాంతం. దురాక్రమణకు వచ్చిన సామ్రాజ్యవాద పాలకుల్ని ఎదిరించి లక్షల సంఖ్యలో ప్రాణాలను తృణప్రాయంగా త్యజించిన నేల. ఇవన్నింటికీ వేదిక కళింగ. ప్రాచీనకాలం నుంచి నేటివరకూ కళింగ జనజీవన గమనానికి సాక్ష్యం అటు తూర్పుకనుమల నుంచి ఇటు బంగాళాఖాతం వరకూ విస్తరించిన ప్రకృతి. అందులో ముఖ్యమైన జలవనరు వంశధార. ఒడిసాలోని మిన్నాజోల ప్రాంతంలో పుట్టి కళింగపట్నం వద్ద సాగరంతో సంగమించే 'వంశధార'నే తన సుదీర్ఘ చారిత్రక కథాకావ్యానికి డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ ఆలంబనగా ఎంచుకున్నారు.

ఈ వంశధార ఏదోఒక నది పుట్టుక గురించి మాత్రమే అక్షరీకరించిన కావ్యం కాదు. దానిని అనుసరించి కొనసాగిన కళింగ చరిత్రని మూలాల్లోంచి ఉపరితం వరకూ అలవోకగా స్ప ృశించి, ఆత్మీయంగా హృదయాలింగనం చేసుకుని ఆర్ద్రత నిండిన అక్షరధారగా కవి ఆవిష్కరించారు. 13 భాగాలుగా సాగిన ఈ వంశధార కావ్య ప్రవాహం బిందువుగా మొదలై సింధువుని చేరేటంత వరకూ కాలగతి ఎలాంటి పరిణామాలకు లోనైందో అందమైన పదాలతో, అవసరమైనచోట జలతరంగ శబ్దలయలో చదువరులను కూడా తనతో సంలీనం చేసుకుంటుంది.

'అమ్మా! వంశధారా!
మకరంద మాధుర్య రసధారా!
తెలుగు వంశ సంస్కృతికి తొలిధార!
నీ పవిత్ర జలాలు సాగరగర్భంలో
ఉమ్మనీరులా చేరిన తర్వాత
ప్రాచీరేఖ పొత్తిళ్లలో... బాలభానుని జననం...'

అంటూ ఈ కావ్యం మొదలవుతుంది.

అఖండ జలరాశిలో నిక్షిప్తమైపోయిన ఎన్నో నాగరికతల్ని తలచుకుంటూనే కవి వంశధారను తల్లిగా పేర్కొని, తాను తనయునిగా భావించి ఎన్నో సందేహాలను సంధిస్తే... ఆమె చరిత్ర తెరలపై దృశ్యమానం చేసినట్లు ఎన్నో సన్నివేశాలే పంక్తులై పరుగులు తీస్తుంటాయి.

తెలుగులో చారిత్రక వాస్తవాలతో సంబంధం లేకుండా పౌరాణిక, శృంగార ఇతివృత్తాలతో ఎన్నో కాల్పనిక కావ్యాలు వచ్చాయి. వాటన్నింటికీ ఇది విభిన్నమైనది. ఒక విధంగా చెప్పాలంటే ఇది సంపూర్ణ ఆధునిక కావ్యం. కళింగ ప్రాంతంలో జరిగిన ముఖ్యమైన చరిత్రక సంఘటనలకు కాస్త కాల్పనికతను జోడించి కావ్యంగా తీర్చిదిద్దడం తెలుగు సాహిత్య చరిత్రలో ఇదే మొదలని 'వంశధార ప్రవాహం'గా పరిచయవాక్యంలో సాహితీవేత్త కుర్రా జితేంద్రబాబు రాసిన మాటలు అక్షర సత్యాలని ఈ కావ్యం చదివినవారెవరైనా అంగీకరించక తప్పదు. ఈ కావ్యంలో రెండో భాగంలో వంశధార తన తనయుడైన కవికి చరిత్రను వివరిస్తూ ...

'నా అలల వెనక దాగిన కలల్ని
ఇసుక తిన్నెల్లో ఇంకిపోయిన కథల్ని
వరదలై కొట్టుకుపోయిన రాచరిక
రాక్షస రాజకీయకేళిని
మట్టిలో మరుగుపడిన మత
మౌఢ్యపు మృత్యులీలను
సౌరాగ్నిలా ఎగసి పాటిమన్ను
పొరల్లో పాతరైపోయిన
శౌర్యాగ్ని కీలలను....' అంటూ వర్ణనాత్మకంగా సాగిన అక్షరఝరి ఆహ్లాదాన్ని అందిస్తూనే ఆలోచనలకు సూచనగా నిలుస్తుంది.

ఇలా ఈ కావ్యం నిండా కొత్త మెరుపులూ, కొత్త నడకలు, కొత్త పలుకుబడులు అక్షర జీవాన్ని తొణికిసలాడిస్తుంటాయి. అందువల్లే ఈ వంశధార కదంతొక్కే ఒక కవనజీవనదిలా సాక్షాత్కరిస్తోంది. కళింగ ప్రజల జీవన చైతన్యం, చారిత్రక స్ఫూర్తిని అందించిన అశోకుడు, ఖారవేలుడు, బౌద్ధం, జైన సంస్కృతులు, ప్రజాపోరాటాల ఘటనలు అన్నీ కలిపిన సమగ్రమైన కావ్యంగా దీనిని భావించొచ్చు. కళింగ చరిత్రను మిగిలిన ప్రపంచానికి పరిచయం చేయడానికి ఇటీవలికాలంలో జరుగుతున్న కృషిలో డాక్టర్ డి విజయభాస్కర్ ఈ కావ్యం ద్వారా అందిస్తున్న ప్రేరణ అపురూపమైనదే కాదు; ఎంతో అవసరమైనది కూడా. వాస్తవికమైన ఇతివృత్తాన్ని ఎంచుకుని దానిని తన అపూర్వ అక్షర స్పర్శతో సాహిత్య గౌరవాన్ని, కళావిలువల్ని తీసుకురావడం చిన్న విషయమైతే కాదు. ఎన్నో రకాల పూలను ఏరి దండగా గుచ్చినట్లు కళింగ ప్రాంతంలోని చారిత్రక పరిణామాలను ఏకసూత్రంగా అనుసంధానించి చెప్పడం, దానిలో తొణికిసలాడే శబ్ద సౌందర్యం పఠితల మనసుల్లో చెరగని ముద్రవేస్తాయి.

వంశధార కావ్యం ద్వారా భూమిపొరల్లో కుంగిపోయిన మహాచరిత్రను మళ్లీ పెల్లుబికిందనడం అతిశయోక్తి కాదు. బుద్ధుడు జీవించి ఉన్న కాలంలోనే బౌద్ధాన్ని జీవన విధానంగా మార్చుకున్న నేల ఇది. కళింగ ప్రాంతం చరిత్రలో ఎంత ఉజ్వలమైనదైనా వర్తమానంలో మాత్రం దయనీయతలో కొట్టుమిట్టాడుతున్న వాస్తవాన్ని కవి ఎక్కడా విస్మరించలేదు. ఘన చరిత్రకు వారసులైన ఈ ప్రాంతప్రజలు పేదరికంతో సర్దుకుపోతున్నారు. తరగని ప్రకృతి సంపదలున్నా వాటిని పొందలేకపోతున్న అభాగ్యులు. అనుచరులుగా అణిగిమణిగి ఉన్నట్టు కన్పిస్తున్నా నాయకత్వ లక్షణాలు పుష్కలంగా ఉన్న ప్రజలు వీరంతా. కడలి కెరటాలకెదురీదుతూ నరాల్ని ఉక్కులా మార్చుకుని, కొండల్ని ఎక్కిదిగుతూ కండల్ని బలిష్టంగా మార్చుకున్న కళింగ ప్రజలు దేనికీ తీసుకుపోరని స్వీయ గౌరవాన్ని మరింత ఉద్దీపించడం ఈ కావ్యానికి ఉన్న సార్వజనీన లక్షణం. రండి, ఇంకెందుకాలస్యం? వంశధార కావ్యాన్ని తెరిచి కాలం అలలపై సయ్యాటలాడుతూ కళింగ చరిత్రలోని వీరోచిత పోరాటాలను, సౌజన్య సాంస్కృతిక సుమసౌరభాలను ఆస్వాదించండి.

– బెందాళం క్రిష్ణారావు

నాకు నవ్వాలని ఉంది

అపుడే వికసించిన సిరిమల్లె పూవులా
స్వచ్ఛంగా నవ్వాలని ఉంది!
అమ్మ కొంగుతో దోబూచులాడుతున్న
పసిపాపలా కిలకిలా నవ్వాలని ఉంది!
ఆకుపచ్చ చీర కట్టుకున్న వరిపైరులా
ఆనందంగా నవ్వాలని ఉంది!
లేత మామిడి మధురిమను
తృప్తిగా ఆస్వాదిస్తున్న చిలకమ్మలా
మధురంగా నవ్వాలని ఉంది!

పున్నమి నాటి చంద్రుడిలా
పసిడికాంతిగా నవ్వాలని ఉంది!
ఆకాశంలోని హరివిల్లులా
రంగుల కలపోతలా నవ్వాలని ఉంది!
పల్లెపడుచు నండూరి ఎంకిలా
అమాయకంగా నవ్వాలని ఉంది!
అందమైన బాపు గీసిన బొమ్మలా
ముగ్ధ మనోహరంగా నవ్వాలని ఉంది!
రవివర్మ చేతిలో ఒంపు ఒంపుకు
వయ్యారాలు పోతున్న కుంచెలా
గర్వంగా నవ్వాలని ఉంది!

వేణుగానం విన్న రాధలా
తన్మయత్వంగా నవ్వాలని ఉంది!
గలగలా పారుతున్న గోదారిలా
జలజల జారుతున్న సెలయేరులా
మిలమిల మెరుస్తున్న ముత్యాల సరంలా
నవ్వాలని ఉంది!
మధుమాసంలోని ప్రకృతి దరహాసంలా
తొలకరి చినుకులతో తనువు తడుపుకుంటూ...
అభ్యంగన స్నానం చేస్తూ పులకించిపోతున్న
నేలతల్లిలా నవ్వాలని ఉంది!

అవును.. నాకు నవ్వాలని ఉంది!
మనసారా.. గుండె నిండుగా.. హాయిగా...
రాగద్వేషాలకు అతీతంగా
ఈ యాంత్రిక జీవితానికి దూరంగా
నిస్వార్థమైన కల్మషం లేని
నా వాళ్ళు ఎవరైనా ఉంటే
వాళ్ళతో కలిసి మనసారా నవ్వాలని ఉంది!!

– గుడిపల్లి విద్యావతి
88866 14346

కందుకూరి స్ఫూర్తితో ఐద్వా కథల పోటీ

కందుకూరి వీరేశలింగం శతజయంతి సందర్భంగా ఆయన స్ఫూర్తితో అఖిల భారత మహిళా సంఘం (ఐద్వా) కథల పోటీ నిర్వహిస్తోంది. కందుకూరి స్త్రీజన పక్షపాతిగా రచనలు చేశారు. స్త్రీలకు చదువు నేర్పించేందుకు కృషి చేశారు. సమాజ వెలివేతను అధిగమించి వితంతు వివాహాలు జరిపించి మహోన్నత సంఘ సంస్కర్తగా నిలిచారు. జ్యోతిష్యం లాంటి మూఢాచారాలను తుదకంటా వ్యతిరేకించారు. స్త్రీల సమానత కోసం పరితపించారు. వారి శత వర్ధంతి నేపథ్యంలో సమకాలీన అంశాల ప్రాతిపదికగా కథల పోటీ జరపతలపెట్టాం. ఈ సందర్భంగా మహిళా కోణం నుంచి కథలు పంపాల్సిందిగా రచయితలను కోరుతున్నాం.ఉత్తమంగా ఉన్న మూడు కథలకు బహుమతులు అందిస్తాం. **ప్రథమ బహుమతి : రూ. 5000, ద్వితీయ బహుమతి : రూ. 3000, తృతీయ బహుమతి : రూ. 2000.** బహుమతి కథలతో పాటు మెరుగైన వాటిని మానవి పత్రికలోనూ, ఐద్వా సావనీర్‌లోనూ ప్రచురిస్తాం. **కథ** ఏ4 సైజ్ కాగితంపై చేతిరాతతో 9 పేజీలు ఉండాలి. డిటిపిలో 4 పేజీలు ఉండాలి. రచనలపై రచయిత, రచయిత్రుల పేర్లు రాయకూడదు. హామీపత్రంలో మాత్రమే పేరు, చిరునామా,ఫోన్ నం. ఈమెయిల్ వివరాలు రాయాలి. ఈమెయిల్ aidwaa-porg@gmail.com ద్వారా కూడా పంపించవచ్చు. డిటిపి చేసినవాటిని పీడీఎఫ్, ఓపెన్‌ఫైల్ పంపించాలి. వివరాలకు ఈ కింది ఫోన్ నంబర్లను, ఐద్వా స్థానిక కమిటీలను సంప్రదించవచ్చు. ఫోన్ నంబర్లు : 9490098620, 6309719616. రచనలు చేరటానికి చివరి తేదీ : ఫిబ్రవరి 5, 2019. **చిరునామా : రచనల పోటీ. ఐద్వా,** డోర్.నెం.31-5-6, ప్రకాశరావు వీధి, మారుతీ నగర్, ఏలూరు రోడ్డు, విజయవాడ-4.

– డి.రమాదేవి, కార్యదర్శి, ఐద్వా

ఉగాది బాలల కథల పోటీ

విజయనగరంలోని సహజ సాంస్క తిక సంస్థ వచ్చే ఉగాది సందర్భంగా బాలల కథల పోటీ నిర్వహిస్తోంది. పిల్లలకు ఆహ్లాదాన్ని కలిగిస్తూ ఆలోచనలను రేకెత్తించే కథలు; బంధాలు, కరుణ, దయ కలిగి ఉండే కథలకు ప్రాధాన్యం ఉంటుంది. కథల నిడివి చేతిరాతలో మూడు పేజీలు, డిటిపిలో రెండు పేజీలు మించరాదు. కథలు ఈ పోటీ కోసమే రాసినవే అయి ఉండాలి. ప్రథమ బహుమతి. రూ. 2 వేలు, ద్వితీయ బహుమతి రూ.1500, తృతీయ బహుమతి రూ.1000. రూ. 500 చొప్పున మూడు ప్రోత్సాహక బహుమతులు కూడా ఉన్నాయి. కథలను పోస్టు ద్వారా గాని కొరియర్ ద్వారా గాని మాత్రమే పంపాలి. కథలు చేరడానికి ఆఖరి తేదీ : 20 - 2 - 2019. ఫలితాలు ఏప్రిల్ 4న, బహుమతి ప్రదానం ఏప్రిల్ 21న. చిరునామా : అధ్యక్షులు, సహజ సాంస్క తిక సంస్థ, 24 - 8 - 1, సమీరా రెసిడెన్సి, లింగదారి పేట, రాజ్యలక్ష్మి థియేటర్ దరి, విజయనగరం - 535002.

– ఎన్‌కె బాబు

జనరంజక కవి ప్రతిభా పురస్కార ఫలితాలు

రావి రంగారావు సాహిత్య పీఠం ఈ ఏడాది జన రంజక కవి ప్రతిభా పురస్కారాలను ప్రకటించింది. ఈసారి 186 కవిత్వ గ్రంథాలు పరిశీలనకు రాగా, అందులో నాలుగింటికి పురస్కారాలు ప్రకటించారు. 1. మట్టి రంగు బొమ్మలు : సిరికి స్వామినాయుడు; 2. నల్ల చామంతి : చిత్తలూరి సత్యనారాయణ, 3. సవ్వడి (గజళ్ళు) : భైరి ఇందిర, 4.మా ఇంటి దేవతలు (బాల గేయాలు) : బెలగాం భీమేశ్వరరావు గ్రంథాలు పురస్కారాలు పొందాయి. గుంటూరు బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ఫిబ్రవరి 11 సాయంత్రం 6 గంటలకు పురస్కార ప్రదాన సభ ఉంటుంది.

– నర్రా ప్రభావతి, కన్వీనర్,
రావి రంగారావు సాహిత్య పీఠం.

నేలపై చందమామలు



పండగంటేనే ఇల్లంతా సందడి సందడిగా ఉంటుంది. అందులోనూ సంక్రాంతి అంటే ప్రతి ఒక్కరికీ చాలా ప్రత్యేకమైంది. ఇక కొత్త దుస్తుల్లో చిట్టి తల్లులు చందమామల్లా కనబడతారు. మార్కెట్లో రకరకాల మోడల్ డ్రెస్‌లు హంగామా చేస్తున్నా.. సంప్రదాయ పట్టులంగా, జాకెట్లదే హవా. వాటిని సాదాసీదాగా కాకుండా కుందన్స్, బీడ్స్, అద్దాల డిజైన్‌లతో ఫ్యాషన్ డిజైనర్లు మరికొన్ని మెరుగులు దిద్దారు. ఇవి ధరించిన ఇక్కడి చిన్నారులను చూస్తుంటే నేలపై చందమామల్లా లేరూ?!



సంక్రాంతి అంటే మూడురోజుల పండగ. అందులో మొదటిరోజు వచ్చేది భోగి పండగ. ఆ రోజు వేకువ జాము నుంచి భోగితోనే అసలు పండగ ప్రారంభమవుతుంది. వాస్తవం చెప్పాలంటే సంక్రాంతి పండగ రోజు కన్నా భోగిరోజే ఊళ్లలో బాగా జరుపుకుంటారు. చిన్న పిల్లల కోసం ఆటలు, పాటలు అన్నీ భోగిరోజునే నిర్వహిస్తారు. భోగి.. పిల్లలకు మరీ ప్రత్యేకమైన పండగ. వేకువజాము నుంచే మొదలయ్యే భోగిమంటల వెలుగులు, ఉదయాన్నే వీధుల్లోకొచ్చే హరిదాసుకు బియ్యం పోయడం దగ్గర నుంచి సాయంత్రం భోగిపళ్లు పోయించుకునే వరకూ వాళ్ల హడావిడి అంతా ఇంతా కాదు. అంటే భోగిపళ్లు పోయించుకోవడం అంటే పిల్లలకు బాగా సరదాగా ఉంటుంది కదా.?! ఎందుకంటే రేగిపళ్లు నెత్తిమీద నుంచి రాలడం.. తన తోటి పిల్లలూ రేగిపళ్లు పోయడం.. వాటితో ఆడుకోవడం.. వారికి ఎంతో సరదాగా ఉంటుంది. అంటే ఇలా భోగిపళ్లు పోయించుకోవడం ఓ సరదా!. పాతకాలపు ఆచారాలు, నమ్మకాలు ఎలాగున్నా.. పిల్లలు మాత్రం బాగా ఎంజాయ్ చేస్తారు. ఇలాంటివాటి వల్ల ఆ వయసు పిల్లలకు కొత్త కొత్తవాళ్లు స్నేహితులవుతారు. వారి మధ్య స్నేహబంధం ఏర్పడుతుంది. అలాగే ఎవరింటికి వాళ్లు మాత్రమే పరిమితం కాకుండా.. చుట్టుపక్కల వారిని కూడా పిలవడం.. వాళ్లతో కాసేపు మాట్లాడుకోవడం...ఎన్నో ఊసులు, ఇంకెన్నో ముచ్చట్లు. రోజంతా అనందంగా, ఆహ్లాదంగా సాగిపోతుంది.. ఈ మధ్య చుట్టుపక్కల వారిని పిలవడానికీ భయపడాల్సి వస్తుందని మొహమాట పడకండి. ఎందుకంటే ఏదో ఒకటి బహుమతి ఇవ్వాలి కదా.?! అదిగో ఫలానావాళ్లు అలా భోగిపళ్లు పోసి అలాంటి గిఫ్ట్ ఇచ్చారు.. మరి మేం ఏమివ్వాలో అనే ఆందోళనకు గురికాకుండా.. అవన్నీ పాటించకుండా కాసేపు పిల్లలతో ఎంజాయ్ చేద్దాం! ఆ కొద్దిసేపు జరిగే ఆ కార్యక్రమంలో పిల్లలకు బంధుత్వాల్ని పెంచుదాం. వారి స్నేహానికి పునాదులు వేద్దాం!!

పిల్లలకు ఆహ్లాదాన్ని పంచే భోగిపళ్లు



మీకోసం

బియ్యంపిండి, పెరుగు, పసుపు, నీళ్లు స్పూను చొప్పున తీసుకుని కలిపి మోచేతులపై రాసి, ఆరాక కడిగేస్తే నునుపుగా అవుతుంది.




జీవన సౌరభం

నిజాయితీగా ఆలోచించడం వేరు. నిజాయితీగా బతకడం వేరు. చాలామంది గొప్పగా ఆలోచిస్తూ, గొప్పగా మాట్లాడుతూ మామూలుగానే బతికేస్తుంటారు.




ఎన్. శిరీష,
పొట్టెంపాడు,
నెల్లూరు.



ఎన్. మంజువాణి,
చీమకుర్తి,
ప్రకాశంజిల్లా.

15 చుక్కలు
8 వచ్చేవరకు
మధ్యచుక్క



పి. హేమలత,
విజయనగర కాలనీ,
తిరుపతి.

17 చుక్కలు
17 వరుసలు
నేరుచుక్కలు.

SENTENCES for DSC-SGT



పి. అనంత్ ఎంఎ, బీఈడి
ఇంగ్లీష్ ఉపాధ్యాయులు, తెనాలి.
సెల్ : 9297359222

A PHRASE : ఇది ఒక conceptను తెలిపే కొన్ని పదాల సముదాయం. ఇది sentenceలో ఒక భాగం మాత్రమే. దీనిలో Subject మరియు Predicate ఉండవు. English grammar లో చాలా రకాల phrases ఉన్నాయి.

A phrase is a grammatical term referring to a group of words that does not include a subject and verb.

Noun Phrase; Friday became a cool, wet afternoon.

Verb Phrase; Mary might have been waiting outside for you..

Gerund Phrase; Eating ice cream on a hot day can be a good way to cool off.

Infinitive Phrase; She helped to build the roof.

Prepositional Phrase; In the kitchen, you will find my mom.

A CLAUSE: Subject మరియు Predicate ఉండి sentence లో ఒక భాగమైన పద సముదాయాన్ని clause అంటారు. Clauses రెండు రకాలు.

AN INDEPENDENT CLAUSE : ఇది పూర్తి అర్థాన్ని ఇస్తుంది. ఇది ఇతర clauses మీద ఆధార పడదు.

A DEPENDENT CLAUSE : ఇది పూర్తి అర్థాన్ని ఇవ్వదు. ఇది ఇతర Independent clauses మీద ఆధార పడుతుంది. Dependent Clauses లో మూడు రకాల ఉన్నాయి. వీటిని Complex Sentencesలో వాడతారు. అవి..

1. Noun Clause : ఇది Complex sentences లో noun యొక్క పనిని చేస్తుంది. Noun clauses ను ఈ కింద ఇచ్చిన Conjunctions తో తయారు చేస్తారు.

List of Conjunctions: How, that, what, whatever, when, where, whether, which, whichever, who, whoever, whom, whomever

E.g.What Alicia said made her friends cry. What Megan wrote surprised her family

2. Adjective Clause : ఇది Complex sentences లో adjective యొక్క పనిని చేస్తుంది. Adjective clauses ను ఈ కింద ఇచ్చిన Conjunctions తో తయారు చేస్తారు.

List of Conjunctions: that, where, when, who, whom, whose, which and why.

E.g. Fruit **that is grown organically** is expensive. Students **who are intelligent** get good grades.

3. Adverb Clause : ఇది Complex Sentences లో verb, adjective మరియు adverb ను modify చేస్తుంది. Adverb clauses చాలా రకాలు ఉన్నాయి. అవి adverb clauses of

1. Time: Don|'t talk **while** she is singing.
2. Place: You can put it **wherever** you like.
3. Purpose: We eat **so that** we may live.
4. Cause: I am glad **that** you like it.
5. Condition: If it rains we shall stay at home.
6. Result: He is **such** a good man **that** all respect him.
7. Comparison: He is older **than** he looks.
8. Supposition or Concession: Though I am poor I am honest.

1.A SIMPLE SENTENCE : ఒకేఒక్క main clause ఉన్న sentence ను Simple sentence అంటారు. దీనితో ఒక phrase ఉండవచ్చు.
E.g. In spite of his poverty, he is honest.

2.A COMPOUND SENTENCE : రెండు లేక అంత కంటే ఎక్కువ main clauses ఉన్న sentence ను Compound sentence అంటారు. ఈ రెండు main clausesను కలపడానికి వాడే conjunction ను coordinating conjunction అంటారు.
E.g. He is poor, but he is honest.

3.A COMPLEX SENTENCE : ఒక main clause మరియు ఒకటి లేక అంత కంటే ఎక్కువ subordinating clauses ఉన్న sentence ను Complex sentence అంటారు. ఈ main మరియు subordinate clauses ను కలపడానికి వాడే conjunction ను subordinating conjunction అంటారు.
E.g. Though he is poor, he is honest.

Conjunctions Used in Different Sentences

Simple Sentence	Compound Sentence	Complex Sentence
Soon after	No sooner - than	As soon as
In case of not	otherwise/or	Unless
In case of	and then	If
V+ing, Owing to, on account of, because of	and so	As /since /because
On V+ing	And	When
In spite of	But/yet	Though/ although

1. Soon after the music stopping, the child began to cry. (Simple)
No sooner had the music stopped **than** the child began to cry. (Compound)
As soon as the music stopped, the child began to cry.(Complex)

2. In case of not working hard, you will fail. (Simple)
You must work hard, **or** you will fail. (Compound)
Unless you work hard, you will fail. (Complex)

3. In case of studying well, you will get good marks. (Simple)
You must study well **and then** you will get good marks. (Compound)
If you study well, you will get good marks. (Complex)

4. It being a holiday, I stay at home. (Simple)
It is a holiday **and so** I stay at home. (Compound)
As it is a holiday, I stay at home. (Complex)

5. On the teacher looking at me, I started reading a book. (Simple)
The teacher looked at me **and** I started reading the book. (Compound)
When the teacher looked at me, I started reading the book. (Complex)

6. In spite of working hard, she failed in the exam. (Simple)
She worked hard, **but** she failed in the exam. (Compound)
Though she worked hard, she failed in the exam. (Complex) ★

Adverb Clauses in English

Adverb Clauses of Condition	Adverb Clauses of Place	Adverb Clauses of Time	Adverb Clauses of Reason	Adverb Clauses of Contrast
Even if If Only if Unless In case	Anywhere Where Everywhere Wherever	After As soon as Before By the time Once Since Till/Until When/While Whenever	As Because Now that Since	Although Even though Though Whereas While

EXERCISE :

1.Although they played well, they lost the match.
Change the sentence in to **simple sentence**
1. In spite they played well, they lost the match.
2. In spite of his playing well, they lost the match.
3. Despite playing well, they lost the match.
4. They played well, but they lost the match.

2. You may sit **wherever you like.** The underlined part is
1. An adverb of clause of place.
2. An adverb of clause of degree
3. An adverb of clause of manner
4. An adverb of clause of time.

3. Identify the correct phrase to fill in the blank of the sentence. **He is confident …**
1. Of success
2. To succeed
3. About succeeding
4. On succeeding.

4. Will you wait **till I return?**
……..till I return?' is:
1. An adverb of clause of concession
2. An adverb of clause of degree
3. An adverb of clause of manner
4. An adverb of clause of time.

5. If you eat too much you will be ill.
'If you eat too much' is:
1. An adverb clause of manner
2. An adverb clause of concession
3. An adverb clause of place
4. An adverb clause of condition

6. **Adverb clause of concession** is often introduced by the conjunction…
1. Though 2. If
3. Unless 4. That

7. Choose the grammatically correct sentence.
1. Scarcely had I reached the station than the train left.
2. Scarcely had I reached the station then the train left.
3. Scarcely had I reached the station when the train left.
4. Scarcely do I reach the station than the train left.

8. Identify the sentence which has a noun clause.
1. I know that it is mere trickery of words.
2. I went to Hyderabad to see off my friend.
3. Even if he invites, they may not go.
4. Wait till our state becomes Singapore.

9. Identify the sentence which has **an adverb clause of concession.**
1. Though he is old, he is able to do a great deal of work.
2. He was so meek he could not complain.
3. He doesn't know that he doesn't know.
4. He isn't as fulfilling as we all think.

10. **'He gets up early so that he can catch the bus.'** is
1. Compound sentence
2. Complex sentence
3. Simple sentence
4. Compound-complex.

11. **As it rained heavily, I stayed at home.**
Combine the two sentences into a meaningful sentence.
1. It rained heavily and I stayed at home.
2. Since it rained heavily, I stayed at home.
3. It rained heavily and so I stayed at home.
4. Owing to heavy rain, I stayed at home.

12. **A complex sentence should have..**
1. Two independent clauses
2. At least one independent clause and one dependent clause
3. Only a dependent clause
4. Only an independent clause

13. **Because you have done this,** I shall punish you. The underlined part is
1. A noun clause
2. An adjective clause
3. An adverb clause
4. A coordinate clause

14. It was Shyam **who paid for the drinks.** The underlined part is
1. A noun clause
2. An adjective clause
3. An adverb clause
4. A coordinate clause

15. **Subordinating conjunction** is used in
1. Simple sentences
2. Compound Sentences
3. Complex sentences
4. None of the above

Answers : 1.3, 2.1, 3.1, 4.4, 5.4, 6.1, 7.1, 8.1, 9.1, 10.2, 11.4, 12.2, 13.3, 14.2, 15.3.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

వ్యవసాయ విత్తం - సంస్థాపరమైన పరపతి



ఎస్.ఎం. సువర్ణకుమార్
డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్, ఏలూరు.
సెల్ : 9441169869

ఇండియన్ ఎకానమి

సంస్థాపరంకాని మూలాల దోపిడీ నుంచి రక్షించడం ద్వారా వ్యవసాయదారులను రుణభారం నుంచి కాపాడుతూ.. వ్యవసాయరంగ అభివృద్ధికి కావాల్సిన మూలధనాన్ని తక్కువ వడ్డీకి రుణాలను అందించడం సంస్థాగత పరపతి ప్రధాన లక్ష్యం.

ప్రభుత్వం సంస్థాపరంకాని వ్యక్తుల ప్రాబల్యం తగ్గించడానికి వివిధ సంస్థలను నెలకొల్పడం లేదా ప్రోత్సహించడం ద్వారా సంస్థాగత పరపతి మూలాల ప్రాధాన్యత పెంచుకుంటూ వచ్చింది. సంస్థాగత పరపతి సమకూర్చడం కోసం ఏదో ఒక వ్యవస్థ లేదా సంస్థ మీద మాత్రమే ఆధారపడక సహకార సంస్థలు, వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు వంటి బహుళ సంస్థలను ఉపయోగిస్తుంటారు. అందువల్ల ఈ విధానాన్ని 'బహుళ సంస్థల విధానం' అని అంటారు.

ప్రభుత్వం సంస్థాపరమైన పరపతి సౌకర్యాలు పెంచడం ద్వారా రైతాంగాన్ని గ్రామీణ వడ్డీ వ్యాపారుల నుంచి రక్షించడం ద్వారా రైతుల్లో విశ్వాసం పాదుకొల్పడం ద్వారా వ్యవసాయాభివృద్ధికి దోహదం చేస్తుంది.

1. ప్రభుత్వం

సహకార సంస్థలు, వాణిజ్య బ్యాంకులు వంటి సంస్థాగత పరపతి సౌకర్యాలు అందించే సంస్థలు అభివృద్ధి చెందని కాలంలో రైతాంగానికి స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను ప్రభుత్వమే అందించేది. వీటిని 'తక్కావీ' రుణాలుగా పేర్కొంటారు. ముఖ్యంగా కరువు కాటకాలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన కాలంలో ప్రభుత్వమే ఇటువంటి రుణాలను సమకూర్చేది.

1971లో 7.1 శాతం, 1981లో 3.4 శాతం 1996-97లో ఐదు శాతం ఉన్న ఈ పరపతి ప్రస్తుతం శూన్యమనే పేర్కొనాలి. ప్రభుత్వ నిబంధనలు కఠినంగా ఉండటం, అధికారుల అలసత్వం, సకాలంలో రుణం మంజూరు కాకపోవడం, నిర్దిష్ట ప్రయోజనాలకు మాత్రమే ఇవ్వడం వంటి కారణాల వల్ల ఈ రుణాలు అంతగా ప్రజాదరణ పొందలేదని పేర్కొనాలి.

2. సహకార సంస్థలు

అతి తక్కువ వడ్డీకి లభించే వ్యవసాయ పరపతి సహకార పరపతిగా పేర్కొనవచ్చు. భారతదేశంలో సహకారోద్యమ చరిత్ర 1904లో సహకార పరపతి సంఘాల చట్టంతో ప్రారంభమైంది. రాష్ట్ర అవతరణ అనంతరం 1964 సహకార చట్టంతో అల్పకాలిక, మధ్యకాలిక పరపతిని ప్రాథమిక సహకార సంఘాలు, దీర్ఘకాలిక పరపతిని భూమి అభివృద్ధి బ్యాంకులు సమకూర్చాయి. 1987లో సహకార పరపతిలో ఏకగవాక్ష విధానం ప్రవేశపెట్టారు. దీని ప్రకారం రైతులకు సంబంధించిన స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక పరపతి అవసరాలన్నీ ఒకేచోట తీర్చే పద్ధతి మొదలైంది. ఆప్కాబ్ ఆధ్వర్యంలో జిల్లా సహకార బ్యాంకులు, ప్రాథమిక సహకార సంఘాల ద్వారా రైతాంగం స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను సహకార శాఖ అందజేస్తుంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పునర్వ్యవస్థీకరణకు ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ ఛైర్మన్ ప్రొ.వైద్యనాథన్ సిఫార్సులు అమలు చేశారు. ఫలితంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను 2940కి కుదించారు. ప్రస్తుతం ఇవి 1974కి కుదించారు. గ్రామీణ రైతాంగానికి పరపతి కల్పించడంలో సహకార సంఘాలు కీలకపాత్ర వహిస్తున్నాయి.

3. వాణిజ్య బ్యాంకులు

ప్రాధాన్యత రంగాలకు రుణ సౌకర్యం విస్తరించాలని 1969లో 14 బ్యాంకులను, 1980లో ఆరు బ్యాంకులను ప్రభుత్వం జాతీయం చేసింది. అంతేగాక గ్రామీణ పరపతిని విస్తరించాలని నారీమన్ సిఫార్సులలో 1969లో లీడ్ బ్యాంకులను నెలకొల్పింది. ఈ బ్యాంకులు ప్రతి జిల్లాలో పరపతి ప్రణాళికను తయారుచేసి, గ్రామీణ పరపతిని విస్తరించడానికి బహుముఖ చర్యలను చేపట్టింది. క్రాప్‌లోన్లు, గ్రూప్‌లోన్లు, గ్రామాలను దత్తత చేసుకోవడం, వివక్షాపూరిత వడ్డీ స్కీమును ప్రవేశపెట్టి గ్రామీణ పరపతిని విస్తృతపరచింది.

4. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు

20 సూత్రా ఆర్థిక కార్యక్రమంలో భాగంగా 1975 బ్యాంకులు ఏర్పాటయ్యాయి. ఈ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు వ్యవసాయదారులకు, ఉపాంత వ్యవసాయదార్లకు, వ్యవసాయ కూలీలకు, చేతివృత్తుల వారికి పరపతిని అందిస్తాయి. ప్రతి ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు యొక్క ఆధీకృత మూలధనం రూ. కోటి. ఇందులో కేంద్ర ప్రభుత్వానికి 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వానికి 15 శాతం, మిగిలిన 35 శాతం ప్రోత్సహించిన బ్యాంకుకు వాటా ఉంటుంది. గ్రామీణ పరపతిలో ఇవి కీలకపాత్ర వహిస్తూ గ్రామీణ వ్యవసాయ రుణ కల్పనలో ఇవి ప్రధాన వనరుగా ఉన్నాయి.

5. నాబార్డ్

వ్యవసాయ రుణానికి సంబంధించి నాబార్డ్ శిఖరాగ్ర సంస్థ వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి కోసం శివరామన్ కమిటీ సిఫార్సులతో 1982లో నాబార్డు ఏర్పాటు చేశారు. రీ ఫైనాన్స్‌తో పాటు నాబార్డ్ రాష్ట్ర సహకార బ్యాంకులకు, ఆర్ఆర్‌బిలకు, రాష్ట్ర ప్రభుత్వాలకు 'టర్మ్‌లోన్'లను మంజూరు చేస్తుంది. దీనితోపాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి దీర్ఘకాలిక రుణం అందిస్తుంది.

6. కిసాన్ క్రెడిట్ కార్డులు

కేంద్ర ప్రభుత్వం 1998 ఆగస్టులో ఈ పథకాన్ని ప్రారంభించింది. వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు ఈ కార్డులను జారీ చేస్తున్నాయి.



రూ.5000 అంతకంటే ఎక్కువ పంట రుణాలు పొందడానికి అర్హతగల రైతులకు మాత్రమే అల్పకాలిక పరపతిని సమకూర్చడానికి ఈ కార్డును జారీ చేస్తారు. కార్డు చెల్లుబడి కాలం మూడు సంవత్సరాలు. అల్పకాలిక రుణ పరపతిని కల్పించడంతోపాటు రైతులకు ప్రమాద బీమానూ కల్పిస్తుంది.

7. మైక్రో ఫైనాన్స్

బ్యాంకులు స్వయం సహాయక బృందాల లింకేజీ పథకమే మైక్రోఫైనాన్స్. పేదవారితో బ్యాంకింగ్ అనే విధానం ప్రాతిపదికన మైక్రోఫైనాన్స్ అనే పద్ధతి ప్రవేశపెట్టారు. రుణ మంజూరుకు సంబంధించిన వ్యయం తగ్గించడం, రుణాన్ని సమర్థవంతంగా వసూలు చేయడం ఈ విధాన లక్ష్యం. దీని ప్రధాన ప్రయోజనం సకాలంలో రుణం మంజూరు చేయడంతోపాటు, సకాలంలో రుణ వసూలు చేయడం. ఈ నమూనా ద్వారా బ్యాంకులు స్వయం సహాయక గ్రూపులకు, ఉపాంత రైతులకు చిన్న రైతులకు, గ్రామీణ చేతివృత్తుల వారికి, చిన్న వ్యాపారస్తులకు పరపతి అందిస్తుంటాయి.

పైన పేర్కొన్న విధంగా రాష్ట్రంలో గ్రామీణ పరపతిలో సంస్థాగత మార్పులు చేసి, వ్యక్తుల ప్రాధాన్యత 95 శాతం నుంచి 25 శాతానికీ.. సంస్థల యొక్క పాత్రను ఐదు శాతం నుంచి 75 శాతానికీ పెంచారు. 2001-02లో 1.32 కోట్ల రైతు ఖాతాలకు రూ.64 వేల కోట్లు ప్రత్యక్ష వ్యవసాయ రుణాలు లభించగా 2016 మార్చి నాటికి 7.68 కోట్ల ఖాతాలకు 8.94 లక్షల కోట్లు మంజూరయ్యాయి. వ్యవసాయ రుణాల మంజూరులో పెరుగుదల నమోదవుతున్నా.. సేద్యంలో అధికమవుతున్న వ్యయాన్ని తట్టుకొనేంత స్థాయిలో రుణ మంజూరు పెరగడం లేదు. దీంతో రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

కొంతమంది భూ యజమానులు తమ పొలం పత్రాలను చూపి, బ్యాంకుల నుంచి రుణాలు పొంది, వ్యవసాయేతర ప్రయోజనాలకు వాడుకుంటారు. ఇలా బ్యాంకుల నుంచి పొందిన వ్యవసాయ రుణాలు దారి మళ్లి, స్థిరాస్థి లావాదేవీలు, చిల్లర వ్యాపారం, హోటల్, షేర్ మార్కెట్ కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. ఇతర రుణాలతో పోలిస్తే వ్యవసాయ రుణాలు ఐదు నుంచి ఏడు శాతం తక్కువ వడ్డీకి లభిస్తుంటాయి. వ్యవసాయ రుణాలు చౌకగా లభ్యమవడం వల్ల వాటిని వ్యవసాయేతర కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. సొంత భూములను కౌలుకిచ్చి, మహానగరాల్లో జీవించేవారు నాలుగు నుంచి పది శాతం వ్యవసాయ రుణాలు చేజిక్కించుకుంటున్నారు. రాయితీ రేటుకు లభ్యమయ్యే రుణాలు దారిమళ్లడంతో కౌలుదారులు ఎక్కువ వడ్డీకి రుణాలు తెచ్చుకుంటున్నారు.

బ్యాంకులు జాతీయీకరణ (1969)లో జరిగిన తరువాత వ్యవసాయం, చిన్న పరిశ్రమలు వంటి ప్రాధాన్యతా రంగాలకు కోటాను క్రమంగా పెంచుకుంటూ 1985 నాటికి మొత్తం బ్యాంకు రుణాల్లో 40 శాతం వ్యవసాయం, అనుబంధ వృత్తులకు అందజేశారు. ఇందులో 18 శాతం మేరకు వ్యవసాయానికి నిర్దిష్టంగా దక్కుతుంది. నర్సింహం కమిటీ సిఫార్సుల అనుగుణంగా చేపట్టిన బ్యాంకింగ్ సంస్కరణల అనంతరం ఈ ప్రాధాన్యత రుణ సదుపాయం అనే భావన కనుమరుగైంది.

రైతుకు అవసరమైన మొత్తం రుణ అవసరాల్లో 15 నుంచి 20 శాతం మాత్రమే సంస్థాగత రూపంలో లభిస్తుంది. వ్యవసాయ రంగానికి అందుబాటులో ఉన్న ఈ తక్కువ మొత్తం రుణం కూడా పేద రైతాంగానికి, మధ్యతరగతి రైతాంగానికన్నా వ్యవసాయం పేరిట ఇతర రంగాలకు మళ్ళు తోంది. వ్యవసాయరుణాల పేరిట ఇవి ప్రయివేటు కంపెనీలకు, సంపన్న రైతాంగానికి దక్కుతున్నాయి.

బ్యాంకులు పారిశ్రామిక వేత్తలకు రుణాలు ఇచ్చినంత సులువుగా కౌలుదారులకు ఇవ్వడం లేదు. కౌలుదారులు ఎటువంటి పూచీకత్తు సమర్పించ లేకపోవడం వల్ల సహజంగానే వారికి రుణాలను తగ్గిస్తున్నాయి. అందువల్ల బ్యాంకులు సందేహాలు తీర్చడానికి ప్రభుత్వమే హామీదారుగా నిలవడమో లేదా వేరేవిధమైన భరోసా ఇవ్వగలగాలి.

కౌలు ఒప్పందాలు కుదుర్చుకున్న కౌలుదారులకు సులువుగా సబ్సిడీ రేట్లకు బ్యాంకు రుణాలు లభిస్తున్నాయి. అయితే అనేకమంది భూ యజమానులు కౌలు ఒప్పందాలు కుదుర్చుకోడానికి సంశయిస్తున్నారు. భూ యజమానుల హక్కులను స్పష్టంగా గుర్తించి, లీజుకాలం ముగిసిన తరువాత కౌలుదారులు తప్పనిసరిగా భూ యజమానులకు అప్పగించాలని నిబంధన విధించాలి. భూమిని అప్పగించడానికి నిరాకరించడాన్ని శిక్షార్హ నేరంగా పరిగణించి, సంబంధిత కౌలుదారుకి రుణాలు, ఇతర రాయితీలు లభ్యమవ్వకుండా చూడాలి. ఈ విధంగా చేస్తే కౌలుకిచ్చిన భూమి తిరిగి రాదనే భయం భూ యజమానులకు తొలుగుతుంది. వాస్తవ సాగుదారులందరికీ వ్యవసాయ రుణాలు అందేలా విధానాలు రూపొందించాలి. రుణ హామీ నిధిని ఏర్పాటు చేసి, చిన్న, సన్నకారు రైతులకు, కౌలు రైతులకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలి. ★

ఉద్యోగాలు

ఏపీపీఎస్సీ 109 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సబార్డినేట్ సర్వీస్‌లో 109 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఏపీపీఎస్సీ దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు పేరు: ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ గ్రేడ్-1 (సూపర్‌వైజర్) (మహిళలకు మాత్రమే).

జోన్ల వారీ ఖాళీలు: జోన్ 1-27, జోన్ 2-25, జోన్ 3-29, జోన్ 4-28.

అర్హత: పోస్టును బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో బీఎస్సీ ఉత్తీర్ణత.

వయసు: జులై 1, 2018 నాటికి 18-42 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం: స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ/ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు: అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250, ఎగ్జామినేషన్ ఫీజు రూ.80.

ఫీజు చెల్లించుటకు చివరి తేదీ: జనవరి 17, 2019.

ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: జనవరి 18, 2019.

మెయిన్ ఎగ్జామ్ నిర్వహణ తేదీ: ఏప్రిల్ 25, 2019.

పూర్తి వివరాలకు : వెబ్‌సైట్‌లో పరిశీలించొచ్చు.

వెబ్‌సైట్: www.psc.ap.gov.in

ఎటిఎంల వద్ద బారులుతీరిన జనాలు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వరుస సెలవులు రావడంతో నగరంలో మళ్లీ నగదు కష్టాలు మొదలయ్యాయి. వరుస సెలవుల నేపథ్యం, పండుగ కావడం వల్ల ప్రజలకు నగదు వినియోగం అనివార్యమైంది. దీంతో బ్యాంకు ఖాతాదారులంతా ఆదివారం ఉదయం నుంచి నగరంలోని వివిధ ఎటిఎం వద్ద బారులు తీరారు. శనివారం పలు బ్యాంకులు తమ ఎటిఎంలలో నగదును నింపినప్పటికీ అదికాస్త ఖాళీ అయింది. దీంతో వినియోగదారులంతా నిరాశతో వెనుదిరిగారు.

నగరంలో ఎస్‌బిఐ, ఆంధ్రాబ్యాంకు, ఐసిఐసిఐ, కర్నాటక ఇతర బ్యాంకులకు చెందిన సుమారు 250 ఎటిఎంలు పనిచేస్తున్నాయి. వీటిలో ఎక్కువగా బిసెంటురోడ్డు, ఏలూరు రోడ్డు, బందరురోడ్డు, పటమట, కృష్ణలంకలో ఉన్న ఎటిఎంల నుంచి ప్రజలు అధిక మొత్తంలో నగదును విత్‌డ్రాలు చేస్తుంటారు. ఒక్కో బ్యాంకు తమ ఎటిఎంలో డిమాండ్‌కు అనుగుణంగా నగదును నింపుతుంటోంది.

కృష్ణా జిల్లా పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీ



కిక్కిరిసిన రహదారులు

ప్రజాశక్తి-విశాఖ/విజయవాడ

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని హైదరాబాద్‌తోపాటు తెలంగాణా జిల్లాల్లో స్థిరపడిన కోస్తావాసుల రాక, విజయవాడ, విశాఖ, తిరుపతి ప్రాంతాలు సహా పలు నగరాల్లో ఉంటున్న ప్రజలు ఆయా గ్రామాలకు బయలుదేరడంతో ఆదివారం కూడా జాతీయ రహదారులు కిక్కిరిసి కన్పించాయి. విజయవాడ, విశాఖ, తిరుపతి ప్రాంతాల్లో బస్సులు, రైళ్లు రద్దీగా నడిచాయి. ఆయా ప్రాంతాల్లో రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు కిక్కిరిశాయి. విజయవాడ నగరంలో ఏ రోడ్డు మీద చూసినా జనం కిక్కిరిసి ఉన్నారు. నందిగామ, కంచికచర్ల, పరిటాల, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలో పలు గ్రామాల్లో రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాల రద్దీతో పాదచారులు, ద్విచక్రవాహనదారులు రోడ్డు దాటాలంటే కనీం 10 నిమిషాలు పట్టింది. వాహనాల రద్దీతో కీసర, భీమవరం వద్ద గల టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీనికితోడు హైదరాబాద్ నుంచి పలువురు భార్యా పిల్లలతో కలిసి ద్విచక్రవాహనాలపై విజయవాడ వైపు చేరుకున్నారు. వారిని నందిగామ డిఎస్‌పి కె.హరిరాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పలుచోట్ల పోలీసులు వారిని కొద్దిసేపు ఆపి కౌన్సిలింగ్ చేశారు. విశాఖ వాసులు పల్లెబాట పట్టడంతో విశాఖ బస్ కాంప్లెక్స్‌లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. జీవనోపాధి కోసం విశాఖ వచ్చి నివసిస్తున్న వారంతా సొంత గ్రామాలకు బయలుదేరారు. భవన నిర్మాణ కార్మికులు, హోటల్ పనివారు, తోపుడు బళ్ళు, ముఠా కార్మికులు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు వెళ్తున్నారు. దీంతో ఆర్‌టిసి బస్సులు, రైళ్లు కిటకిటలాడాయి. ద్వారకా బస్ స్టేషన్, మద్దిలపాలెం బస్ స్టాండ్ ప్రయాణికులతో నిండిపోయాయి. మరో పక్క ప్రయివేటు వాహనాలకూ రద్దీ పెరిగింది. ఒక్కసారిగా నగర వాసులు ప్రయాణాలకు సిద్ధపడటంతో రోడ్లన్నీ రద్దీగా మారాయి. ట్రాఫిక్ సిగ్నల్స్, టోల్‌గేటు వద్ద ట్రాఫిక్ జామ్ ఎక్కువగా ఉంది. ప్రధానంగా ఎన్‌ఎడి సెంటర్ దాటడానికి సుమారు అర్ధగంట సమయం వేచి చూడాల్సిన పరిస్థితి కనిపించింది.

భూ అక్రమాల్లో తర్లుపాడు తహశీల్దారు సస్పెన్షన్

ప్రజాశక్తి-తర్లుపాడు (ప్రకాశం)



విజయభాస్కరరెడ్డి

తర్లుపాడు మండల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో కొందరు రెవెన్యూ అధికారులు వ్యాపారమే చేశారు. సొంత ఆస్తిలా బేరం పెట్టి ఎకరానికి రూ. 20 వేల నుంచి రూ. 30 వేలు తగ్గకుండా ముడుపులు దండుకున్నారు. ముడుపులు ముట్టజెప్పిన వారికి అర్హత లేకపోయినా ప్రభుత్వ భూముల్లో హక్కులు కల్పించారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ పెద్దలు 1000 ఎకరాలకు పైగా కాజేశారని, పెద్ద మొత్తంలో ముడుపులు పుచ్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా వెలుగులోకి వచ్చిన 750 ఎకరాల భూ భాగోతంపై ఈ నెల 9వ తేదీన 'ప్రజాశక్తి'లో 'ప్రభుత్వ భూముల్లో 'రెవెన్యూ' వ్యాపారం' శీర్షికతో కథనం వెలువడింది. తర్లుపాడు మండలంలో జరిగిన భూ అక్రమాలపై జిల్లా కలెక్టర్ వి.వినయ్‌చంద్ స్పందించారు. ప్రాథమిక విచారణ చేపట్టారు. తర్లుపాడు తహశీల్దారు బి.విజయభాస్కరరెడ్డి ప్రమేయం ఉందని విచారణలో తేలింది. తహశీల్దారు విజయభాస్కరెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వినయ్‌చంద్ ఉత్తర్వులు జారీ చేశారు. విజయభాస్కరరెడ్డి అమెరికాలో ఉంటున్న కుటుంబీకుల వద్దకు ఇటీవలే వెళ్లారు. సస్పెన్షన్ ఉత్తర్వులను విజయభాస్కరరెడ్డి నివాసం ఉంటున్న కంభం పట్టణంలోని ఇంటికి అంటించారు. భూ అక్రమాల విచారణ పూర్తి స్థాయిలో జరుగుతుందని, మరికొందరు రెవెన్యూ సిబ్బందిపై వేటు పడే అవకాశం ఉందని తెలిసింది.

ప్రజాశాంతి పార్టీ కో-ఆర్డినేటర్ల నియామకం

ప్రజాశక్తి-సత్యనారాయణపురం (విజయవాడ)

ప్రజాశాంతి పార్టీకి కో-ఆర్డినేటర్లను నియమించామని ఆ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ కె.ఎ.పాల్ తెలిపారు. విజయవాడ హోటల్ ఐలాపురంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ మేరకు వివరాలను తెలిపారు. ప్రజాశాంతి పార్టీ సెక్రటరీగా జ్యోతి బేగాన్ని నియమించారు. కో-ఆర్డినేటర్లుగా విజయలక్ష్మి, మేదర్ సురేష్ కుమార్, మంగపట్ల విజయలక్ష్మి, పాల్ ఆర్మీ జాలరాజు, కె.ఎస్. రావులను నియమించినట్లు చెప్పారు. త్వరలోనే పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వేళ్లు తెగినా పట్టించుకోరా?

- ప్రశ్నిస్తే కేసులు పెట్టి బెదిరింపులా..
- యూనియన్ పెడితే తొలగింపులేనా
- కార్మికులపై కర్కశాన్ని చూపుతున్న శ్రీసిటీ



ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో

పరిశ్రమలో పనిచేసేటప్పుడు ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. వరుసగా ముగ్గురు కార్మికుల చేతి వేళ్ల తెగిపోయినా యాజమాన్యం స్పందించలేదు. కనీసం ప్రాథమిక వైద్యం అందించకుండా 'చేతులు కడుక్కుని పనులు చూసుకోండి' అంటూ యాజమాన్యం హుకుం జారీ చేయడం గమనార్హం. దీన్ని ప్రశ్నించినందుకు దళిత యువకులపై కేసులు పెట్టి భయాందోళనకు గురి చేసింది. కార్మిక యూనియన్ పెట్టుకున్నారన్న అక్కసుతో 40 మంది కార్మికుల్ని అకారణంగా తొలగించిన ఘటన శ్రీసిటీలో వెలుగు చూడటం విచారకరం. ఓ వైపు స్థానికుల నుంచి భూములు లాక్కుని వారికి ఉద్యోగాలివ్వకుండా స్థానికేతరులకు పెద్దపీట వేస్తుండటం బాధాకరం. మరోవైపు చాలీచాలని జీతాలు, కార్మిక హక్కుల ఉల్లంఘనలు, 10 నుంచి 12 గంటల పాటు వెట్టిచాకిరీతో పాటూ యూనియన్ పెట్టుకోవడమే నేరంగా భావించి కార్మికులను తొలగించడం పట్ల ట్రేడ్ యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీసిటీ పరిధిలో పెప్సికో ఫ్యాక్టరీలో 200 మంది కార్మికులు పని చేస్తున్నారు. వారిలో సగం మంది ఒప్పంద కార్మికులే. కంపెనీ తరపున పనిచేస్తున్న వారిలో ఎక్కువ శాతం స్థానికేతరులే. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారు స్థానికంగా భూములు కోల్పోయిన శ్రీసిటీ నిర్వాసిత కుటుంబీకులు. ఇటీవల కాలంలో కార్మికులు విధులు నిర్వహిస్తున్న తరుణంలో ముగ్గురికి వరుసగా చేతివేళ్లు తెగిపోయాయి. అయినా యాజమాన్యం స్పందించలేదు సరికదా ప్రాథమిక వైద్యమూ అందించలేదు. దీన్ని ప్రశ్నించిన కార్మికులను తులనాడుతూ 'తెగిపోయింది చేతివేళ్లే కదా..అంతమాత్రానే రాద్ధాంతం అవసరమా..! నీళ్లతో కడుక్కుని పనుల్లోకి వెళ్లండి' అంటూ కంపెనీ యాజమాన్యం హుకుం జారీ చేసింది. దీనిపై తిరగబడ్డ కార్మికులపై కేసులు పెట్టించేందుకు ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో 46 మంది కాంట్రాక్టు కార్మికులు సంఘటతమై యూనియన్‌ను (టిఎన్‌టియుసి) పెట్టుకున్నారు. దీంతో అప్రమత్తమైన శ్రీసిటీ యాజమాన్యం ఆ సంఘం నేతలపైనా పెద్దఎత్తున ఒత్తిడి తెచ్చి యూనియన్‌ను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తూ కార్మికులందరినీ విధుల నుంచి తొలగించింది. ప్రస్తుతం కార్మికులు తిరుపతిలోని లేబర్ అధికారులను కలిసి న్యాయ పోరాటం చేస్తున్నారు.

కార్మికులకు అండగా నిలుస్తాం

కందారపు మురళి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

యూనియన్ పెట్టుకోవడమనేది కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కు. పనిప్రదేశాల్లో కార్మికులకు తప్పనిసరిగా కనీస వసతులు, సౌకర్యాలు, వైద్యసేవలు అందించాల్సిన బాధ్యత యాజమాన్యానిదే. వర్కర్స్‌కు చేతివేళ్లు తెగిపోయినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా, ప్రశ్నించారన్న అక్కసుతో కార్మికులపై కక్షసాధింపు చర్యలకు దిగడం దుర్మార్గం. పెప్సికో కార్మికులకు అండగా సిఐటియు, ఇతర ట్రేడ్ యూనియన్లు నిలుస్తాయి. వారికి న్యాయం జరిగే వరకూ పోరాడతాం.



ఆసుపత్రినిని ప్రారంభిస్తున్న ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్

తల్లీబిడ్డ ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి - తుని (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా తునిలో సుమారు రూ.8.50 కోట్లతో నిర్మించిన తల్లీబిడ్డ ఆసుపత్రిని వైద్య, ఆరోగ్యశాఖమంత్రి ఎన్‌ఎండి ఫరూక్‌తో కలిసి మంత్రి యనమలరామకృష్ణుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమపథకాలను రెట్టింపుచేయడం ప్రజలకు ఆర్థికంగా మరింత భరోసా కల్పించడానికే తప్ప మరే రాజకీయ ఉద్దేశమూ లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణం, రైల్వేజోన్ విషయాల్లో హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను వంచించిందన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా మాతా శిశు ఆసుపత్రి నిర్మించినట్లు తెలిపారు. ఈ ఆసుపత్రి వల్ల సుమారు 3 నియోజకవర్గాల ప్రజలకు సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆరోగ్యశాఖమంత్రి ఫరూక్ మాట్లాడుతూ గుజరాత్ అల్లర్ల విషయంలో మోడీ వ్యవహారశైలిపై అప్పట్లో చంద్రబాబునాయుడు కఠినంగా వ్యవహరించినట్లు చెప్పారు. అందువల్లే నేడు మోడీ ఇటు టిడిపిని, చంద్రబాబునాయకత్వంపైనా కక్షపూరిత వైఖరి అవలంబిస్తున్నారని, ఇటువంటి చర్యలను ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆయన హెచ్చరించారు.

కురుబ గర్జనలో భగ్గుమన్న విభేదాలు

- అసహనంతో వెనుదిరిగిన కర్నాటక మాజీ ముఖ్యమంత్రి

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

అనంతపురంలో ఏర్పాటు చేసిన కురుబ గర్జనలో నాయకుల మధ్య విబేధాలు భగ్గుమన్నాయి. పార్టీలకు అతీతంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కొందరు రాజకీయ అంశాలను తెరపైకి తేవడంతో నాయకులు ఒకరిపై ఒకరు విమర్శల దాడికి దిగారు. ఈ ఘటనతో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కర్నాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కార్యక్రమం మధ్యలోనే వెనుదిరిగారు.

అనంతపురం జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో కురుబ మహాగర్జన కార్యక్రమాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. డి.జగదీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సిద్ధరామయ్య హాజరయ్యారు. కార్యక్రమం జరుగుతుండగా ఇటీవల తన పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించిన సిఐ గోరంట్ల మాదవ్ సభావేదికపైకి వచ్చారు. ఈ సమయంలో ఆయన మద్దతుదారులు పెద్ద ఎత్తున కేరింతలు వేశారు. అయితే మాధవ్ సభావేదిక వద్దకు రావడాన్ని పెనుకొండ టిడిపి ఎమ్మెల్యే బికె.పార్థసారథి, మరికొందరు నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి విమర్శలకు దిగారు. ఆరోపణలు శృతిమించడంతో సిద్ధరామయ్య నాయకులపై అసహనం వ్యక్తం చేసి, అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ పరిణామంతో నిర్వాహకులు కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా ముగించేశారు.



సిద్ధరామయ్యకు జ్ఞాపికను అందజేస్తున్న కురుబసంఘం నాయకులు



సభలో విమర్శలు చేసుకుంటున్న నాయకులు

ఇందిరా, రాజీవ్ విగ్రహాల ఆవిష్కరణ

అనంతపురం పర్యటనకు విచ్చేసిన సిద్ధరామయ్య జిల్లా కేంద్రంలోని టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. గాంధీ కుటుంబం దేశానికి విశేష సేవలు అందించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి, ఉపాధ్యక్షులు శైలజానాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1.ఆండీముర్రే
2.డిసెంబర్ 2021
3.అశోక్ చావ్లా
4.హరేంద్ర సింగ్
5.21 నుండి

డబ్బులు దోచుకునే బిపిఎస్

- 2007లో వైఎస్ ప్రభుత్వం జివిఎంసిలో రూ. 83 కోట్లు వసూలు
- 2015లో రూ. 117 కోట్లు రాబట్టిన చంద్రబాబు ప్రభుత్వం
- తాజాగా రూ.100 నుంచి 150 కోట్లు గుంజుకునేందుకు రంగం సిద్ధం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం(బిపిఎస్) డబ్బులు గుంజుకునే కామధేనువులా మారింది. మున్సిపాల్టీలకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా ఇలా వసూలు చేయిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. 2007లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం.. 2015లో చంద్రబాబు ప్రభుత్వం బిపిఎస్ అస్త్రాన్ని ఉపయోగించి భారీగానే డబ్బులు దండుకున్నాయి. తాజాగా చంద్రబాబు ప్రభుత్వం మరోసారి గల్లా పెట్టె నింపుకునేందుకు బిపిఎస్ అస్త్రాన్నే నమ్ముకుంది. రాష్ట్రంలో అతి పెద్ద నగర పాలక సంస్థగా ఉన్న జివిఎంసిలో నిత్యం ఏవో ఈవెంట్లు జరిపి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న ప్రభుత్వం భవన నిర్మాణ అనుమతుల సమయంలో ఓ సారి, అక్రమాలు జరిగాయని మరోసారి డబ్బులు గుంజుకోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దశాబ్దాలుగా జరిగిన తప్పులకు పుల్‌స్టాప్ పెట్టేందుకు 2007 లో అవకాశం ఇచ్చారు. తర్వాత నిర్మించే భవనాల్లో అక్రమాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత టౌన్‌ప్లానింగ్ విభాగానిదే. ఆ విభాగం పనితీరును మెరుగుపర్చాల్సిన ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేస్తోంది. రెండు సార్లు బిపిఎస్‌కు వెళ్లాల్సి వచ్చిందంటే తప్పులను టౌన్‌ప్లానింగ్ వైఫల్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధిలో 2007 లో 23 వేల దరఖాస్తులు రాగా, వాటి నుంచి రూ.83.46 కోట్లు వసూలు చేశారు. 2015లో 13,290 మంది దరఖాస్తు చేసుకోగా రూ.117.48 కోట్లు రాబట్టారు. ఇప్పుడు మరోసారి ప్రభుత్వం జిఒ ఇవ్వడంతో జివిఎంసిలో దాదాపుగా 5 వేలు దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. తద్వారా రూ.100 కోట్లు నుంచి రూ.150 కోట్లు వసూలు చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. తాము ఎలాంటి లక్ష్యాలు పెట్టుకోలేదని జివిఎంసి సిటీ ప్లానర్ ప్రభాకర్ ప్రజాశక్తికి తెలిపారు. అక్రమ నిర్మాణాలు కలిగిన వారు స్వచ్ఛందంగా బిపిఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ బిపిఎస్ ద్వారా ఒక్క జివిఎంసి మాత్రమే కాకుండా విశాఖ మెట్రో రీజనల్ డెవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ) కూడా రూ.10 కోట్లు రాబట్టుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2015 లో వుడా రూ.3 కోట్లు ఆర్జించింది. ఇప్పుడు విఎంఆర్‌డిగా మార్పు చెందిన తర్వాత వుడా పరిధి తుని నుంచి శ్రీకాకుళం వరకు విస్తరించిన సంగతి తెలిసిందే. విశాఖ నగరం శరవేగంగా విస్తరిస్తుండటంతో నగర శివార్లలో విచ్చలవిడిగా అపార్టుమెంట్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటిపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అనుమతులను ఉల్లంఘించి నిర్మాణాలు చేస్తున్నారు.


టౌన్‌ప్లానింగ్ ఏం చేస్తోంది

సొంత స్థలాల్లో నివాసాలు కట్టుకునే వారు చిన్న చిన్న తప్పులు చేసినా దానికి వారిదే బాధ్యత కనుక బిపిఎస్‌లో అపరాధ రుసుం చెల్లించి దాన్ని క్రమబద్ధీకరించుకుంటారు. అలా కాకుండా బిల్డర్లు చేసిన తప్పులకు ప్లాట్లు కొన్న వారు బలవుతున్నారు. భవన నిర్మాణ అనుమతులు ఇచ్చేటప్పుడు దాంట్లో 10 శాతం విలువకు మార్ట్‌గేజ్ చేస్తారు. నిర్మాణం పూర్తయ్యాక అనుమతుల ప్రకారమే నిర్మిస్తే బిల్డర్‌కు అక్యుపేషన్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. తర్వాత ప్లాట్లు కొనుక్కున్న వారికి రిజిస్ట్రేషన్ చేస్తారు. కానీ మార్ట్‌గేజ్‌లు, చెకప్‌లు సక్రమంగా జరగడం లేదు. వీటన్నింటినీ పరిశీలించకుండా ప్లాట్లు కొనుక్కున్న వారు రిజిస్ట్రేషన్ సమయంలో ఇబ్బందులు పడుతున్నారు.

ఎవి.రమణరావు, వార్వా నేత

గైడ్‌లైన్స్ వచ్చాక దరఖాస్తులు స్వీకరణ

బిపిఎస్‌పై జిఒ విడుదలైంది. పూర్తి స్థాయిలో గైడ్‌లైన్స్ రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే దరఖాస్తులు స్వీకరిస్తాం. 1985 జనవరి 1 నుంచి 2018 ఆగస్టు 31 మధ్యలో జరిగిన నిర్మాణాలకే ఈ జిఒ వర్తిస్తుంది. దరఖాస్తుల స్వీకరణకు 90 రోజుల పాటు గడువు ఉంది. దరఖాస్తులు, తర్వాత చెల్లించాల్సిన అపరాద రుసుం కూడా ఆన్‌లైన్‌లోనే స్వీకరిస్తాం. అక్రమ నిర్మాణాలు చేసిన వారంతా బిపిఎస్‌ను ఉపయోగించుకోవాలి.



హరినారాయణన్, జివిఎంసి



శ్రీశైలం నల్లమల ఘాట్‌రోడ్డులో గోడను ఢీకొట్టిన ప్రయివేటు బస్సు, విశాఖ రుషికొండ మలుపు వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన యువకులు (ఇన్‌సెట్లో)

పండగ వేళ విషాదాలు

విశాఖలో బైక్ ప్రమాదంలో ఇద్దరు మృతి

శ్రీశైలం వద్ద తప్పిన పెనుప్రమాదం

విజయనగరంలో సిఐ సహా 10 మందికి గాయాలు

కృష్ణాలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి యంత్రాంగం

రాష్ట్రంలో మూడు జిల్లాల్లో ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందగా, 55 మంది గాయపడ్డారు. విశాఖలో ఇద్దరు మృతిచెందగా, శ్రీశైలం నల్లమల్ల ఘాట్‌రోడ్‌లో బస్సు లోయలోకి ఘటనలో 50 మంది సురక్షితంగా బయటపడ్డారు. విజయనగరం జిల్లాలో సిఐ సహా ముగ్గురు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. విశాఖ జివిఎంసి వార్డు పరిధి పెద్ద రుషికొండ మలుపు వద్ద డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి పిఎం పాలెం సిఐ వెంకునాయుడు కథనం ప్రకారం... ముగ్గురు యువకులు పల్సర్ బైక్‌పై మితిమీరిన వేగంతో భీమిలివైపు నుంచి విశాఖ వైపు వస్తున్నారు. మినర్వా స్కూలు సమీపంలో మలుపు వద్ద వీరి వాహనం ముందుగా డివైడర్‌ను, తర్వాత విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి కింద పడిపోయారు. పండా ప్రవీణ్ కుమార్ (20), చింతపల్లి దేసుబాబు (18) అక్కడికక్కడే మృతిచెందారు. మరో యువకుడు పాలకొల్లు సాయికుమార్ తీవ్ర గాయాలపాలయ్యాడు. వీరు అప్పూఘర్ ప్రాంతానికి చెందినవారు. సాయికుమార్ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. శ్రీశైలం నల్లమల ఘాట్‌రోడ్డులోని చిన్నారుట్ల వద్ద ప్రయివేటు టూరిస్టు బస్సు అదుపు తప్పి పిట్టగోడను ఢీకొట్టి ఆగిన ఘటనలో 50 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. మహారాష్ట్రకు చెందిన 50 మంది ప్రయివేటు టూరిస్టు బస్సు (జిఎ03 బిడబ్ల్యు0908)లో డిసెంబర్ 31వ తేదీ తీర్థయాత్రలకు బయలుదేరారు. శనివారం ఉదయం తిరుపతిలో దర్శనం చేసుకుని శ్రీశైలానికి బయలుదేరారు. రాత్రి 9 గంటలకు దోర్నాల వద్ద చెక్‌పోస్టు మూసివేయడంతో ఆదివారం ఉదయం శ్రీశైలానికి బయలుదేరారు. శ్రీశైలంకు 15 కిలోమీటర్ల దూరంలో చిన్నారుట్ల దయ్యాల టర్నింగ్ వద్ద అదుపుతప్పి పిట్టగోడను ఢీకొట్టి లోయలోకి బస్సు దూసుకెళ్లింది. డ్రైవర్ చాకచక్యంతో బ్రేక్ వేయడంతో మధ్యలో అలాగే నిలబడిపోయింది. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఒక వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కుమిలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. సంక్రాంతికి బట్టలు, సామాన్లు కొనేందుకు కుమిలికి చెందిన అనకాపల్లి సన్యాసమ్మ, నాయిని కాళిదాసు, నాయిని సోమయ్య, నూబోతు గౌరి, మావూరి అప్పలరాజు, చల్లవానితోట పంచాయతీ గొల్లపేటకు చెందిన ఆటో డ్రైవర్ సిమ్మ శ్రీను, ఆయన భార్య సిమ్మ గురమ్మ, కుమార్తె సిమ్మ ప్రవల్లిక, కొల్లి కళ్యాణ్ ఆటోలో విజయనగరం వెళ్తున్నారు. ఇదే సమయంలో ఎపిఎస్‌పి సిఐ దామోదర్ భార్య, పిల్లలతో సంక్రాంతికి విజయనగరం నుంచి తమ స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా పలాస బయలుదేరారు. కుమిలి వద్ద ఆటో అదుపు తప్పి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న తొమ్మిది మందితోపాటు, కారులోని సిఐ కూడా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సన్యాసమ్మ, కాళిదాసు, సోమయ్యను విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. కృష్ణాజిల్లా చల్లపల్లి మండల పరిధిలోని సాలిపేటలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనటంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా మరొకరు తీవ్ర గాయాల పాలయ్యారు. రామానగరంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్న పి.ప్రసాద్ (25) ద్విచక్రవాహనంపై లక్ష్మీపురం వైపు వెళ్తుండగా బందరువైపు నుంచి చల్లపల్లి వైపునకు కోడి పుంజులతో ఇద్దరు యువకులు బైక్‌పై అతివేగంగా వస్తూ ఢీకొన్నారు. ప్రమాదంలో ప్రసాద్‌తో పాటు మరోబైక్ నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. బందరు వైపు నుంచి బైక్‌పై వస్తున్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడాడు.

నకిలీ ఎరువుల విక్రయాలకు రాజకీయ అండ?

సీజన్ ముగిసిన తరువాత వెలుగుచూసిన వైనం

మంత్రి తనిఖీలు చేసినా అధికారులపై చర్యలు శూన్యం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో వెలుగు చూసిన నకిలీ ఎరువుల విక్రయాల వెనుక రాజకీయ నాయకుల హస్తం, అధికారుల అవినీతి ఎక్కువగా ఉందనే విమర్శలొస్తున్నాయి. గత వారం రోజుల్లో జిల్లాలో పెద్ద ఎత్తున నకిలీ ఎరువుల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. యుపిఎల్ కంపెనీకి చెందిన ఎరువులుగా రైతులను నమ్మిస్తున్నారు. ఉప్పుకు రంగు కలిపి పొటాషియం ఎరువులు విక్రయిస్తున్నారు. ఈ కంపెనీ వారు తమ కంపెనీకి ఈ ఉత్పత్తులతో సంబంధం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజాగా శనివారం మాచర్ల మండలం ముత్యాల గ్రామంలో 400 బస్తాల ఎరువులను సాగర్ కాల్వలో పారబోశారు. ఖరీఫ్, రబీ సీజన్ ముగిసిన తర్వాత ఇప్పుడు నకిలీ ఎరువులు పెద్ద ఎత్తున బయట పడుతున్నాయి. గతేడాది కాలంలో రెండు సీజన్లలో నకిలీ ఎరువులు వినియోగించి రైతులు ఎంతమేరకు నష్టపోయారో తాజా ఘటనలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఈ రెండు జిల్లాలో ప్రతియేటా నాలుగు లక్షల టన్నుల నుంచి ఐదు లక్షల టన్నుల వరకూ వివిధ రకాల ఎరువులు వినియోగిస్తున్నారు. తక్కువ ధరలకు సేంద్రీయ ఎరువుల పేరుతో కెమికల్స్ కలిపిన నకిలీలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. ఈ రెండు జిల్లాల్లో ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు బయో ఉత్పత్తుల వ్యాపారంలో కీలక భూమిక పోషిస్తున్నారు. బయో ఉత్పత్తులను రాజకీయ అండదండలతోనే కొంతమంది వ్యాపారులు మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. ఎరువుల తయారీదార్లు, విక్రయదార్ల నుండి అధికారులకు అందుతున్న నజరానాలతో కొంతకాలంగా ఈ వ్యాపారం యథేచ్ఛగా సాగిపోతోంది. గతేడాది పలుమార్లు జిల్లాలో నకిలీ ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు బయటపడ్డాయి. విజిలెన్సు, వ్యవసాయ శాఖ అధికారులు దాడులు చేసి పెద్దఎత్తున పురుగు మందులు, విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. కొన్నిచోట్ల రవాణా సంస్థలు, మరికొన్ని చోట్ల దుకాణాలు, నిల్వ కేంద్రాల్లో వీటిని స్వాధీనం చేసుకున్నా జిల్లాలో ఏ ఒక్క అధికారినీ బాధ్యులుగా గుర్తిస్తూ చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. పైగా నకిలీలను నియంత్రణలో విఫలమైన అధికార్లకు ప్రమోషన్లు రావడం గమనార్హం. జిల్లాలో పలుమార్లు వివిధ శాఖల అధికారులు స్వాధీనం చేసుకుంటున్న నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, బయో ఉత్పత్తుల్లో నిందితుల్లో ఒక్కరికీ శిక్ష పడిన దాఖలాల్లేవు. దాడులు చేసిన తర్వాత అధికారులు చేతులు దులుపు కొంటున్నారు. నేరం రుజువు కాకుండా ల్యాబరేటరీలలో నిందితులు మ్యానేజ్ చేసుకుంటున్నారనే ఆరోపణలూ లేకపోలేదు. వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గత ఖరీఫ్ సీజన్‌లో స్వయంగా గుంటూరు వచ్చి దుకాణాలు తనిఖీ చేసి నకిలీ విత్తనాలు పురుగు మందులను గుర్తించిన విషయం తెలిసిందే. సాక్షాత్తు మంత్రి సమక్షంలోనే నకిలీల బాగోతం వెల్లడైనా ఏ ఒక్క అధికారిపై చర్యల్లేవు. ఇటీవల ఆటోనగర్‌లో నకిలీ బయో ఉత్పత్తులు విజిలెన్సు అధికారులు పట్టుకున్నారు.

ప్రభుత్వ ఆఫర్‌ను తిరస్కరించిన సిక్రి



న్యూఢిల్లీ : లండన్‌కు చెందిన కామన్వెల్త్ సెక్రటేరియట్ ఆర్బిట్రల్ ట్రిబ్యునల్ (సిఎస్‌ఎటి)లో సభ్యుడిగా ఎంపికయ్యే అవకాశాన్ని జస్టిస్ సిక్రి తిరస్కరించారు. ఈ మేరకు ఆయన న్యాయశాఖకు ఆదివారం లేఖ రాశారు. సుప్రీంకోర్టులో రెండవ సీనియర్ న్యాయమూర్తి అయిన సిక్రి నెల రోజుల క్రితం ప్రభుత్వం చేసిన ఈ ప్రతిపాదన పై విమర్శలు వెల్లువెత్తడంతో ఆదివారం ఆయన తిరస్కరించారు. గత వారం అలోక్‌వర్మను సిబిఐ డైరెక్టర్ బాధ్యతలపై నిర్ణయం చేసే కమిటీకి సిక్రిని ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నామినేట్ చేశారు. అ కమిటీ రెండు సమావేశాలు జరిపిన తరువాత సిబిఐ నుంచి అలోక్‌వర్మను బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకుంది.

చర్చలు।
షార్జా పాలకుడు సుల్తాన్ బిన్ మహమ్మద్ అల్ ఖాసిమీతో ఆదివారం ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరుపుతున్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధి



జమ్ముకాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

ఇద్దరు ఉగ్రవాదులు మృతి

జమ్ము : జమ్ముకాశ్మీర్‌లోని భద్రతాదళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిలో ఆల్‌-బదర్ ఉగ్ర సంస్థకు చెందిన జీనత్ ఉల్ ఇస్లాం ఉన్నాడని, మరొకరిని సఖీల్ దార్‌గా గుర్తించినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. వీరిద్దరూ కలిసి గతంలో అనేక ఉగ్ర నేరాలకు పాల్పడ్డారని వెల్లడించారు. ఎఎ++ కేటగిరీ ఉగ్రవాదైన ఇస్లాం..రెండు ఉగ్రవాద సంస్థల ఒప్పందంలో భాగంగా, ఆల్‌బదర్ బలోపేతం నిమిత్తం హిజబుల్ ముజహిద్దీన్ సంస్థ నుండి గత నవంబర్‌లో ఈ సంస్థలో చేరాడు. ఇస్లాం 2015 నుండే ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొంటున్నాడని పోలీసులు తెలిపారు. కుల్గాం జిల్లాలోని కట్‌పోరాలో ఉగ్రవాదులు సంచరిస్తున్నారన్న సమాచారంతో భద్రతా దళాలు కూంబింగ్ నిర్వహించాయని పేర్కొన్నారు. ఈ సమయంలో ఉగ్రవాదులు..భద్రతా దళాలపై కాల్పులు జరిపారని తెలిపారు. ఉగ్రవాదులు లొంగిపోవడానికి భద్రతా దళాలు అవకాశం ఇచ్చినప్పటికీ వారు కాల్పులు జరుపుతూనే ఉన్నారని చెప్పారు. దీంతో భద్రతా దళాలు ఎదురుకాల్పులు చేశాయని, ఈ ఘటనలో కరుడుగట్టిన ఈ ఉగ్రవాదులు మృతి చెందారని వెల్లడించారు. ఘటనా స్థలం నుండి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

సివిసిని తక్షణమే తొలగించాలి : కాంగ్రెస్

న్యూఢిల్లీ : సిబిఐ డైరెక్టర్ పదవి నుండి అలోక్ వర్మ తొలగింపు నేపథ్యంలో చీఫ్ విజిలెన్స్ కమిషనర్(సివిసి)ను తక్షణమే తొలగించాలని కాంగ్రెస్ కోరింది. సివిసి కె.వి.చౌదరి..ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా వ్యవహరిస్తున్నారని విమర్శించింది. న్యూఢిల్లీలోని ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ 'సివిసి(సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్) తొలగాలి లేదా రాజీనామా చేయాలి. కానీ ఖచ్చితంగా వెళ్లిపోవాలి' అని వ్యాఖ్యానించారు. రాఫెల్ కుంభకోణంపై దర్యాప్తు అనవసరమంటూ పేర్కొంటున్న సివిసి కె.వి.చౌదరి 'పప్పెట్'లావ్యవహరిస్తున్నారని విమర్శనాస్త్రాలు సంధించారు. 'సివిసి రాయబారిగా, ప్రభుత్వానికి సమాచారకర్తగా, ఆస్తానా కోసం లాబీయింగ్‌కు పాల్పడుతున్నారు. ప్రజల మంచి కోసం విజిలెన్స్ చేయాలన్న అంశాన్ని సివిసి మర్చిపోయి, రాజకీయ గురువుల చేతుల్లో కీలుబొమ్మగా మారాడు' అని సింఘ్వి దుయ్యబట్టారు. సిబిఐ వివాదానికి సంబంధించిన వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో తన పార్టీ అభిప్రాయాలను చెబుతున్నానని అన్నారు. సిబిఐలో తలెత్తిన పరిణామాలలో ఆయన పాక్షికంగా వ్యవహరించారని, ఆయనను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.

రిజర్వేషన్ల రద్దు బిజెపి ఎజెండా

జిగ్నేష్ మేవానీ



కోల్‌కతా : వ్యవస్థ నుండి కుల ఆధారిత రిజర్వేషన్లు తొలగించడమే బిజెపి-ఆరెస్సెస్‌ల ప్రధాన ఎజెండా అని గుజరాత్ స్వతంత్ర్య ఎమ్మెల్యే, దళిత నేత జిగ్నేష్ మేవానీ దుయ్యబట్టారు. అగ్రవర్ణాల పేదలకు 10 శాతం కోటా కల్పించడం వెనుక అసలు ఉద్దేశం ఇదేనని విమర్శించారు. విద్య, ఉద్యోగాల్లో అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన బిల్లు ఇటీవల ఉభయ సభల ఆమోదం పొందగా, శనివారం రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ ఆమోద ముద్ర వేసిన సంగతి తెలిసిందే. సామాజిక- విద్యారంగాల్లో షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాలు, వెనుకబడిన తరగతుల వారికి కల్పిస్తున్న రిజర్వేషన్లు తొలగించే ఉద్దేశంతోనే బిజెపి నేతృత్వంలోని కేంద్రం తీసుకున్న ముందడుగని మేవానీ ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో సామాజికంగా వెనుకబడిన వారికి ప్రాతినిధ్యం కల్పించే ఉద్దేశంతో రిజర్వేషన్ల వ్యవస్థను తీసుకువచ్చారని అన్నారు. యుపిలో బిఎస్‌పి,ఎస్‌పి పొత్తును ఆయన స్వాగతించారు.

ప్రతిపక్షాల కూటమి తాత్కాలికమే : మోడీ

చెన్నై : రానున్న ఎన్నికల దృష్ట్యా బిజెపి వ్యతిరేకంగా ఏర్పడుతున్న కూటములన్నీ తాత్కాలి కమని ప్రధాని మోడీ అన్నారు. ఆదివారం జరిగిన బూత్‌లెవల్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత లాభం కోసమే ప్రతిపక్షాలు జట్టు కడుతున్నాయని ఆయన విమర్శించారు. వారు తమకు అనుకూలమైన రాజ్యాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ప్రయ త్నిస్తుండగా, తాము దేశాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ముందుకు సాగు తున్నామని మోడీ చెప్పుకొచ్చారు. అధికారం కోసం ఇతర పార్టీల్లా తాము ప్రజలను విభజించి ఓటు బ్యాంకు రాజకీయాలు చేయమని అన్నారు. రానున్న ఎన్నికలు పార్టీకి చాలా ముఖ్యమని, ఒక పక్క అభివృద్దే ఎజెండాగా ఉండగా, మరోపక్క కూటమి కడుతున్న ప్రతిపక్షాలను ఎదుర్కొవాల్సిన అవసరం ఉందని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ' మోడీ చెడ్డవాడు, ప్రభుత్వం సరిగా పనిచేయడం లేదని అనుకుంటే అన్ని పార్టీలు కలిసిరావడం ఎందుకు, వారి మీద వారికి నమ్మకం లేదు. ప్రతిపక్షాలకు తెలుసు ఈ ప్రభుత్వం బాగా పనిచేస్తోంది' అని మోడీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. రైతులు, మహిళలు, యువకులు, అన్ని వర్గాల ప్రజలు తమ వెంట ఉన్నారన్నారు. శనివారం యుపిలో పొత్తుకు సంబంధించి చేసిన ప్రకటనకు స్పందనగా మోడీ బిజెపి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

కేజ్రీవాల్ కుమార్తెకు కిడ్నాప్ బెదిరింపు

సంఘటనపై దర్యాప్తు చేయాలని డిసిడబ్ల్యూ నోటీస్

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ కుమార్తె హర్షితను అపహరిస్తామని బెదిరింపు ఇ-మెయిల్ ఆయన కార్యాలయానికి వచ్చిందని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ ఇ మెయిల్ ఈ నెల 9న రాగా..ఢిల్లీ పోలీస్ కమిషనర్ అమూల్యా పట్నాయక్‌కు సమాచారమిచ్చారని పేర్కొన్నారు. ఈ బెదిరింపుల నిమిత్తం కేజ్రీవాల్ కుమార్తెకు ప్రత్యేక రక్షణ అధికారిని నియమించారు. ఈ ఇ మెయిల్ ఎక్కడి నుండి వచ్చిందో తెలుసుకునేందుకు సైబర్ సెల్‌కు అప్పగించినట్లు వెల్లడించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేయాలని ఢిల్లీ మహిళా పోలీస్ కమిషన్(డిసిడబ్ల్యూ).. ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసింది. నిందితుడిని పట్టుకోవడంలో విఫలమయ్యారని ఢిల్లీ పోలీసులను ఉద్దేశించి డిసిడబ్ల్యూ పేర్కొంది. ముఖ్యమంత్రి, ఆయన కుటుంబానికి పూర్తి స్థాయిలో భద్రత కల్పించాలని పోలీసులను కోరింది. ఈ సంఘటనను చాలా తీవ్రంగా పరిగణించాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి కుటుంబసభ్యులు బహిరంగంగానే బెదిరింపులను ఎదుర్కొంటున్నారని, పోలీస్ స్టేషన్ అధికారి అన్న పదం కేవలం పదవికే పరిమితం కాకూడదని, నిందితులను పట్టుకోవడంతో పాటు, ముఖ్యమంత్రి కుటుంబానికి భద్రతా ఏర్పాట్లు చేయడంలో తగిన చర్యలు తీసుకోవాలని డిసిడబ్ల్యూ నోటీసులో పేర్కొంది.

హిరానీపై లైంగిక వేధింపుల ఆరోపణలు

ముంబై : ఇటీవల బాలీవుడ్ సినిమా ఇండస్ట్రీని కుదిపేస్తున్న 'మీటు' వ్యవహారంలో హఫ్‌పోస్టు సంస్థ విడుదల చేసిన రిపోర్టు ద్వారా ఆదివారం మరో విషయం వెలుగులోకి వచ్చింది. లైంగిక వేధింపులకు సంబంధించి ప్రముఖ దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీపై ఆరోపణలు వస్తున్నాయి. గత సంవత్సరం సంజత్‌దత్ బయోపిక్ సినిమాకు సంబంధించి మార్చి నుంచి సెప్టెంబర్ వరకూ జరిగిన పోస్టు ప్రొడక్షన్ పనుల్లో ఒక మహిళ విధులు నిర్వర్తించారు. ఆ సమయంలో హిరానీ తనను లైంగికంగా వేదించాడని సినిమా సహ నిర్మాత విదు వినోద్ చోప్రాకు నవంబర్‌లో మెయిల్ ద్వారా తెలిపింది. ఈ విషయాన్ని ఇప్పుడు హఫ్‌పోస్టు వెలుగులోకి తీసుకు వచ్చింది. ఈ ఆరోపణలను ఎదుర్కొనేందుకు హిరానీ ఇప్పటికే న్యాయవాది ఆనంద్ దేశాయ్‌ని నియమించుకున్నారు. 56 ఏళ్ల రాజ్‌కుమార్ బాలీవుడ్‌లో మున్నాభాయ్, త్రి ఇడియట్స్, సంజు లాంటి అనేక విజయవంతమైన సినిమాలకు దర్శకత్వం వహిం చారు. హిరానీ అసభ్యకర ప్రవర్తనకు సంబంధించి మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని ఇటీవల ప్రచారం నడిచింది. అందుకు అను గుణంగా స్థానిక పత్రికలలో అనేక కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో త్వరలో విడుదల కానున్న కొత్త సినిమా 'ఏక్ లడకీ కో దేకాతో ఐసా లగా' పోస్టర్‌లో కూడా హిరానీ పేరును తొలగించారు.

20 మంది తమిళనాడు జాలర్లు అరెస్టు

రామేశ్వరం : తమిళనాడు రాష్ట్రానికి చెందిన 20 మంది జాలర్లను శ్రీలంక నావికా దళం అధికారులు ఆదివారం అరెస్టు చేశారు. వీరంతా శ్రీలంకకు సంబంధించిన నేదున్‌తీవు ద్వీపం సమీపంలో చేపల వేట సాగిస్తున్నారన్న కారణంతో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరిలో 11 మంది పుదుకొట్టాయి జిల్లా, మరో 9 మంది జెగతపట్టినం ప్రాంతానికి చెందిన వారు ఉన్నారు. జాలర్లకు సంబంధించిన బోట్లను స్వాధీనం చేసుకొని విచారణ అనంతరం జైలు పంపినట్లు అధికారులు తెలిపారు.

అబద్ధపు వార్తల ప్రచారంలో దిట్ట బిజెపి



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ అబద్ధపు వార్తల ప్రచారానికి బిజెపి వరదగేట్లు ఎత్తివేసింది. సైనిక పరమైన తప్పుడు వార్తలు, మత సంబంధిత విషయాలు, రామమందిరం, ప్రభుత్వ అబద్ధపు విజయాలు, మతఘర్షణల హింస, రాజకీయ నేతల పరువు తీసే వార్తలు, పాకిస్తాన్... ఇలా ఒకటేమిటి అనేక విషయాలపై బిజెపి ఐటి విభాగం అబద్ధపు వార్తలను ప్రచారం చేస్తోంది. ఐటి విభాగం ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేయటం తరువాత క్షణాల్లో అనేక సోషల్‌మీడియా వేదికలపైకి ఈ వార్తలు పాకిపోతున్నాయి. కేరళలోని వలాంచెరి పట్టణంలో ఒక రిటైర్డ్ పోస్టు మాస్టర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ మరుసటి రోజే రుతుక్రమ వయస్సులో వున్న ఇద్దరు మహిళలు శబరిమల అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించారు. ఈ రెండింటికీ ముడిపెడుతూ బిజెపి ఐటి విభాగం నిర్వాహకులు 'మహిళలు శబరిమల సంప్రదాయాన్ని ఉల్లంఘించారన్న మనస్తాపంతో వలంచెరిలో ఈ పోస్టు మాస్టర్ ఆత్మహత్య చేసుకున్నాడంటూ కట్టు కథ అల్లి ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేశారు. క్షణాల్లో ఆ వార్త సోషల్ మీడియాలో గుప్పు మంది. అసలు ఈ రెండు ఘటనలకు ఎటువంటి సంబంధమూ లేకపోవటం గమనార్హం. 'మహిళా మావోయిస్టులు శబరిమల ఆలయాన్ని అపవిత్రం చేశారు. ఈ ఘటనలకు తట్టుకోలేక గత రెండు నెలల్లో గుండెపగిలి మరణించిన వారిలో ఈయన నాలుగో వ్యక్తి' అని బిజెపి రాష్ట్ర ఐటి విభాగం ట్విట్టర్‌లో పెట్టిన వార్తకు స్పందనగా ఇటువంటిదే మా గ్రామంలో సాయిబాబా ఆలయం విషయంలో జరిగిందంటూ మరోగ్రామ పార్టీ నేతలు ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. వెలంచరి రిటైర్డ్ పోస్టు మాస్టర్ జయరామన్ మరణానికి, ఆలయంలో మహిళల ప్రవేశానికి ఎటువంటి సంబంధమూ లేదని ఈ వార్తలపై దర్యాప్తు చేసిన పోలీసులు స్పష్టం చేశారు. మహిళలు ఆలయ ప్రవేశానికి ముందు రోజే జయరామన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని అధికారులు వివరించారు. కానీ ఇప్పటి వరకూ జయరామన్ వార్త సోషల్ మీడియా వేదికపై ప్రత్యక్షమవుతూనే వుంది. దీనికి 1300 రిట్వీట్‌లు, దాదాపు వెయ్యికి పైగా లైక్‌లు కూడా లభించాయి. గత కొద్ది నెలలుగా కేరళ బిజెపి శబరిమల వివాదాన్ని ఆసరాగా చేసుకుని వార్తల్లోకెక్కే ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ అంశానికి సంబంధించి ఇదే తొలి నకిలీ వార్త కానప్పటికీ, సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన నాటి నుండి బిజెపి ఐటి విభాగం, దాని మద్దతుదారులు ఇటువంటి తప్పుడు ప్రచారంపై దృష్టి కేంద్రీకరించి నకిలీ వార్తలను ప్రచారంలోకి తెస్తూనే వున్నారు. ఈ అంశాలన్నింటినీ పరిశీలిస్తే ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో ఎవరి మరణవార్తనైనా సరే మత కోణంలో వెలుగులోకి తెచ్చే అవకాశాన్ని బిజెపి/ఆరెస్సెస్ మూకలు వదులుకోవటం లేదన్న విషయం స్పష్టమవుతోంది. ఉదాహరణకు ఈ నెల రెండున రాయ్‌బరేలీలోని రామజానకి మందిరం పేరు మార్పిడి వ్యవహారంలో అక్కడి పూజారి ఉరి వేసుకున్న ఘటనను బిజెపి-ఆరెస్సెస్ సోషల్ మీడియా నిర్వాహకులు ఈ హత్యను 'జిహాదిస్టులు' ముస్లింలు చేశారంటూ సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభించారు. కొంతమంది బిజెపి మద్దతుదారులు ఈ పూజారి ఉరి వేసుకున్న ఫోటోను షేర్ చేస్తూ ఇది 'ఐఎస్ తరహా ఉగ్రవాదం' అంటూ వ్యాఖ్యలను జోడించారు. ఈ వార్తపై కొందరు మీడియా మిత్రులు విచారణ జరిపి నిగ్గుతేలిస్తే ఆత్మహత్యకు పాల్పడిన ఆ పూజారి ఒక రేప్ కేసులో నిందితుడన్న విషయం వెల్లడయింది. 'సోనియా గాంధీ ప్రపంచంలోనే ఆరో సంపన్నురాలు' అని కేంద్ర మంత్రి మేనకాగాంధీ వ్యాఖ్యలు చేసినట్లున్న నాలుగేళ్ల నాటి ఒక వీడియోను 'ది ఇండియా ఐ', జీ న్యూస్ ఫాన్స్ క్లబ్ వంటి పేర్లతో సోషల్ మీడియాలో కాషాయ శక్తులు మరోసారి పోస్ట్ చేశాయి. వాస్తవాలను పరిశీలిస్తే ఇది నాలుగేళ్ల నాటి వీడియో అన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఈ వీడియో 2012లో బిజినెస్ ఇన్సైడర్‌లో ప్రచురితమైందని, అయితే ఎన్నికల కమిషన్ వద్ద వున్న సమాచారం ఇందుకు విరుద్ధంగా వుందని తెలుస్తోంది. అదే విధంగా 'వుయ్ సపోర్ట్ నరేంద్రమోడీ' అన్న పేరుతో వామపక్ష నేతల ప్రతిష్టను దెబ్బతీసే విధంగా కొన్ని వ్యాఖ్యలు, వీడియోలు సోషల్ మీడియాలో ప్రచారమవుతున్నాయి.

నిరుపమసేన్ అందరికీ ఆదర్శం : ఏచూరి



కోల్‌కతా : తన పోరాటాలు, సైద్ధాంతికతో ఆదర్శంగా నిలిచిన వ్యక్తి కామ్రేడ్ నిరుపమ్‌సేన్ అని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. ప్రస్తుత రోజుల్లో ఉద్యమకారులు అతని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఇటీవల తుదిశ్వాస విడిచిన సిపిఎం నేత, పార్టీ మాజీ పొలిట్‌బ్యూరో సభ్యులు నిరుపమ్‌సేన్ సంతాప సభ ఆదివారం స్థానిక పిడిజి ఆడిటోరియంలో జరిగింది. ముందుగా సేన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్య క్రమం అనంతరం ఏచూరి విలేకర్లతో మాట్లాడారు. తమ భావాలను ఎవరైనా ఎదిరిస్తే వారిని అరెస్టు చేస్తామన్న పరిస్థితులు నేడు అస్సాంలో నెలకొన్నాయన్నారు. యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ సినిమా గురించి ఆయన మాట్లాడుతూ జరిగిన విషయాల అందరికీ తెలిసిందేనన్నారు. ప్రభుత్వ శాఖలోని అన్ని విభాగాలకు తనకు అనుకూలంగా బిజెపి వాడుకుంటుదని విమర్శించారు. ప్రజల అభీష్టానికి వ్యతిరేంగా ప్రవర్తిస్తున్న మోడీ ప్రభుత్వ అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. ఆర్థిక, సామాజిక, విద్యా విధానాలకు తూట్లు పొడుస్తూ దేశ లౌకికతత్వాన్ని బిజెపి నాశనం చేస్తుంద న్నారు. దేశాన్ని హిందుత్వంతో నింపేందుకు ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఇతర దేశాలకు, ప్రధానంగా అమెరికాకు దేశాన్ని సరెండర్ చేస్తుందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో తిరిగి పుంజుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో విజయాలే ప్రజాఉద్యమాలకు ఊతమిస్తాయని ఈ సందర్భంగా ఏచూరి వెల్లడించారు.

బాలికకు విషం తాగించిన దుండగులు

న్యూఢిల్లీ : తమకు అనుకూలంగా సాక్ష్యం చెప్పటానికి ఒప్పుకోలేదన్న కారణంతో దుండగులు ఒక 17 ఏళ్ల బాలికకు బలవంతంగా విషం తాగించారు. గతంలో జరిగిన ఒక అత్యాచారం కేసుకు సంబంధించి తమకు వ్యతిరేకంగా కోర్టులో సాక్ష్యం చెప్పవద్దని బాలికను బెదిరించగా దీనికి ఆమె ఒప్పుకోకపోవడంతో ఈ దారుణానికి తెగబడినట్లు ఆదివారం పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన నైరుతి ఢిల్లీలోని ద్వారకలో జరిగింది. బాలిక ట్యూషన్ నుండి ఇంటికి వస్తుండగా నిందితులు ఆమెను అడ్డుకున్నట్లు బాధిత బాలిక శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొందని పోలీసులు వెల్లడించారు. అనంతరం బాలికను స్థానిక ఆస్పత్రిలో చేర్పించారని, ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

పెట్రోల్ బంకుల కేటాయింపుపై స్టే

జోద్‌పూర్ : రాజస్థాన్ రాష్ట్రంలో దాదాపు 10 వేల నూతన పెట్రోల్ బంకుల కేటాయింపునకు సంబంధించి ఇచ్చిన నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధించింది. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, హెచ్‌పి, ఐఒసి, బిపి కంపెనీలకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో సమాధానం చెప్పాలని సూచించింది. ఇంత పెద్ద మొత్తంలో పెట్రోల్ బంకుల స్థాపనకు సంబంధించి కేటాయింపుల్లో లొసుగులు ఉన్నాయని బీర్బల్ రామ్ అనే వ్యక్తి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రదీప్ నాంద్రజోగ్, జస్టిస్ పిఎస్ భాతితో కూడిన ద్విసభ్య ధర్మాసనం పిటిషన్‌ను విచారణకు స్వీకరించి స్టేకు ఆదేశాలు ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా రిటైల్ పెట్రోల్ బంకుల స్థాపనకు గత నెల 14న కంపెనీలు నోటిఫికేషన్‌ను ప్రకటించాయి.



ఆగ్రహించిన అన్నదాతలు

చక్కెర ఫ్యాక్టరీలపై దాడులు

ముంబయి : మహారాష్ట్రలో అన్నదాతలు ఆగ్రహ జ్వాలలు మిన్నంటాయి. చెల్లింపుల్లో జాప్యం చేస్తున్న కారణంగా ఆగ్రహించిన రైతులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు చెరకు ఫ్యాక్టరీలపై దాడులు చేశారు. కొల్హాపూర్, సాంగ్లీ, సత్రా జిల్లాల్లోని చెరకు ఫ్యాక్టరీల ఆఫీసులపై దాడి చేసి నిప్పంటించారు. సత్రాలో కరద్ వద్ద ఉన్న కృష్ణ షుగర్ పరిశ్రమ కార్యాలయానికి నిరసనకారులు నిప్పంటించారని పోలీసులు ఆదివారం తెలిపారు. దీంతో కార్యాలయంలోని ముఖ్యమైన పత్రాలు, కంప్యూటర్, ఫర్నిచర్ అగ్నికి ఆహుతయ్యాయని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. సాంగ్లీ జిల్లాలో ఒక చక్కెర పరిశ్రమకు చెందిన కార్యాలయానికి శనివారం ఉదయం నిప్పంటించగా, అందులో పనిచేస్తున్న కార్మికులు సమాచారమిచ్చారని ఇస్లాంపూర్ పోలీస్ స్టేషన్ అధికారులు తెలిపారు. ఇదే జిల్లాలోని వాల్వాలోని క్రాంతి షుగర్ ఫ్యాక్టరీ కార్యాలయంలో విధ్వంసం సృష్టించారని, నిప్పంటించడానికి ప్రయత్నించారని పేర్కొన్నారు. ఐపిసి సెక్షన్ కింద గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేశామని, అయితే ఇప్పటి వరకు ఎవరినీ అరెస్టులు చేయలేదని తెలిపారు. కొల్హాపూర్ జిల్లాలోని సిరోల్‌లోని చక్కెర ఫ్యాక్టరీ వద్దకు రైతులు చేరుకుని నిరసనలు తెలిపారు. తాము ఉత్పత్తి చేసిన పంటకు న్యాయమైన, గిట్టుబాటు ధరను కల్పించాలని ఆందోళనలు వ్యక్తం చేశారు. 65 మందిపై కేసు నమోదు చేయగా, వీరిలో 15 మందిని గుర్తించామని తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని, విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మేఘాలయ ఘటనకు నెల రోజులు పూర్తి

కానరాని 15 మంది మైనర్ల ఆచూకీ



షిల్లాంగ్ : మేఘాలయలోని బొగ్గు గనుల్లో 15 మంది మైనర్లు చిక్కుకుపోయి నెలరోజులు గడిచినా ఇప్పటి వరకు వారి ఆచూకీ కానరాలేదు. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. గత నెల 13న ఈస్ట్ జయంతియా జిల్లాలోని లుంతరీ గ్రామంలోని బొగ్గు గనులను అక్రమంగా తవ్వుతుండగా ఆ ప్రాంతానికి సమీపంలోని లైటిన్ నది నీరు సొరంగంలోకి వచ్చి చేరడంతో సుమారు 15 మంది మైనర్ బాలురు అందులో చిక్కుకున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా నడుస్తున్న క్వారీలపై నమోదైన 1200 కేసులపై విచారణ చేపట్టాలని జాతీయ పర్యావరణ ట్రిబ్యునల్(ఎన్‌జిటి) నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల కమిటీ పోలీసులను ఆదేశించింది. అయితే ఈ నెల చివరన రిటైర్డ్ జడ్జి జస్టిస్ బిపి కటకే నేతృత్వంలోని ఈ కమిటీ రాష్ట్రంలో పర్యటించనుంది. క్రింది స్థాయి పరిస్థితులు తెలుసుకునేందుకే పర్యటించనున్నారని సంబంధింత అధికారులు వెల్లడించారు. పూర్తి స్థాయి అధ్యయనం చేసిన అనంతరం నివేదికను సిద్ధంచేసి మార్చి 31 నాటికి ఎన్‌జిటి ముందు హాజరు పరుస్తామని కటకే తెలిపారు. అశాస్త్రీయ పద్ధతుల్లో, సరైన భద్రతా చర్యలు పాటించనందున 2014లో బొగ్గుమైనింగ్, రవాణాపై ఎన్‌జిటి పూర్తి నిషేధాన్ని విధించింది. అయినా అక్కడ అక్రమంగా బొగ్గు తవ్వకాలు చోటుచేసకుంటున్నాయి. ఈస్ట్ జయంతియా హిల్స్, ఈస్ట్ గారో హిల్స్, సౌత్-వెస్ట్ కాశీ హిల్స్ జిల్లాలో ఎలుక బొరియల్లాంటి రంధ్రాల ద్వారా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నట్లు నమోదైన 1200 కేసులపై చేపట్టిన దర్యాప్తు కొనసాగుతున్నదని పోలీసు అధికారులు తెలిపారు.

ప్రత్యేకం

కుమారస్వామి మనోధైర్యంపై దెబ్బకొడుతున్న మోడీ





లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి బిజెపి సన్నద్ధం

బెంగళూరు,జనవరి 12, ప్రజాశక్తి ప్రతినిధి : కర్ణాటకలో సంకీర్ణ ప్రభుత్వం నాయకుడిపై కువిమర్శలతో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ తన ప్రాభవాన్ని చూపుకునేందుకు బిజెపి ఢిల్లీలో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశాలను వేదికగా చేసుకుంది. గత విధానసభ ఎన్నికల్లో ప్రధాని మోడీ సిద్దరామయ్య సర్కారును లంచాల ప్రభుత్వంగా ఆరోపిస్తూ జోరుగా ప్రచారం చేశారు. కేంద్ర సర్కారు ఇస్తున్న భారీ సాయాన్ని కర్ణాటక ప్రభుత్వ నేతలు ఖర్చుచేయకుండా జేబుల్లో వేసుకుంటున్నారని ఆరోపించారు. ఐదు సంవత్సరాల పరిపాలనలో అవినీతికి ఏమాత్రం ఆస్కారం లేకుండా నాడు సిద్దరామయ్య పరిపాలించగా కేంద్రం నిధులు మళ్లించారని మోడీ ఆరోపణలు చేశారు. ఇపుడు ముఖ్యమంత్రి కుమారస్వామి ప్రకటించిన రైతు రుణమాఫీ పూర్తిగా విఫలం అయ్యిందని పిఎం ఆరోపించారు. సంకీర్ణ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కుమారస్వామి ఒక క్లర్కులాగా పనిచేస్తున్నారని, ఆయన స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే వీల్లేని కీలుబొమ్మ సర్కారుగా మారిపోయారని మోడీ చేసిన విమర్శలు కర్ణాటక సర్కారును ఇరకాటంలో పెట్టాయి. కర్ణాటక సంకీర్ణ సర్కారు ఏర్పాటు వలన ఉత్తరాదిలో బలోపేతం అయేందుకు తద్వారా అన్ని ప్రతిపక్ష పార్టీలను ఏకం చేసేందుకు రెండు పార్టీల పొత్తు కారణమైందని గ్రహించిన కమలనాథులు కర్ణాటక నుంచే సంకీర్ణ సర్కారు ప్రయోగానికి చెదలు పట్టించేందుకు సమయం కోసం కాచుకుకూర్చున్నారు. కర్ణాటక సర్కారు జారీచేస్తున్న రైతురుణాల మాఫీ పథకం ఆసరాగా ఇటీవల జరిగిన అయిదురాష్ట్రాల ఎన్నికల్లోను కాంగ్రెస్ విజయఢంకా మోగించటం గురించి బిజెపి జాతీయ సమావేశాలు చర్చించాయి. కుమారస్వామి 49 వేలకోట్ల రూపాయల రుణాల మాఫీకి కార్యక్రమం చేపట్టడం బిజెపి కన్నెర్రకు కారణమైంది. ఇది పరోక్షంగా జాతీయస్థాయిలో రైతు పంట రుణాల మాఫీ డిమాండ్‌గా మారటంతో ప్రధాని మోడీ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రైతు రుణాల మాఫీకి కసరత్తు చేసేలా పురమాయించాయి. ఈ కారణంతో కర్ణాటక సర్కారు ప్రతిష్టను దెబ్బతీసేలా ఢిల్లీ వేదికగా ప్రధాని మోడీ, భాజపా నాయకులు కర్ణాటక పంటరుణాల మాఫీ ఒట్టి బూటకం అంటూ దుష్ప్రచారం సాగించారు. ఇదే అంశంపై ఢిల్లీలో పలువురు బిజెపి నాయకులు కూడా కుమారస్వామి పరిపాలనపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కర్ణాటక సర్కారు చేపట్టిన పంటరుణాల మాఫీ పథకం విఫలం అయ్యిందంటూ పదేపదే గోబెల్స్ ప్రచారం చేయటం ద్వారా విపక్షాల్లో సందేహాలు రేకెత్తించటం ధ్యేయంగా బిజెపి ఎత్తులు వేస్తున్నది. కర్ణాటకలో జెడిఎస్ పార్టీని ఒంటరి చేయటం ద్వారా జాతీయ స్థాయిలో విపక్షాలు ఏకం కాకుండా చూడటమే వీరి ఉద్దేశంగా కనిపిస్తోంది. కర్ణాటకలో గత లోక్‌సభ ఎన్నికల్లో 19 సీట్లను గెలుచుకున్న బిజెపి ఆ తరువాత ఉప ఎన్నికల్లో రెండు సీట్లను కోల్పోయి 17 సీట్లకు తగ్గింది. వీటిని మళ్లీ కైవసం చేసుకునేందుకు వీలుగా కుమారస్వామి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయటం, కాంగ్రెస్‌ను చిక్కుల్లో పడేయటం వ్యూహంగా బిజెపి తన 104 మంది శాసనసభ్యులతో ఢిల్లీలో సమావేశం అయ్యింది. జాతీయ బ్యాంకుల్లోని రైతు రుణాల్లో సగభాగాన్ని కేంద్ర ప్రభుత్వం భరించాలన్న డిమాండ్‌ను పక్కదారి పట్టించేందుకుగాను కుమారస్వామి సర్కారు రుణమాఫీ అమల్లో విఫలమైందని, కర్ణాటక అధికారులు ఇప్పుడు కూడా రైతులకు పంట రుణాల బకాయిల వసూళ్ల కోసం నోటీసులు ఇస్తున్నారంటూ అసత్యారోపణలు చేసింది. దక్షిణాదిలో చోటు కోల్పోయిన బిజెపి మళ్లీ కర్ణాటక నుంచే చిగురించాలన్న దురాశతో ఇక్కడి సంకీర్ణ ప్రభుత్వంపై దాడి చేస్తున్నది. కర్ణాటక ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఎనిమిది నెలలైనా కూడా ఇంతవరకు కేవలం వందలమందికి మాత్రమే రుణమాఫీ చేసిందని ఆరోపిస్తున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కుమారస్వామిని రైతు వ్యతిరేకిగా చిత్రించి పంట రుణమాఫీ వైఫల్యాలను పెద్ద ఎత్తున ప్రచారం చేసేందుకు ప్రధాని మోడీ సాక్షిగా కమలనాథులు రణరంగానికి సిద్ధపడ్డారు.

గాడిలో చమురు మార్కెట్


సౌదీ ఇంధన మంత్రి

అబూదాబీ : చమురు ఎగుమతి దేశాల సంస్థ (ఒపెక్) చమురు ఎగుమతుల్లో కోత పెట్టటంతో ఇటీవల చమురు మార్కెట్ తిరిగి గాడిలో పడిందని సౌదీ ఇంధన శాఖ మంత్రి ఖలీద్ అల్ ఫలీ వ్యాఖ్యానించారు. 2018 చివరిలో గాడి తప్పిన చమురు మార్కెట్ ఇప్పుడు తిరిగి సమతుల్యతను చేరుకుని గాడిన పడిందని ఆదివారం అబూదాబీలో జరిగిన చమురు సదస్సులో వ్యాఖ్యానించారు. చమురు మార్కెట్‌లో సమతుల్యతను కొనసాగించేందుకు తాము ఒపెక్ సభ్యదేశాలతో కలిసి పనిచేస్తామని, ఈ లక్ష్యాన్ని సాధించటానికి అవసరమైతే మరింత ఎక్కువ కృషి చేస్తామని ఆయన చెప్పారు. తమ దేశం నవంబర్ నాటితో పోలిస్తే జనవరిలో పది శాతం మేర చమురు ఎగుమతులు తగ్గించిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం 1.02 కోట్ల డాలర్ల బ్యారెళ్ల చమురును ఉత్పత్తిచేస్తున్న తమ దేశం ఈ నెల చివరి నాటికి ఉత్పత్తిని 72 లక్షల బ్యారెళ్ల స్థాయికి తగ్గించాలన్న లక్ష్యాన్ని చేరుకుంటుందని భావిస్తున్నామన్నారు.



మ్యానిఫెస్టో
మేనెలలో జరగనున్న ఎన్నికలకు తమ పార్టీ ఎఎన్‌సి ఎన్నికల ప్రణాళికను విడుదల చేస్తున్న దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రాంఫోసా

ప్రపంచ బ్యాంకు అధ్యక్ష పదవి రేసులో ఇవాంకా ట్రంప్



వాషింగ్టన్ : ప్రపంచ బ్యాంకు అధ్యక్ష పదవికి అమెరికా అధ్యక్షుడు కుమార్తె ఇవాంకా ట్రంప్, యునైటెడ్ మాజీ రాయభారి నిక్కీ హేలీ పోటీలో నిలవనున్నారు. ఇప్పటి వరకూ అధ్యక్షుడిగా ఉన్న జిమ్ యాంగ్ కిమ్ ఇంకా 3 సంవత్సరాల పదవీ కాలం మిగిలి ఉండగానే గత సోమ వారం తన పదవికి అకస్మాత్తుగా రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో వచ్చే నెల మొదటి వారంలో నామినేషన్లు స్వీకరించనున్నట్లు సమాచారం. ఇవాంకా, హేలీలతో పాటు పలువురు పేర్లు అధ్యక్ష పదవి రేసులో వినిపిస్తున్నాయి. అంతర్జాతీయ సంబంధాల ట్రెజరీ కార్యదర్శి మాల్‌పాస్, అంతర్జాతీయ అభివృద్ధికి సంబంధించిన యుఎస్ ఎజెన్సీ అధ్యక్షుడు మార్క్ గ్రీన్ వీరిలో ఉన్నారు. మహిళా సాధికారతకు సంబంధించి 2017లో సౌదీ మద్దతుతో 1 బిలియన్ డాలర్లను సాధించడంలో ఇవాంకా ప్రముఖ పాత్ర పోషించారు. అధ్యక్ష పదవికి అనేక సిఫా ర్సులు వస్తున్నట్లు వరల్డ్ బ్యాంకు ప్రతినిధి ఒకరు ఈ సందర్భంగా తెలిపారు. దీనికి సంబం ధించి అంతర్గత సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. గవర్నర్‌లందరి అభిప్రాయాలతో ముందుకు సాగుతామన్నారు. ప్రపంచ బ్యాంకులో అమెరికా అత్యధిక వాటా కలిగి ఉంది. రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం ప్రతిసారి అమెరికా సూచనలకు అనుగుణంగా అధ్యక్షుడిని నియమిస్తూ వస్తున్నారు. అయితే అమెరికా ప్రతినిధి ఎవరూ కూడా ఈ పదవిని పూర్తికాలం నిర్వర్తించలేదు. అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి మొట్టమొటిసారిగా 2012లో కిమ్ పోటీని ఎదుర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఎన్నికలను పూర్తి పారదర్శకంగా నిర్వహించి ఏప్రిల్ మధ్య నియామకం చేపడతామని బ్యాంకు బోర్డు తెలిపింది.



సిరియాలో రోజూ బాంబు దాడులు

ఇజ్రాయిల్ ఐడిఎఫ్ చీఫ్

న్యూయార్క్: సిరియాలో గత కొన్నేళ్లుగా తాము ప్రతిరోజూ బాంబు దాడులు చేస్తున్నామని త్వరలో పదవీ విరమణ చేయనున్న ఇజ్రాయిల్ రక్షణ దళాల అధిపతి గాడి ఈసెన్‌కోట్ చెప్పారు. సిరియాలో సైనిక మద్దతును నిర్వీర్యం చేసేందుకు తాము గత కొన్నేళ్లుగా రోజూ ఈ బాంబు దాడులు నిర్వహిస్తున్నామని ఆయన అంగీకరించారు. గత ఏడాదిలో తాము 'ఇరాన్ లింక్‌డ్ టార్గెట్'లుగా అనుమానిస్తున్న లక్ష్యాలపై దాదాపు 2,000కు పైగా బాబులు ప్రయోగించామని ఆయన చెప్పారు. దాదాపుగా ప్రతిరోజూ ఈ దాడులను నిర్వహించామని, ఇందుకు తాము బాధ్యత వహిస్తున్నట్లు కానీ, ఇది తమ ఘనతగా గానీ ఎన్నడూ ప్రకటించుకోలేదని చెప్పారు. ఇజ్రాయిల్ తమ గగనతలాన్ని పలుమార్లు ఉల్లంఘిస్తూ ఉగ్రవాదులకుసాయం చేస్తోందని సిరియా ప్రభుత్వం ఆరోపించినప్పటికీ నెతన్యాహు సర్కారు వాటిని తోసిపుచ్చుతూ వచ్చిన విషయం తెలిసిందే. కాగా ఇప్పుడు ఈసెన్ కోట్ మాత్రం ఇజ్రాయిల్ దాడులను గట్టిగా సమర్థిస్తూ దీనిపై ఇరాన్ కానీ, సిరియా కానీ తమను ఏమీ చేయలేవని స్పష్టం చేశారు. తమకు ఈ ప్రాంతంపై పూర్తి ఇంటెలిజెన్స్ ఆధిపత్యంతో పాటు గగనతల ఆధిపత్యం కూడా వుందని, తాము కృతనిశ్చయంతో, గట్టిగా సమర్థించుకునే రీతిలోనే ఈ దాడులను చేశామని ఆయన అన్నారు.

గ్రీకు రక్షణ మంత్రి రాజీనామా

విశ్వాస ఓటు కోరతానన్న సిప్రాస్



రాజీనామా చేసి బయటికి వస్తున్న గ్రీకు రక్షణమంత్రి పనోస్ కమెనోస్

ఏథెన్స్ : మాసిడోనియా పేరు మార్పిడి వివాదంలో ప్రభుత్వ వైఖరితో తీవ్రంగా విభేదించిన గ్రీక్ రక్షణ మంత్రి పనోస్ కమెనోస్ ఆదివారం తన పదవికి రాజీనామా చేశారు. కమెనోస్ రాజీనామా అనంతరం ప్రధాని సిప్రాస్ మాట్లాడుతూ వచ్చేవారం ఈ ప్రభుత్వంపై పార్లమెంట్‌లో విశ్వాస ఓటు కోరతానని చెప్పారు. ప్రధాని అలెక్సిస్ సిప్రాస్ నేతృత్వంలోని ప్రభుత్వానికి మద్దతునిస్తున్న గ్రీక్స్ పార్టీకి సారథ్యం వహిస్తున్న కమెనోస్ మాసిడోనియా పేరు మార్పిడి ఒప్పందాన్ని మొదటి నుండి వ్యతిరేకిస్తూనే వున్నారు. ఆదివారం ఉదయం ప్రధాని సిప్రాస్‌తో భేటీ అయిన కమెనోస్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ మాసిడోనియా పేరు మార్పిడి వ్యవహారం తనను మంత్రిపదవిలో నిలవనివ్వటం లేదన్నారు. తమ పార్టీకి చెందిన మరో ఆరుగురు మంత్రులను కూడా ప్రభుత్వం నుండి ఉపసంహరించుకుంటామని ఆయన చెప్పారు. రక్షణ మంత్రి రాజీనామా ప్రభావం సిప్రాస్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం ఎటువంటి ప్రభావం చూపుతుందన్న అంశంపై స్పష్టత రాలేదు. రానున్న అక్టోబర్‌లో గ్రీస్ పార్లమెంట్‌కు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో సంకీర్ణ కూటమిలో విబేదాలు రచ్చకెక్కటం గమనార్హం. 300 మంది సభ్యు లున్న పార్లమెంట్‌లో సిప్రాస్ సంకీర్ణ కూటమికి 153 స్థానాల బలం వుంది. అందులో 145 మంది సిప్రాస్ నేతృత్వంలోని సిరిజా పార్టీకి చెందిన వారేనన్న విషయం తెలిసిందే. సిప్రాస్‌తో సంకీర్ణ కూటమిపై 2015లో ఒప్పందం కుదుర్చుకున్న కమెనోస్ మాసిడోనియా పేరు మార్పిడి వ్యవహారంలో తన వ్యతిరేకతను ఎన్నడూ దాచుకోలేదు. ఐరోపా కూటమి, నాటోతో సంబంధాలు కొనసాగించుకోవాలన్న మాసిడోనియా ఆకాంక్షకు ఈ పేరుమార్పిడి వివాదం గండికొట్టింది. ఈ ఒప్పందం ద్వారా సిప్రాస్ ప్రభుత్వం జాతిని అమ్మకానికి పెట్టిందని ఆరోపించిన కమెనోస్, ఈ ఒప్పందం పార్లమెంట్ ఆమోదానికి వస్తే తాము ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించుకుంటామని హెచ్చరించారు.

శాంతి చర్చలకు సాయం చెయ్యండి...!

ఐరాసకు మదురో వినతి

కారకాస్: దేశంలో ప్రతిపక్షంతో జరిపే శాంతి చర్చలలో తమకు సాయం చేయాలని వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో ఐక్యరాజ్యసమితికి విజ్ఞప్తి చేశారు. శనివారం కారకాస్‌లోని ప్రభుత్వ ప్రధాన కార్యా లయం మిరాఫ్లోర్స్ ప్యాలెస్‌లోజరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెనిజులా శాంతి, న్యాయం రెండూ దేశానికి మూలస్థంభాల్లాంటి వ్యవస్థలని, ఈ వ్యవస్థలు స్థిరంగా వుంటేనే దేశం నిలకడైన వృద్ధి సాధించగలదని అన్నారు. 'దేశంలో శాంతి, పరస్పర గౌరవం, సామరస్యత, సహజీవనం, విభిన్న రాజకీయ వర్గాల సహజీవనం వంటి అంశాలపై జరిపే చర్చల్లో ఐరాస మనకు సాయం చేయాల్సిన అవసరం వుంద'ని ఆయన అన్నారు. 2030 నాటికి దేశాన్ని స్థిరమైన అభివృద్ధి దశలో నడిపించేందుకు అనువైన సామాజిక కార్యక్రమాల రూపకల్పనపై చర్చించేం దుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ భేటీలో దేశాభి వృద్ధికి 2019 జాతీయ బడ్జెట్‌తో సహా 17 లక్ష్యాలను నిర్దేశించారు. ఈ సమావేశంలో ఆమోదం పొందిన ప్రణాళిక ప్లాన్ డిలా పాట్రియా 2019-2025ను మదురో సోమ వారం నాడు జాతీయ రాజ్యాంగ అసెంబ్లీకి సమర్పించ నున్నారు. దేశంలో అనవసర ఘర్షణలొద్దని, ఆర్థిక సమస్యలపై చర్చిద్దామని ఆయన ప్రతిపక్షానికి సూచిం చారు. అవసరమైతే తాను ప్రతిపక్షంలో కూర్చోటానికి కూడా సిద్ధంగా వున్నానన్నారు. ప్రతిపక్షంతో జరిపే శాంతి చర్చలతో పాటు అమెరికా విధించిన ఆర్థిక దిగ్బంధానికి తెరదించేందుకు కూడా ఐరాస తమకు సాయం చేయాలని ఆయన కోరారు. గత దశాబ్దికాలంలో ఐరాస సహకారంతో విద్య, ఉద్యోగిత, గృహనిర్మాణం, పెన్షన్ల రంగం వంటి వాటిలో సాధించిన ప్రగతిని ఆయన సమీక్షించారు. ఐరాస అన్ని వ్యవస్థలకూ దేశంలో తలుపులు తెరిచే వున్నాయన్న మదురో ఐరాస మానవ హక్కుల కమిషనర్ మిచెల్లీ బాచ్లెట్‌ను తమ దేశంలో పర్యటించాలని ఆహ్వానించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వెనిజులాలో ఐరాస రెసిడెంట్ కో-ఆర్డినేటర్ పీటర్ గ్రహ్మాన్ మాట్లాడుతూ 2030 అజెండా సాధనలో వెనిజులా ప్రభుత్వానికి తమ పూర్తి మద్దతు వుంటుందని ప్రకటించారు.

చైనా గనిలో ప్రమాదం

21 మంది కార్మికులు మృతి

చైనా : బొగ్గు గని పైకప్పు కూలి 21 మంది కార్మికులు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన షాంక్సి ప్రావిన్స్‌లోని షెన్ము నగరం సమీపంలో ఉండే లిజియా గనిలో శని వారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఆదివారం ఇద్దరి మృతదేహాలను శిథిలాల నుంచి వెలికితీసినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఆ సమయంలో అక్కడ 87 మంది కార్మికులు పనిచేస్తుండగా, 66 మంది సురక్షితంగా బయటపడినట్లు అధికా రులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేస్తున్నామన్నారు. భద్రతా లేమి కారణాలతో చైనాలో ఇటీవల ఇటువంటి ప్రమాదాలు ఎక్కువగా జరుగు తున్నాయి. ఇష్టానుసారం అక్రమంగా గనులు తవ్వడం కూడా ఇందుకు కారణంగా కనిపిస్తోంది. చైనా నైరుతి ప్రాంతంలోని ఒక బొగ్గు గనిలో గత డిసెంబర్‌లో జరిగిన ప్రమాదంలో ఏడుగురు మైనర్లు చనిపోగా, ముగ్గురు గాయపడ్డారు. అక్టోబర్‌లో తూర్పు ప్రావిన్స్‌లో జరిగిన మరో ఘటనలో గనిలో పీడనం ఎక్కువ కావడంతో 21 మంది కార్మికులు చనిపోయారు. ఆ దేశపు బొగ్గు గనుల శాఖ గణంకాల ప్రకారం 2017లో ఇటువంటి ఘటనల్లోనే దాదాపు 375 మంది మృతిచెందారు.

ఆసియాబీబీ కేసు బాధితులకు నష్టపరిహారం

చెల్లింపునకు నెలగడువిచ్చిన పాక్ సుప్రీం

లాహోర్ : దైవదూషణ కేసులో క్రైస్తవ మహిళ ఆసియా బీబీ విడుదల అనంతరం తీవ్రవాద ఇస్లామిస్ట్ పార్టీల హింసాత్మక నిరసనల బాధితులకు నెల రోజుల్లోగా నష్ట పరిహారం చెల్లించాలని పాక్ సుప్రీంకోర్టు ఫెడరల్, ప్రావిన్షియల్ ప్రభుత్వాలను ఆదేశించింది. గత ఎనిమిదేళ్లుగా దైవదూషణకు పాల్పడిన ఆరోపణలపై ఈ మహిళకు లాహోర్ హైకోర్టు మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే. అయితే పాక్ సుప్రీంకోర్టు గత అక్టోబర్‌లో ఈ తీర్పును రద్దు చేయటంతో పాక్ దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు, ఆ మహిళను హత్య చేస్తామన్న బెదిరింపులు వెల్లువెత్తాయి. అయితే మానవ హక్కుల గ్రూపులు మాత్రం ఈ తీర్పుపై హర్షం వ్యక్తం చేశాయి. ఈ నిరసనలు హింసాత్మకంగా మారి తీవ్ర విధ్వంసానికి దారి తీయటంతో ఈ కేసును సుమోటోగా విచారించిన పాకిస్తాన్ ప్రధాన న్యాయమూర్తి సాకిబ్ నిస్సార్ నేతృత్వంలోని ఇద్దరు సభ్యుల ధర్మాసనం బాధితులకు నెల రోజుల్లోగా పూర్తి పరిహారం చెల్లించాలని ఫెడరల్, ప్రావిన్షియల్ ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ నిరసనల్లో భారీయెత్తున ఆస్తినష్టం జరిగిందంటూ పంజాబ్ ప్రావిన్షియల్ ప్రభుత్వం అధికారికంగా అందచేసిన నివేదికపై స్పందించిన సుప్రీంకోర్టు బాధితులకు ఏ విధంగా పరిహారం చెల్లిస్తారో కోర్టుకు వివరించాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన అడ్వకేట్ జనరల్ ఫెడరల్ ప్రభుత్వం మొత్తం రు.26.2 కోట్ల పరిహారం చెల్లింపు ప్రతిపాదనను ఆమోదించిందని కోర్టుకు తెలియచేశారు. పరిహారం చెల్లింపు ప్రతిపాదనలకు సంబంధించిన ప్రణాళికలను తమకు అందచేయాలని ధర్మాసనంలో మరో సభ్యుడైన న్యాయమూర్తి ఇజాజుల్ అహసన్ సూచించారు.

మొదటి పేజీ తరువాయి

'టోల్' వివాదం

ప్రభుతం ప్రకటించినప్పటికీ తమకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఎఐ) నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని చెబుతూ టోల్ ఫీజును నిర్బంధంగా వసూలు చేశారు. విజయవాడ - హైదరాబాద్ మార్గంలో ఉన్న కీసర టోల్ గేటు వద్ద ఆదివారం ఉదయం ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు ఆగిపోయాయి. ఆదివారం ఒక్క రోజులోనే కీసర టోల్ గేటు మీదగా దాదాపు 15వేల వాహనాలు ప్రయాణించాయి. విజయవాడ-చెన్నై రహదారిపై గుంటూరు జిల్లాలోని కాజ, విజయవాడ-హైదరాబాద్ రహదారిపై ఉన్న కృష్ణా జిల్లా చిల్లకల్లు టోల్ గేట్ల వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. వాహనాలు అధిక సంఖ్యలో బారులు తీరడంతో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. ఒక్కో టోల్ గేటు దాటేందుకు కనీసం రెండు గంటలు సమయం పట్టింది. వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి. టోల్ గేట్ల వద్ద వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. టోల్ గేట్ల వద్ద వాహనాలు బారులు తీరకుండా చూడాలని డిజిపి ఆర్‌పి ఠాకూర్ జిల్లా ఎస్పీలను ఆదేశించారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని టోల్ గేట్ల వద్ద వాహనాలు వేగంగా కదిలేలా చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలోని అన్ని టోల్ గేట్ల వద్ద ప్రశాంత వాతారణం నెలకొందని, ఫీజు వసూలు చేయకుండానే వాహనాలను పంపుతున్నామని డిజిపి ఆర్‌పి ఠాకూర్ మీడియాకు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను పక్కనపెట్టి ఫీజును వసూలు చేసిన టోల్ గేటు నిర్వాహకులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

ఎపి ఎన్జీఒల నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా

చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసరావు

హెల్త్ కార్డులపై పూర్తి స్థాయి వైద్య సేవలు అందించేలా కార్పొరేట్ హాస్పటల్ యాజమాన్యాలకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంతోపాటు ఎపిఎన్జీఒ అసోసియేషన్ ప్రతిష్టను మరింత ఇనుమడింపచేసేలా అందరిని కలుపుకుని ముందుకు సాగుతామని చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అశోక్‌బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.రామకృష్ణారెడ్డి, ఆర్.రవిశంకర్, వై.ప్రసాద్, పి.శ్రీనివాస్, పి.సుబ్బారెడ్డి, డి.వి రమణ, జి.గంగిరెడ్డి, సి.హెచ్ అజయ్‌కుమార్, నరసింహం, కె.జగదీష్, బాపూజీ, కృపావరం, తులసిరత్నం, అన్ని జిల్లాల అధ్యక్షకార్యదర్శులు, ఇతరులు పాల్గొన్నారు.

హైకోర్టులలో మహిళలకు తగిన ప్రాతినిధ్యమేది?

- **670 మంది జడ్జిల్లో వారున్నది 73 మందే..!**
- **కేంద్ర గణాంకాల్లో వెల్లడి**

న్యూఢిల్లీ: దేశంలోని వివిధ హైకోర్టుల్లో న్యాయమూర్తులుగా మహిళలకు తగిన ప్రాతినిధ్యం దక్కడంలేదు. ఆయా హైకోర్టులలో వారి సంఖ్య ప్రస్తుతం చాలా తక్కువగా ఉన్నది. కేవలం 11శాతం మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. ఈ విషయం పార్లమెంటరీ కమిటీకి కేంద్ర న్యాయమంత్రిత్వశాఖ అందించిన సమాచారంలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా మొత్తం 24హైకోర్టులు ఉన్నాయి. వీటికి 1079 జడ్జి పోస్టులు మంజూరు కాగా కేవలం 670 మంది మాత్రమే ప్రస్తుతం విధుల్లో ఉన్నారు. అంటే 409 పోస్టులు ఖాళీగానే ఉండిపోయాయి. ఇక గతేడాది మార్చి 23 నాటికి ఈ 670 మందిలో మహిళా న్యాయమూర్తులు మాత్రం 73 మంది మాత్రమే ఉన్నారు. న్యాయమూర్తులుగా మహిళలు, అట్టడుగు వర్గాల ప్రజల ప్రాతినిధ్యంపై పార్లమెంటరీ ప్యానెల్ ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన కేంద్రం.. జడ్జిల నియామకాలపై ప్రతిపాదనలు పంపే క్రమంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ, మహిళలలో తగినవారికి స్థానం ఇవ్వాలని దేశంలోని హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను కోరినట్టు న్యాయమంత్రిత్వశాఖ తెలిపింది. సమాజంలోని వివిధ వర్గాలకు ఉన్నత న్యాయస్థానాల్లో సముచిత స్థానం కల్పించడానికి ఇది దోహదం చేస్తుందని కమిటీకి వివరించింది. ఉన్నత న్యాయస్థానాల్లో రిజర్వేషన్‌ను అనుమతించడానికి వీలు కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 124, 217లను సవరించే ప్రతిపాదన లేదని స్పష్టం చేసింది.

కత్తి ఎక్కడ పెట్టుకున్నావు? ఎలా తీశావు?

(మొదటి పేజీ తరువాయి)

నిందితుడు కత్తి బయటకు ఎలా తీయగలిగాడు, ఎలా దాడి చేశాడన్న అంశాలపై వీరు దృష్టికేంద్రీకరించినట్లు సమాచారం. దీనిలో భాగంగా జగన్‌తో కలిసి నిందితుడు సెల్ఫీ దిగిన తీరుపై కూడా అనేక ప్రశ్నలు వేసినట్లు తెలిసింది. 'సెల్‌ఫోన్‌ను విఐపి పట్టుకున్నారా? నీవు పట్టుకున్నావా? .. ఎంత సమయం ఆయన పక్కన నిలబడ్డావు? వంటి ప్రశ్నలను అడిగినట్లు సమాచారం. విచారణ ప్రక్రియ ముగిసిన తరువాత శ్రీనివాస్‌రావును హైదరాబాద్‌కు తీసుకువెళ్లారు. అక్కడి నుండి ఢిల్లీ, ముంబాయి, కోల్‌కత్తాలో ఏదో ఒక ప్రాంతానికి తరలించే అవకాశం ఉందని సమాచారం. నిందితుడిని ఎక్కడుంచి విచారణ ప్రక్రియను కొనసాగిస్తారన్న అంశాన్ని ఎన్‌ఐఎ అధికారులు చెప్పడం లేదు.

అంతా రహస్యం..

విచారణ ప్రక్రియను ఎన్‌ఐఎ అధికారులు రహస్యంగా కొనసాగిస్తున్నారు. శనివారం రాత్రి శ్రీనివాస్‌ను హైదరాబాద్ తరలిస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. కానీ, విశాఖకు తరలించారు. అర్ధరాత్రి దాటిన తరువాత విశాఖ బక్కన్నపాలెంలోని ఎపిఎస్పీ 16వ బెటాలియన్‌కు తీసుకెళ్లారు. అక్కడ నిందితునికి సంబంధించిన న్యాయవాది సమక్షంలోనే శ్రీనివాసరావును ప్రశ్నించారు. ఆ తరువాత ఆ ప్రాంతం విచారణకు అనుకూలంగా లేదని చెప్పారు. అక్కడి నుండి విశాఖ విమానాశ్రయంకు తీసుకువచ్చారు. సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం హైదరాబాద్‌కు తీసుకువెళ్లినట్లు చెబుతున్నారు.

దోషుల జాబితాలో వారు కూడా...

మరికొందరిని కూడా ఈ కేసులో దోషులుగా చేర్చడానికి ఎన్‌ఐఎ అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. విమానాశ్రయంలోని హోటల్‌లో పనిచేసే అవకాశం కల్పించుటలో సహకరించిన పోలీసులను, పాస్ లేకున్నా విమానాశ్రయంలో యథేచ్ఛగా తిరిగేందుకు అనుమతించిన విమానాశ్రయ భద్రతా అధికారులను, మూడు నెలల పాటు సిసి కెమెరాలు పనిచేయకుండా కీలక ప్రదేశాన్ని పట్టించుకోకుండా ఉన్న అధికారులు ఈ జాబితాలో ఉన్నట్లు సమాచారం. వీరందరికి త్వరలో నోటీసులు జారీ కానున్నాయని తెలిసింది.

ఆచూకీ తెలియలేదు...

శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు తన క్లయింటు ఆచూకీ తనకు ఎన్‌ఐఎ అధికారులు తెలియనివ్వలేదని శ్రీనివాస్ తరపు న్యాయవాది సలీమ్ మీడియాకు చెప్పారు. కోర్టు ఆదేశాల మేరకు న్యాయవాది సమక్షంలోనే విచారణ జరగాల్సిఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆదివారం తాను శ్రీనివాసరావుతో మాట్లాడానని తను బాగానే ఉన్నానని, అమ్మ, అన్నయ్య, ఎలా ఉన్నారు? అని అడిగాడని చెప్పారు. తను విశాఖ సెంట్రల్ జైల్లో ఉన్నపుడు రాసుకున్న 'మార్పు కోసం' అనే పుస్తకం జైలు వార్డెన్ దగ్గర ఉందని దానిని అతను లాక్కున్నారని, ఆ పుస్తకాన్ని ఎలాగైనా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరినట్లు న్యాయవాది చెప్పారు. ఆ పుస్తక ప్రచురణకు ఇప్పటికే పిటిషన్ వేశామని, అది నెరవేరకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని న్యాయవాది తెలిపారు.

ఈ ఎన్నికలు తొలి అడుగు

(మొదటి పేజీ తరువాయి)

తొలిసారిగా వచ్చానని, పట్టణంలోంచి ప్రవహిస్తున్న మూడు కాల్వలు జల రవాణాకు అనువుగా ఉన్నాయని అన్నారు. పాలకులు దీనిపై దృష్టి సారించకపోవటం బాధాకరమన్నారు. రాజధానికి అతి సమీపంలో ఉన్న తెనాలి భవిష్యత్‌లో శాటిలైట్ సిటీ కాబోతోందన్నారు. పార్టీ మేనిఫెస్టోలో బకింగ్‌హామ్ కెనాల్ అభివృద్ధిని పొందుపరుస్తామని, జలరవాణాకు పెద్దపీట వేస్తామని పవన్ చెప్పారు.

ఫిబ్రవరిలో రైతు సదస్సులు

ఆరుగాలం శ్రమించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, పంటకు గిట్టుబాటు ధరల్లేక విలవిల్లాడుతున్నారని పవన్ ఆవేదన వెలిబుచ్చారు. రైతు సంక్షేమాన్ని కోరి ఫిబ్రవరిలో రైతులతో సదస్సులు నిర్వహించి, వారి సమస్యలకు పరిష్కార దిశగా అడుగులు వేస్తామని ప్రకటించారు. సభలో నాదెండ్ల మనోహర్ ప్రసంగించారు. తోట చంద్రశేఖర్, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, మాదాసు గంగాధర్, పి.బాలరాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

కళతప్పిన సంక్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

బయటపడగా తతిమ్మా ఆరు జిల్లాల్లో నేటికీ మార్పు లేదు. వర్షాల్లేక సాగు స్తంభించగా తొలకరి వానలకు సాగు చేసిన పంటలు పశుగ్రాసానికి కూడా పనికిరానంతగా ఎండిపోయాయి. అనంతపురం వంటి చోట్ల వేరుశనగను కోయకుండానే పొలంలో దున్నేసిన హృదయ విదారక దృశ్యాలు దర్శనమిచ్చాయి.

మెట్ట ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిన దరిమిలా వరి సాగు లేదు. నీటి ఎద్దడితో పత్తి దిగుబడులు సగానికి పడిపోయాయి. పత్తి, మిర్చి, అపరాలకు తెగుళ్లొచ్చి పంటలను సమూలంగా కబళిం చాయి. సర్కారు ఇప్పటి వరకు ప్రకాశం, అనంతపురం, కడపలో అన్ని మండలాల్లో కరువు ప్రకటించింది. నెల్లూరు, కర్నూలు, చిత్తూరు, గుంటూరు, విజయనగరం అన్నీ కలుపుకొని 328 కరువు మండలాలను గుర్తించింది. ఇంకా కరువును ప్రకటించాలన్న ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 12 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.2 వేల కోట్లు కావాలంటోంది. వాస్తవ నష్టం అంతకు మూడు రెట్లుంటుంది. కరువు ప్రభావం పాడి, పశుపోషణపై పడింది. వ్యవసాయ కూలీల బతుకులను చిన్నాభిన్నం చేసింది. పనుల కోసం వలస బాట పట్టించింది.

తుపాన్లు, వరదలు

పంట ఎదిగే సమయంలో ఆగస్టులో ఉభయ గోదావరి జిల్లాల్లో గోదావరి నది పొంగింది. అదే సమయంలో మరో ఆరు జిల్లాల్లో వర్షాలు, వరదలకు వరి, పత్తి, చెరకు తదితర పంటలు దెబ్బతిన్నాయి. సుమారు 60 వేల ఎకరాల్లో పంట లకు నష్టం వాటిల్లింది. 50 వేల మంది రైతులకు రూ.వంద కోట్లకుపైన నష్టం జరిగిందని అంచనా. ప్రభుత్వం మొన్ననే రూ.32 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేసింది. అక్టోబర్‌లో విరుచుకుపడ్డ తిత్లీ తుపాను శ్రీకాకుళం జిల్లాను అతలా కుతలం చేసింది. విజయనగరంపైనా దాని ప్రభావం ఉంది. సర్కారు 30 వరద మండలాలను ప్రకటించింది. మూడు లక్షల ఎకరాల్లో పంటలకు అపార నష్టం జరిగింది. సుమారు నాలుగు లక్షల మంది రైతులకు చెందిన వ్యవ సాయ, ఉద్యానవన పంటలకు వాటిల్లిన వాస్తవ నష్టం రూ.రెండు వేల కోట్ల వరకు ఉంటుంది. ప్రభుత్వం రూ.475 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని మంజూరు చేసింది. పంపిణీ సా...గుతోంది. ఇక డిసెంబర్‌లో వచ్చిన పెథాయి తుపాను వలన ఎనిమిది జిల్లాల్లో రెండు లక్షల ఎకరాల్లోని పంటలు, తోటలకు నష్టం జరిగింది. వాస్తవ పంట నష్టం రూ.వెయ్యి కోట్ల వరకు ఉంటుంది. ఇంకా ఇన్‌పుట్ సబ్సిడీ అంచనాలు కొలిక్కి రాలేదు. వరి కోతల సమయంలో పెథాయి రావడంతో లక్షల టన్నుల మేర ధాన్యం తడిచింది. ఆ ధాన్యాన్ని కొనే నాథుడు లేడు.

నాలుగో రోజూ అదే తీరు

పెట్రో ఉత్పత్తుల ధరలు పైపైకే...

న్యూఢిల్లీ: వరుసగా నాలుగో రోజూ పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగాయి. కొత్త ఏడాది ప్రారంభమై పదిహేను రోజులు గడవకముందే పెట్రో ధరలు ఇప్పటికే ఐదు సార్లు పెరగడం గమనార్హం. కాగా, పెరిగిన ధరలతో దాదాపుగా దేశవ్యాప్తంగా లీటర్ పెట్రోల్‌పై రూ. 1.62, డీజిల్‌పై రూ. 1.78 పైసలు పైకి ఎగబాకాయి. కాగా, ఈనెల 3న ప్రారంభమైన చమురు ఉత్పత్తుల ధరల పెంపు.. 10 నుంచి వరుసగా కొనసాగుతోంది. ఆదివారం నాడు లీటరు పెట్రోల్‌పై రూ. 0.48, డీజిల్‌పై రూ. 0.63 పైసలు పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. దీంతో, సవరించిన ధరల ప్రకారం ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 69.75కు చేరుకుంది. ముంబయిలో పెట్రోల్ రూ. 75.39 కాగా, హైదరాబాద్‌లో రూ. 74గా నమోదైంది. దేశ రాజధానిలో డీజిల్ రూ. 63.69 కాగా.. ఇవే ధరలు ముంబయి, హైదరాబాద్‌లలో రూ. 66.66, రూ. 69.24కు చేరుకున్నాయి.

కుంభమేళాతో ప్రజల ఆదాయం పెంపు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో త్వరలో జరుగనున్న కుంభమేళా కోసం యోగీ సర్కారు తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ఓ వైపు ఆ ప్రాంత ప్రజలు తమ జీవనోపాధిని కోల్పోతుంటే.. దీని ద్వారా ప్రజల ఆదాయం పెరిగి వారు పేదరికం నుంచి బయటపడతారని లక్నోకు చెందిన అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నీల్ మణిప్రసాద్ వర్మ అన్నారు. లక్నోలో నిర్వహించిన ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రయాగ్‌రాజ్‌లో మూడు నెలల పాటు జరిగే కుంభమేళ ద్వారా అక్కడి ప్రజల ఆదాయం పెరుగుతుందన్నారు. కుంభమేళ జరిగినన్ని రోజులు అక్కడ జరిగే వ్యాపార లావాదేవీలతో ఆ ప్రాంత ప్రజలు పేదరికం నుంచి బయటపడతారని చెప్పారు. కానీ, కుంభమేళ జరిగినన్ని రోజులు కాన్పూర్‌లో తోళ్ల పరిశ్రమలు మూసివేయడంతో రోడ్డున పడ్డ ప్రజల గురించి ఆయన ప్రస్తావించలేదు.

నాలుగేళ్లుగా గ్యాంగ్‌రేప్

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళనకు దిగాల్సివచ్చింది. భాదితులు, పోలీసుల కథనం ప్రకారం హైదరాబాద్‌లోని కామాటీపుర పోలీస్ స్టేషన్ పరిధిలోని మురళీనగరకు చెందిన ఓ మైనర్ బాలికను(16) ఆమె బంధువు రాజు మూడు సంవత్సరాల క్రితం మాయమాటలతో లోబరచుకున్నాడు. అప్పుడు బాలిక వయసు 13 సంవత్సరాలు. ఆ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి బాలికను బ్లాక్ మెయిల్ చేసి

అత్యాచారాన్ని కొనసాగించాడు. ఆ తరువాత అతని స్నేహితులు విజయకుమార్, శుభంవ్యాన్, అభిజిత్‌లు కూడా ఆ బాలికపై అత్యాచారానికి దిగారు. విషయం బటయకు చెబితే నగ్న చిత్రాలను సోషల్ మీడియాలో పెడతామని నిందితులు బాలికను బెదిరించారు. ఆందోళనకు గురైన బాలిక విషయాన్ని తలిదండ్రులకు చెప్పింది. దీంతో బాలిక తలిదండ్రులు ఆదివారం కమాటిపురా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు రాజేష్, శుభంవ్యాన్, అభిజిత్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. విజయ్ కుమార్ అనే నిందితుడిని కేవలం సాక్షిగా చేర్చడంపై బాలిక బంధువులు ఆందోళనకు దిగారు. విజయకుమార్‌ను కూడా అరెస్ట్ చేయాలని పోలీస్ స్టేషన్ ఎదుట బైటాయించారు. సమాచారం అందుకున్న బాలల హక్కుల సంఘం విషయాన్ని షీ టీమ్, భరోసా కేంద్రాలకు తెలియచేశారు. దీవతో షీ టీం పోలీసులు రంగంలోకి దిగి విజయకుమార్‌పై కూడా కేసు నమోదు చేశారు.

బుర్ఖా ధరించే హక్కును తిరస్కరించొద్దు

- **ప్రభుత్వ శాఖలకు ఢిల్లీ మైనారిటీ కమిషన్ ఆదేశాలు**

న్యూఢిల్లీ: విద్యార్థులు, అభ్యర్థులు తమ మత ఆచారాలకు అనుగుణంగా దుస్తులు ధరించి(బుర్ఖా), వస్తువుల(సిక్కులు వెంటపెట్టుకునే కిర్పాన్)ను కలిగి ఉండి పరీక్షలు, నియామక ప్రక్రియల్లో పాల్గొనేందుకు అనుమతించాలని ఢిల్లీ ప్రభుత్వ శాఖలకు మైనారిటీ కమిషన్ ఆదేశాలు జారీచేసింది. ముస్లిం మహిళలు హిజబ్‌ను ధరించే హక్కును తిరస్కరించరాదని ఆ ఉత్తర్వుల్లో కమిషన్ పేర్కొంది. అలాగే చట్ట నిబంధనల మేరకు సిక్కులు కిర్పాన్(చిన్న కత్తి)ను కలిగి ఉండటాన్నీ అనుమతించాలని తెలిపింది. అలాగే పరీక్షల సమయంలో ముస్లిం మహిళల హిజబ్‌ను భద్రత సిబ్బంది తనిఖీలు చేయవచ్చునని, అయితే భద్రతకు సంబంధించిన తనిఖీల గురించి మైనార్టీ విద్యార్థులకు, అభ్యర్థులకు ముందస్తుగానే సమాచారమివ్వాలని సూచించింది. ఈ ఆదేశాలను అమలు చేయాల్సిందిగా.. ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలకు కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. లేని యెడల చట్టబద్ధ చర్యలను ఎదుర్కోవలసి ఉంటుందని తెలిపింది. కాగా, కమిషన్ ఉత్తర్వులకు అనుగుణంగా జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్.. ప్రిన్సిపల్ సెక్రెటరీలకు, శాఖాధిపతులకు సర్క్యులర్ జారీ చేసింది. పరీక్షలకు హాజరయ్యేటప్పుడు మతపరమైన వస్తువులను బలవంతంగా త్యజించాల్సి వస్తున్నదన్న మైనారిటీ వర్గీయుల ఫిర్యాదుల మేరకే ఈ ఉత్తర్వులు జారీ చేసినట్టు మైనార్టీ కమిషన్ ఛైర్మెన్ జాఫరుల్ ఇస్లాం ఖాన్ వివరించారు.

'సంక్రాంతి విన్నర్ అంటే పక్క సినిమాలతో పోటీ అనే భావన వచ్చేస్తుంది. అయితే నాకొక ఆలోచన ఉండేది. ఈవీవీ, కృష్ణారెడ్డి, జంధ్యాల గార్ల సినిమాలను చూస్తే.. అన్నీ వర్గాల ప్రేక్షకులు నవ్వుతూనే ఉండేవారు. వారి సినిమాలను బాగా చూసేవాడిని. అలా పూర్తిస్థాయి సినిమాను తీయాలనే కోరిక ఉండేది. అది ఈ సినిమాతో తీరింది. ఇదొక తీపి జ్ఞాపకంగా మిగిలిపోతుంది. అందరూ పగలబడి నవ్వుతున్నారు. సోషల్ మీడియాలో ఈవివిగారు, జంధ్యాలగారితో పోలుస్తూ కొందరు కామెంట్స్ కూడా చేశారు. వారి స్థాయికైతే నేను ఇంకా చేరుకోలేదు. ఎక్కడో ఒకచోట వాళ్ల ప్రభావం నాపై ఉంటుందనే మాట మాత్రం వాస్తవం. ఎందుకంటే వాళ్ల సినిమాలను నేను అలా చూసేవాడిని. వారి స్టయిల్‌ను నా స్టయిల్‌కు తగ్గట్టు మార్చుకుని సినిమాలు చేస్తున్నాను.'

పగలబడి నవ్వుతున్నారు



– అనిల్ రావిపూడి

పటాస్, సుప్రీమ్, రాజా ది గ్రేట్...ఈ సినిమా చూస్తే మనకు అర్ధమైపోతుంది. హాస్యం ఎంతలా పండిస్తారో...కుటుంబ విలువలకు ఎంత ప్రాధాన్యమిస్తారో. ఆ చిత్రాల దర్శకుడే అనిల్ రావిపూడి ఇప్పుడు 'ఎఫ్2' రూపొందించారు. సంక్రాంతికొచ్చిన అల్లుళ్ల ఎలాంటి ఫ్రస్టేషన్‌లో ఉంటారో చూపించారు. ఒక పక్క హాస్యం పండిస్తూనే మరో పక్క మహిళలను ఎలా గౌరవించాలో చక్కటి సందేశం ఇచ్చారు. వెంకటేశ్‌తో 'అంతేగా..అంతేగా' అని చెప్పించి కడుపుబ్బా నవ్వించారు. ఈ సంక్రాంతికొచ్చిన చిత్రాల్లో ఈ సినిమానే ప్రేక్షకులు ఎక్కువ ఆదరిస్తున్నారు. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి ఆదివారం మీడియాతో ముచ్చటించారు.

- సాధారణంగా మనం రకరకాల ఆసనాలు వేస్తుంటాం. అలాంటిది మనలో ఉన్న ఒత్తిడిని దూరం చేసుకోవడానికి ఒక ఆసనం ఉంటే ఎలా ఉంటుంది...అనే ఆలోచన నుండి ఈ వెంకీ ఆసనం పుట్టుకొచ్చింది. అలాగే వెంకటేష్‌కి ఓ మేనరిజమ్ పెట్టి.. దాన్ని కథకు లింక్ చేస్తే బావుంటుందనిపించి ఈ వెంకీ ఆసనం కనిపెట్టాను. ఆడియెన్స్ దాన్ని బాగా ఓన్ చేసుకున్నారు. చాలామంది థియేటర్‌లో ఆ ఆసనాన్ని వేస్తున్నారు. పాపులర్ అయింది. వారి స్థాయికి ఇంకా చేరుకోలేదు.
- వరుణ్ కూడా ఇప్పటి వరకు కామెడీ జోనర్‌లో సినిమా చేయలేదు. తను వెంకటేష్‌తో ఎలా కామెడీ టైమింగ్‌లో చేస్తాడోనని కాస్త ఆలోచించాను. తెలంగాణ యాస మాట్లాడుతూ వరుణ్ యాదవ్ అనే కుర్రాడి పాత్రలో కామెడీ జోనర్‌లో తొలిసారి చాలా చక్కగా నటించాడు. వెంకీగారితో కలిసి తను అద్భుతంగా నటించాడు.

'పటాస్' నుండి 'రాజాది గ్రేట్' వరకూ కమర్షియల్ సినిమాలు చేశాను. అయితే 'రాజా ది గ్రేట్' సినిమా చేసేటప్పుడు అసలు ఫైట్ లేకుండా ఓ కమర్షియల్ సినిమా చేద్దాం అనే ఆలోచన వచ్చింది. దానికి ఎలాంటి బేస్ తీసుకుందామనే ఆలోచన వచ్చింది. 'పెళ్లాం చెబితే వినాలి', 'క్షేమంగా వెళ్ళి లాభంగా రండి' జోనర్‌లో ఈ మధ్య సినిమాలు రాలేదనిపించి ఈ కథను రాసుకున్నాను. సాధారణంగా ఓ సినిమాను పూర్తి చేయడానికి ఏడాది సమయం పడుతుంది. కాబట్టి నాటీం సాయి, ప్రవీణ్, నారాయణలతో కథపై నాలుగైదు నెలలు వర్క్ చేశాం.

హిందీలో 'గోల్‌మాల్', 'హౌస్‌ఫుల్ ' సినిమాల సిరీస్ ఉంది. మన తెలుగులో ఇలాంటి జోనర్‌లో సినిమాలు చేయాలని ఉంది. కచ్చితంగా 'ఎఫ్2'కు సీక్వెల్‌గా 'ఎఫ్3' చేస్తాను. వెంకటేష్‌గారికి, వరుణ్‌కి చెప్పేశాను. వాళ్లు ఎప్పుడైనా రెడీ అన్నారు. చర్చల్లో ఉంది

- వెంకటేష్‌గారికి ఓ లైన్ చెప్పాను. ఆయనకు బాగా నచ్చింది. కథా చర్చలు జరుగుతున్నాయి. అది ఎప్పుడు ఒకే అవుతుందో ఇప్పుడే చెప్పలేను. కథను నమ్మారు. వెంకటేష్‌గారు కథను బాగా నమ్మారు. డబ్బింగ్ చెప్పేటప్పుడు సినిమా అంతా చూసి.. బయటకు వచ్చి 'అదేంటమ్మా అలా చేయించేశావ్' డబ్బింగ్ ఎంత ఎనర్జీతో చెప్పాలో తెలుసా! రేపు వచ్చి డబ్బింగ్ చెబుతాను' అని వెళ్లిపోయారు. చాలా కేర్ తీసుకుని డబ్బింగ్ చెప్పారు.
- సూర్యకాంతంగారి నటనలో, డైలాగ్ చెప్పడంలో ఓ స్టయిల్ ఉంటుంది. ఆమె డైలాగ్‌ను చాలా అందంగా విరుస్తారు. అలాంటి క్యారెక్టర్ మోడ్రన్‌గా ఉంటే ఎలా ఉంటుందో అని ఆలోచించి ప్రగతి క్యారెక్టర్‌ను పెట్టాం. మా అమ్మమ్మ, నాయనమ్మలు ఉండేవారు. ఏ ఫంక్షన్‌కి వచ్చినా మంచంపై కూర్చొని అది.. ఇది అంటూ అందరినీ కామెంట్ చేస్తుంటారు. ఆ క్యారెక్టర్స్ నాకు బాగా రిజిష్టర్ అయ్యాయి. అందువల్ల అలాంటి క్యారెక్టర్స్‌ను అన్నపూర్ణమ్మ, వై.విజయలుగా సినిమాలో చూపెట్టాం.
- నా తర్వాతి చిత్రాల గురించి ఇంకా ఏమీ అనుకోలేదు. పండగకు ఊరెళ్లి ఎంజాయ్ చేసి.. మూడు వారాలు రిలాక్స్ అయ్యి.. ఓ జోనర్‌లో చేయాలనేది ఆలోచించుకుని చేస్తాను. బాలకృష్ణగారికి కూడా ఓ ఐడయా చెప్పాను. ఈసారి ఫుల్ లెంగ్త్ కామెడీ చేయను. అయితే నా సినిమాల్లో ఫన్ లేయర్ లేకుండా ఉండదు.

6 నెలలు లైంగికంగా వేధించారు

దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీపై సహాయ దర్శకురాలి ఆరోపణ



రాజ్‌కుమార్ హిరానీ

ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీ తనను ఆరు నెలలు పాటు లైంగికంగా వేధించాడని అతని దగ్గర పనిచేసే సహాయ దర్శకురాలు ఒకరు ఆరోపించింది. హిరానీ ప్రొడక్షన్ ఆఫీస్‌లో తనను ఈ వేధింపులకు గురి చేసేవాడని పేర్కొంది. ఆ సమయంలో ఉద్యోగం వదిలేస్తే జరిగే పరిణామాన్ని, తన నిహాయతను ఓ మెయిల్‌లో వ్యక్తం చేసింది. తప్పు చేసినా పలుకుబడి ఉన్నవారి మాటలే జనాలు నమ్ముతారనే భయం, ఉద్యోగం పోతే మరే పనీ చేయలేని పరిస్థితిని ఆమె చేసిన మెయిల్‌లో కనిపించింది. 'సంజు' సినిమా నిర్మాణ సమయంలో తనపై ఈ లైంగిక వేధింపులకు హిరానీ పాల్పడారని ఆమె పేర్కొంది. జూన్ నుంచి నవంబర్ వరకూ తనపై జరిగిన వేధింపులు, ఆమె ఎదుర్కొన మానసిక వ్యధను వివరించింది.

రాజ్‌కుమార్ హిరానీ బాలీవుడ్‌లో ప్రముఖ దర్శకుడు. కుటుంబ కథా చిత్రాల రూపొందించే డైరెక్టర్‌గా ఖ్యాతి గడించాడు. 'మున్నాభాయ్' పేరుతో వచ్చిన సినిమాలన్నిటికీ ఈయనే దర్శకుడు. అమిర్ ఖాన్ హీరోగా చేసిన '3 ఇడియట్స్', పీకే' వంటి చిత్రాలను తెరకెక్కించారు. ఈయన దర్శకత్వంలో గత ఏడాది సంజయ్ దత్ జీవితం ఆధారంగా 'సంజు' సినిమా రూపొందింది. ఈ సినిమా నిర్మాణ సమయంలో తనతో పని చేసే సహాయ దర్శకురాలను రాజ్‌కుమార్ హిరానీ లైంగికంగా వేధించారు. 2018 మార్చి నుంచి సెప్టెంబర్ వరకూ ...ఈ ఆరునెలల కాలంలో అనేక సార్లు తనను లైంగిక వేధించారని బాధితురాలు పేర్కొంది. 'సంజు' చిత్రం జూన్ 29న విడుదలైంది. ఆ సినిమా పోస్టు ప్రొడక్షన్ సమయంలో ఈ దారుణానికి ఒడిగట్టడం ప్రారంభించాడని వెల్లంచింది. తనపై లైంగిక దాడి జరుగుతున్నప్పుడు వద్దని హిరానీని ప్రాధేయపడింది. అయినా కనికరించలేదు. తప్పని పరిస్థితుల్లో బాధను దిగమించి అదే ఉద్యోగం కొనసాగింది. 'సర్.. నా పట్ల జరిగినది చాలా పెద్ద తప్పు. హిరానీ పేరున్న దర్శకుడు. నేను కేవలం ఆయన వద్ద పనిచేస్తున్న చిన్నపాటి అసిస్టెంట్ డైరెక్టర్‌ని. నా పట్ల జరిగిన దారుణాన్ని బయటకు చెప్పుకోలేను. ఆరోజు నా మనసు, శరీరం పాడైపోయాయి. అలా ఆరు నెలల పాటు హిరానీ సర్ నన్ను లైంగికంగా వేధించారు. భరించాల్సి వచ్చింది. కానీ నాకు వేరే మార్గం లేదు. మధ్యలో ఉద్యోగాన్ని వదిలేస్తే...ఇండస్ట్రీలో మరెవ్వరూ నాకు ఉద్యోగం ఇవ్వరు. అందుకే మౌనంగా ఉండాల్సి వచ్చింది. ఒకవేళ ఈ ఉద్యోగాన్ని వదిలేసినా... ఆయన నా పనితనం గురించి బయట తప్పుగా మాట్లాడతారేమోనన్న భయం నన్ను మౌనం వహించేలా చేసింది. హిరానీ సారే నా గురించి తప్పుగా ప్రచారం చేస్తారు. దాన్నే ఎక్కువ మంది నమ్ముతారు. దీని వల్ల నా భవిష్యత్తు పాడైపోతుంది" అని మెయిల్ ద్వారా వింధు వినోద్ చోప్రాకు తెలిపింది.

'సర్.. నా పట్ల జరిగినది చాలా పెద్ద తప్పు. హిరానీ పేరున్న దర్శకుడు. నేను కేవలం ఆయన వద్ద పనిచేస్తున్న చిన్నపాటి అసిస్టెంట్ డైరెక్టర్‌ని. నా పట్ల జరిగిన దారుణాన్ని బయటకు చెప్పుకోలేను. ఆరోజు నా మనసు, శరీరం పాడైపోయాయి. అలా ఆరు నెలల పాటు హిరానీ సర్ నన్ను లైంగికంగా వేధించారు. భరించాల్సి వచ్చింది. కానీ నాకు వేరే మార్గం లేదు. మధ్యలో ఉద్యోగాన్ని వదిలేస్తే...ఇండస్ట్రీలో మరెవ్వరూ నాకు ఉద్యోగం ఇవ్వరు. అందుకే మౌనంగా ఉండాల్సి వచ్చింది. ఒకవేళ ఈ ఉద్యోగాన్ని వదిలేసినా... ఆయన నా పనితనం గురించి బయట తప్పుగా మాట్లాడతారేమోనన్న భయం నన్ను మౌనం వహించేలా చేసింది. హిరానీ సారే నా గురించి తప్పుగా ప్రచారం చేస్తారు. దాన్నే ఎక్కువ మంది నమ్ముతారు. దీని వల్ల నా భవిష్యత్తు పాడైపోతుంది.'

బాధితురాలు ఎదుర్కొన్న వేధింపుల గురించి తొలిసారిగా నవంబర్ 23న 'సంజు' చిత్రం సహ నిర్మాత, హిరానీకి సన్నిహితంగా ఉండే సహవ్యాపారి బాలీవుడ్ ప్రొడ్యూసర్ వింధు వినోద్ చోప్రాకు మెయిల్ ద్వారా వివరించింది. ఇదే మెయిల్‌ను ఫిల్మ్ క్రిటిక్ అనుపమ చోప్రా, స్క్రీన్ రైటర్ అభిజిత్ జోషి, వింధు వినోద్ చోప్రా సోదరి షెల్లీ చోప్రాలకు కూడా పంపించింది. ఆ విషయంపై వింధు వినోద్ చోప్రా కానీ, హిరానీ భార్య అనుపమ్ కానీ స్పందించలేదు. బాధితురాలు చేసిన ఆరోపణలపై కమిటీని వినోద్ చోప్రా ఫిల్మ్ ఏర్పాటు చేసినట్టు డిసెంబర్‌లో వెల్లడించింది అనుపమ్. ఈ వివరాలన్నీంటినీ హఫ్‌పోస్టు అనే పత్రిక బయట ప్రపంచానికి తెలియజేసింది. బాధిరాలు తొలిసారిగా వినోద్ చోప్రాకు మెయిల్ చేశాక ఆమెను హఫ్‌పోస్టు సంప్రదించింది. తర్వాత ఆమె స్నేహితులు ముగ్గుర్ని వివిధ సందర్భాల్లో దీనిపై వివరణ అడిగింది. హిరానీ ఆమెను వేధించాడని వాళ్లూ వెల్లడించారు.

"హిరానీ నాకు బాస్. సుమారుగా నా కంటే 30 ఏళ్ల పెద్దవాడు. అతను నన్ను లైంగికంగా వేధించినప్పుడు ఎంత బాధను అనుభవించానో చెప్పలేను. కానీ ఆ బాధను ఎక్కడా బయటకు కనిపించకుండా మేనేజ్‌చేశాను. ఎందుకంటే అప్పటికే మా నాన్నగారు అనారోగ్యంతో ఉండడం..నేను జాబ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉండడం వల్ల మౌనంగా ఉన్నా. ఇలా చేయొద్దని మర్యాదగా చెప్పడం తప్ప నేనేమీ చేయలేని పరిస్థితి. ఆ సమయంలో బాధను భరించలేకపోయేదాన్ని. కానీ అన్నీ భరించాను" అని హఫ్‌పోస్టు ప్రతినిధి జరిపిన ఇంటర్వ్యూలో బాధితురాలు చెప్పింది.

ఈ ఆరోపణలపై హఫ్‌పోస్టు హిరానీ వివరణ కోరినప్పుడు మాత్రం స్పందించకుండా టెక్స్‌మెస్సెజ్ పంపించాడు. ఆమె పట్ల వృత్తిపరమైన సంబంధాలనే కొనసాగించాను తప్ప తను చేసేవన్నీ ఆరోపణలే అని పేర్కొన్నాడు. ఇది పూర్తిగా నిరాధారమైన, అన్యాయమైన ఆరోపణలని హిరానీ న్యాయవాది దేశాయ్ తెలిపారు.

ఇది చేయాల్సిన పని


నివారణ, నిషేధం, పరిష్కారం(పీఓఎస్‌హెచ్)చట్టం 2103 ప్రకారం పని ప్రదేశాల్లో మహిళల రక్షణ కోసం, లైంగిక వేధింపుల నిరోధించడానికి ప్రతి ప్రొడక్షన్ హౌస్ 'అంతర్గత ఫిర్యాదు కమిటీ(ఐసీసీ)ని ఏర్పాటు చేయాలి. కానీ చాలా నిర్మాణ సంస్థలు ఆ పని చేయడం లేదని లైంగిక వేధింపుల కేసులను డీల్ చేస్తున్న నాయ్యవాది విష్ణు శ్రీరామ్ తెలిపారు. 10 మంది ఉద్యోగులు ఉన్న ప్రతి కంపెనీ ఈ నిబంధనలు పాటించాల్సి ఉందని చెప్పారు. ఈ కేసులో కూడా అటు రాజ్‌కుమార్ హిరానీ ఫిల్మ్ కానీ, వినోద్ వింధ్ చోప్రా ఫిల్మ్ కానీ పగడ్బంధీగా కమిటీలు వేసిన పాపాన పోలేదు.



లావణ్య త్రిపాఠి, నిఖిల్ సిద్ధార్థ్

జర్నలిజం 'ముద్ర' ఉంటుందా?

నిఖిల్ సిద్దార్థ్, లావణ్య త్రిపాఠి జంటగా తెరకెక్కుతోన్న యాక్షన్‌ఎంటర్ టైనర్ 'ముద్ర'. ఈ చిత్రాన్ని టీఎన్ సంతోష్ తెరకెక్కిస్తున్నారు. వాస్తవిక సంఘటనల ఆధారంగా జర్నలిజం నేపథ్యంలో రూపొందుతోంది. షూటింగ్ చివరిదశలో ఉంది. ఐదు రోజుల టాకీ.. ఓ పాట ఈ నెలలో పూర్తి చేయనున్నారు. డబ్బింగ్ వర్క్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఒకేసారి పూర్తి చేస్తున్నారు.అద్భుతమైన ఔట్ పుట్ ఇవ్వడానికి చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు దర్శక నిర్మాతలు. ఈ చిత్రంలో గ్రాఫిక్స్ వర్క్ , భారీ యాక్షన్ సీక్వెన్సులు ఉన్నాయి. అందుకే కాస్త సమయం ఎక్కువగా తీసుకుంటోంది యూనిట్. ఇందులో జర్నలిస్ట్ పాత్రలో నటిస్తున్నారు నిఖిల్.. ఫస్ట్ లుక్‌కు కూడా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిందని చిత్రబృందం చెబుతోంది. టీజర్ త్వరలోనే విడుదల కానుంది. స్యామ్ సిఎస్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. వెన్నెల కిషోర్, పోసాని కృష్ణమురళి, నాగినీడు, ప్రగతి, సత్య, తరుణ్ అరోరా, రాజా రవీంద్ర ఈ చిత్రంలో సహాయ పాత్రల్లో నటిస్తున్నారు. ఔరా సినిమాస్ పివిటి, మూవీ డైనమిక్స్ ఎల్‌ఎల్పి బ్యానర్స్‌పై కావ్య వేణుగోపాల్, రాజు కుమార్ నిర్మిస్తున్నారు. బి మధు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.



అఖిల్

'మిస్టర్ మజ్ను' 25న వస్తున్నాడు

అఖిల్ అక్కినేని హీరోగా రూపొందుతోన్న సినిమా 'మిస్టర్ మజ్ను'. శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పి పతాకంపై 'తొలిప్రేమ' ఫేం వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకొని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఈనెల 25న చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించి విడుదలైన పాటలకు, టీజర్‌కు చాలా మంచి రెస్పాన్స్ వస్తోందని చిత్రబృందం చెబుతోంది. ఈ చిత్రంలో గీతాలన్నీ సంక్రాంతిని పురస్కరించుకుని సోమవారం ఉదయం 10 గంటలకు విడుదల చేస్తామని చెప్పారు. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ హీరోయిన్. నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం : థమన్, పాటలు : శ్రీమణి, సినిమాటోగ్రఫీ : జార్జ్ సి. విలియమ్స్, ఎడిటింగ్: నవీన్ నూలి, ఆర్ట్: అవినాష్ కొల్లా, కొరియోగ్రఫీ : శేఖర్.



మహా చంద్ర

నైనా ఫిలిమ్స్ పతాకంపై యశ్, ప్రేమ్ కుమార్, శ్రియ నటించిన చిత్రం 'మహా చంద్ర'. రూప అయ్యర్ దర్శకత్వం. షాన్వాజ్ నిర్మించారు. ప్రస్తుతం డబ్బింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత షాన్వాజ్ మాట్లాడుతూ " కన్నడలో సూపర్ హిట్ అయిన 'చంద్ర' చిత్రాన్ని 'మహా చంద్ర' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం. యశ్ ఈ చిత్రంలో ఒక ప్రముఖ పాత్రను పోషిస్తున్నారు. శ్రియ తన అద్భుతమైన నటనతో ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం డబ్బింగ్ పూర్తి చేసుకున్న మా చిత్రాన్ని ఫిబ్రవరి రెండో వారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం' అని తెలిపారు. దామోదర వనాచార్య సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంగీతం : గౌతమ్ శ్రీ వాస్తవ, కెమెరా : దాస్, నిర్మాత:షాన్వాజ్, దర్శకత్వం :రూప అయ్యర్.

'యమ్6'ని ఓ ప్రయోగంలా తెరకెక్కించాం

విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ బ్యానర్స్‌పై విశ్వనాథ్ తన్నీరు నిర్మించిన చిత్రం 'యమ్6'. ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకొని యు/ఎ సర్టిఫికేట్ పొందింది. ఈ సందర్భంగా నిర్మాత విశ్వనాథ్ తన్నీరు మాట్లాడుతూ ' సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా చాలా క్వాలిటీగా నిర్మించాం. ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే ఒక అద్భుతమైన కథని దర్శకుడు జైరాం అంతే అద్భుతంగా తెరకెక్కించారు. ఈ సినిమా ప్రతి ఒక్కరినీ అలరిస్తుంది. ఫిబ్రవరి మొదటి వారంలో ఈ సినిమాను విడుదల చేస్తున్నాం"అని అన్నారు. దర్శకుడు జైరామ్‌వర్మ మాట్లాడుతూ 'నిర్మాత విశ్వనాథ్ ఈ సినిమాను క్వాలిటీలో ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు. ఎలాంటి హంగులు ఆర్భాటాలు లేకుండా నేచురల్‌గా తెరకెక్కించాం. ప్రత్యేకంగా పోరాట దృశ్యాలు మన కళ్లముందే జరుగుతున్నట్లు ఉంటూ అందరినీ అలరిస్తాయి. ఇలాంటి సినిమాలు తమిళ, మలయాళ, కన్నడలో వచ్చేవి. ఇప్పుడు తెలుగు ప్రజలు కూడా ఈ రకమైన సినిమాల్ని ఎంజాయ్ చేయటం ఆనందంగా ఉంది. ఈ సినిమాని ఒక రకమైన ప్రయోగంలా భావించి తెరకెక్కించాం. చూసిన ప్రతి ఒక్కరూ థ్రిల్‌గా ఫీల్ అవుతూనే లవ్, కామెడీని బాగా ఎంజాయ్ చేస్తారు" అని తెలిపారు. ఈ చిత్రంలో ధ్రువ, అశ్విని, శ్రావణి, తిలక్, సాధన, అప్పలరాజు, హరిత, వంశీ, ఇంద్రతేజ నటించారు. విజయ్ బాలాజీ బాణీలు సమకూరుస్తున్నారు.



అశ్విని, ధ్రువ

డాన్స్.. డాన్స్..



శ్రద్ధా కపూర్

శ్రద్ధా కపూర్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని పోరాటాలు చేస్తోంది. ప్రభాస్ హీరోగా నటిస్తోన్న 'సాహో' చిత్రంలో ఈమె కథానాయిక. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రం తర్వాత పాకిస్థాన్ డాన్సర్‌గా చేయబోతుంది. రెమో డిసౌజ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న డాన్స్ నేపథ్య చిత్రంలో ఈమె కథానాయిక. డాన్స్ చేసి ప్రేక్షకులను మెప్పించడం కోసం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. 'సాహో' సినిమా షూటింగ్‌కు ముందు, తర్వాత కూడా డాన్స్ ప్రాక్టీస్‌లోనే నిమగ్నమైపోతుందట. ఈమె ఇప్పటికే మంచి డాన్సర్ కానీ ఇంకా బాగా చేయాలని ఆరాట పడుతోంది. కానీ ఒక పక్క సినిమాలు, మరో పక్క ప్రకటనల షెడ్యూళ్ల వల్ల తీవ్ర ఒత్తడికి గురవుతుందట. అందువల్లే డాన్స్‌లో శిక్షణ ఇచ్చేందుకే ప్రత్యేకంగా ట్రైనర్‌ను తన వద్దే ఉండేలా చూసుకుంది. ఇందులో వరుణ్ ధావన్ హీరోగా చేస్తున్నాడు. శ్రద్ధా పాకిస్థాన్ డాన్సర్‌గా కనిపించబోతుంది.

కె.విశ్వనాథ్ ప్రశంస ఆనందాన్నిచ్చింది

'అదృశ్యం' ట్రైలర్ లాంచ్‌లో హీరో జాన్



వైష్ణవి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రవిప్రకాష్ కృష్ణం శెట్టి నిర్మించిన చిత్రం 'అదృశ్యం'. హార్రర్, థ్రిల్లర్, కామెడీ ప్రధానాంశంగా రూపొందింది ఈ చిత్రం. సెన్సార్ పూర్తి చేసుకుని ఫిబ్రవరిలో విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా ఈ చిత్ర ట్రైలర్‌ను శనివారం ఫిల్మ్‌ఛాంబర్‌లో హీరో జాన్ చేతుల మీదుగా విడుదల చేశారు.

హీరో జాన్ మాట్లాడుతూ 'తెలుగులో ఇది నా మూడో చిత్రం. 'అదే నువ్వు అదే నేను', 'బంటీ ద బ్యాడ్ బోయ్' తర్వాత నేను నటించే మూడో చిత్రమిది. తెలుగు ఇండస్ట్రీ చాలా పెద్దది. చాలా బావుంటుంది. ఈ రోజు లెజండరీ డైరెక్టర్ కె.విశ్వనాథ్‌ని కలిసి మా ఆడియోని రిలీజ్ చేశాం. ఆయన నన్ను చూసి ప్రభాస్‌లా ఉన్నావు అన్నారు. నాకు చాలా ఆనందంగా ఉంది. అంత పెద్ద డైరెక్టర్ నన్ను పొగడడం అంటే మాములు విషయం కాదు' అని తెలిపారు.

దర్శకుడు రవిప్రకాష్ మాట్లాడుతూ 'ముందు నా కెరీర్ మొదలైంది కె.విశ్వనాథ్ దగ్గరే. ఆయన దగ్గర కో డైరెక్టర్‌గా చాలా సినిమాలకు పని చేశాను. తర్వాత సింగీతం శ్రీనివాస్ దగ్గర 14 సినిమాలకు పని చేశాను. నేను చాలా అదృష్టవంతుడిని. అలాంటి లెజండరీ డైరెక్టర్ల దగ్గర పని చేయడం నాకు చాలా గర్వంగా ఉంది. హీరో జాన్ ఆల్రెడీ నా పిల్లల చిత్రం చేశారు. అందుకే ఆయన్నే హీరోగా ఎంచుకున్నా. నేను చేసిన 'బంటీ ద బ్యాడ్ బాయ్'కి ఎన్నో అవార్డులు వచ్చాయి. ఒక రివార్డు వచ్చే సినిమా చెయ్యాలని ఈ సినిమా చేస్తున్నాను. ఇది ఒక థ్రిలర్. అత్యాద్భుతంగా ఉంటుంది. ఆసక్తిగా ఉంటే చాలు బడ్జెట్‌తో పని లేదు. ఇందులో నలుగురు హీరోయిన్లు నటిస్తున్నారు. జయవాణి ఒక మాంత్రికురాలిగా ప్రత్యేక పాత్రలో చేశారు. చాలా బాగా చేశారు. టెక్నీషియన్లు అందరూ ఈ చిత్రం కోసం చాలా కష్టపడ్డారు' అని పేర్కొన్నారు.

మ్యూజిక్ డైరెక్టర్ ఆల్డ్రిన్ మాట్లాడుతూ 'తెలుగులో ఇది నా మొదటి చిత్రం. శ్రవంతి మూవీస్‌కి వర్క్ చేశాను. నేను చెన్నైలో మ్యూజిక్ కోర్సు చేశాను. తమిళ్‌లో దాదాపుగా 7 చిత్రాలకు సంగీతాన్ని అందించాను' అని తెలిపారు.

రూపాయి



పొదుపు, బీమా పథకాల్లో పెట్టుబడులు పెట్టి.. కొంతకాలం గడిచాక.. పలు కారణాలవల్ల ఆయా పథకాలను మధ్యలోనే ఆపేస్తుంటారు చాలామంది. అయితే అలా ఆగిపోయిన బీమాపాలసీలు, పొదుపు పథకాలను తిరిగి పునఃరుద్ధరించుకునే వెసులుబాటును ఆర్థిక సంస్థలు కల్పిస్తున్నాయి. కొంతకాలంపాటు కొంత డబ్బు వెచ్చించాక.. పెట్టుబడిగా పెట్టిన మొత్తాన్ని ఎలా వెనక్కి తీసుకోవాచ్చు? మధ్యలో ఆపేసే పథకాలను తిరిగి కొనసాగించడం ఎలా? అనే విషయాల గురించి ఈవారం 'రూపాయి'లో తెలుసుకుందాం.

ఆగిన పొదుపు పథకాల పునరుద్ధరణ ఇలా!

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని సొంతిళ్ళు, పిల్లల చదువులు, వాళ్ళ పెళ్లిల్లు, పింఛను తదితర వాటి కోసం చాలామంది ప్రతి నెలా కొంత మొత్తాన్ని మదుపు చేస్తుంటారు. దానికోసం వివిధ పొదుపు పథకాలను ఎంచుకుంటాం. కొన్నాళ్లయ్యాక అనుకోని ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆ పథకాలను కొందరు కొనసాగించలేకపోతుంటారు. అయితే.. అప్పటిదాకా వెచ్చించిన సొమ్ము నష్టపోకుండా.. తిరిగి ఆయా పథకాలను పునరుద్ధించుకోవడానికి ఆర్థిరంగ సంస్థలు కొన్ని షరతులతోకూడిన సౌకర్యాన్ని ఖాతాదారులకు కల్పిస్తున్నాయి. ఆ



మేరకు తిరిగి ఖాతాలను నిర్వహించుకోవచ్చు. అలాంటి పథకాలేంటో చూద్దాం

పోస్టాఫీసు రికరింగ్ డిపాజిట్

ఏ నెలలోనైనా కట్టాల్సిన రికరింగ్ డిపాజిట్ మొత్తాన్ని కట్టకపోతే పోస్టాఫీసు రికరింగ్ డిపాజిట్‌లో 5 రూపాయలు జమ చేయాల్సిన మొత్తానికి 5 పైసల అపరాధ రుసుము చెల్లించాలి. వరుసగా ఆరు నెలల పాటు జమ చేయకపోతే ఖాతాను పునరుద్ధరించుకోవడం కుదరదు. ఆర్డీ ప్రారంభించిన మూడేళ్ల తర్వాత రద్దు చేసుకోవచ్చు. అప్పుడు పోస్టాఫీసు పొదుపు ఖాతా వడ్డీ మాత్రమే ఇస్తారు.

బ్యాంకు రికరింగ్ డిపాజిట్

బ్యాంకు రికరింగ్ డిపాజిట్‌లో బకాయిపడ్డ వాయిదా మొత్తంపై అపరాధ రుసుము 1 నుంచి 2 శాతం ఉంటుంది. ఎస్‌బీఐ ఫ్లెక్సీ డిపాజిట్, ఎస్‌బీహెచ్ ఫ్లెక్సీ ఆర్‌డీ, ఆంధ్రాబ్యాంకు రికరింగ్ ప్లస్, ఐసీఐసీఐ-ఐ విష్ వంటి ప్రత్యేక రికరింగ్ డిపాజిట్లలో ఏడాదిలో కొన్ని నెలలు ఆర్‌డీ వాయిదాలు కట్టకపోయినా రుసుము ఉండదు. బ్యాంకు ఆర్‌డీని గడువుకు ముందే రద్దు చేసుకుంటే.. అప్పటి వరకూ కొనసాగిన ఆర్‌డీ కాలానికి వర్తించే వడ్డీ చెల్లిస్తారు.

ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్)

మన దేశంలో నివసించే వారెవరైనా ప్రారంభించేందుకు వీలున్న ప్రజా భవిష్య నిధి ఖాతాలో ఏడాదికి కనీసం రూ.500, గరిష్టంగా రూ.1,50,000లను జమ చేయవచ్చు. చెల్లించే మొత్తానికీ, వచ్చిన వడ్డీకి కూడా పన్ను మినహాయింపు లభించే ఈ పథకంలో ప్రస్తుతం 8.1% వార్షిక చక్రవడ్డీ లభిస్తోంది. ఏడాదికి కనీసం రూ.500 జమ చేయకపోతే.. కనీస డిపాజిట్ కట్టని ఏడాదికి రూ.50 చొప్పున అపరాధ రుసుముతోపాటు.. కనీస జమ కలిపి ఒకేసారి చెల్లించవచ్చు. కనీస డిపాజిట్ కట్టకుండా వదిలేసిన ఖాతాలో డబ్బును పీపీఎఫ్ గడువు 15 ఏళ్ల తర్వాత తీసుకోవచ్చు. డబ్బులు తీసుకునే ముందు నెల వరకూ వడ్డీ వస్తుంది. వ్యవధి ముగియకుండా ఖాతాను రద్దు చేసుకోవడం కుదరదు. ఖాతా ప్రారంభించిన ఐదేళ్ల తర్వాత తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో.. ఆర్థిక శాఖ అనుమతితో మాత్రమే ముందస్తు రద్దుకు అనుమతి ఇస్తారు.



సుకన్య సమృద్ధి ఖాతా

పదేళ్ల లోపు వయసున్న కూతురి పేరుతో తల్లిదండ్రులు ఈ ఖాతాను ప్రారంభించవచ్చు. ఏడాదికి కనీసం రూ.1,000 నుంచి గరిష్టంగా రూ.1,50,000వరకూ ఇందులో జమ చేయవచ్చు. ఏ ఏడాదిలోనైనా రూ.1,000 జమ చేయకపోతే.. తర్వాత సంవత్సరంలో రూ.50 అపరాధ రుసుముతో కలిపి, కనీస డిపాజిట్ రూ.1,000 చెల్లించి ఖాతాను కొనసాగించవచ్చు. ఖాతా ప్రారంభించిన 15 సంవత్సరాల్లో కట్టడం ఆపేసిన మొత్తాన్ని అపరాధ రుసుముతో సహా చెల్లించకపోతే.. అప్పటివరకూ జమ చేసిన మొత్తానికి సాధారణ పోస్టాఫీసు పొదుపు ఖాతా వడ్డీ 4 శాతం మాత్రమే ఇస్తారు. 8.6 శాతం వార్షిక చక్రవడ్డీ వచ్చే ఈ పథకంలో క్రమం తప్పకుండా కడితే ఈ వడ్డీ నష్టం నుంచి తప్పించుకోవచ్చు. మధ్యలో ఆపేస్తే అపరాధ రుసుము, కనీస జమ చెల్లించి ఖాతాను పునరుద్ధరించుకోవడం ఉత్తమం.



ఖాతా దారుగా ఉన్న బాలికకు జరగరానిది ఏదైనా జరిగితే.. బాలిక సంరక్షకులైన తల్లి లేదా తండ్రికి ఖాతాలోని సొమ్ము వడ్డీతో సహా చెల్లిస్తారు. ఖాతా ప్రారంభించిన నాటి నుంచి 21 సంవత్సరాల తర్వాత అసలు, వడ్డీ చెల్లిస్తారు. అమ్మాయి వయసు 18 ఏళ్ల నిండాక పెళ్లి కుదిరితే.. పెళ్లికి ముందు 30 రోజుల్లోపు లేదా వివాహమైన 3 నెలల్లోపు ఖాతా సొమ్ము వడ్డీతో సహా ఇస్తారు.

అటల్ పెన్షన్ యోజన

అసంఘటిత రంగంలో ఉన్న 18 నుంచి 40 ఏళ్ల వయసు వారు ఈ పథకంలో ప్రతి నెలా జమ చేసే మొత్తాన్ని బట్టి 60 ఏళ్ల వయసు నుంచి ప్రభుత్వం నెలకు రూ.1,000 నుంచి రూ.5,000 వరకూ కనీస పింఛను ఇస్తుంది. 60 ఏళ్ల వరకూ కట్టాల్సిన ఈ పథకంలో జమలు మధ్యలో ఆగితే వందకు ఒక రూపాయి చొప్పున అపరాధ రుసుము చెల్లించి ఈ పథకాన్ని కొనసాగించవచ్చు. 60 ఏళ్లలోపు ఖాతాదారు మరణిస్తే.. ఖాతాదారు జీవిత భాగస్వామి జమలు కొనసాగించి 60 ఏళ్ల తర్వాత పింఛను తీసుకోవచ్చు. లేదా ఖాతాలో సొమ్ము తీసుకోవచ్చు. సాధారణ పరిస్థితుల్లో 60 ఏళ్లలోపు ఖాతా నుంచి డబ్బు వెనక్కి తీసుకోవడానికి అనుమతించరు. తీవ్ర అనారోగ్యం వంటి ప్రత్యేక పరిస్థితుల్లో ఖాతాను ఉపసంహరించుకోవచ్చు.

జాతీయ పింఛను పథకం

60 ఏళ్లలోపు ఈ పథకం నుంచి ఉపసంహరించుకోవాలంటే.. అప్పటి వరకూ జమ అయిన మొత్తంలో కనీసం 80శాతాన్ని పింఛను ఇచ్చే యాన్యుటీల్లో మదుపు చేయాల్సి ఉంటుంది. మిగిలిన 20 శాతం మాత్రమే వెనక్కి తీసుకోవచ్చు.

★

కార్డులతో.. తస్మాత్ జాగ్రత్త!

క్రెడిట్, డెబిట్ కార్డులకు సంబంధించి చాలా మోసాలు ఇటీవల కాలంలో చాలా ఎక్కువయ్యాయి. ఇందులో బ్యాంకు ప్రతినిధులుగా నమ్మిస్తూ మనల్ని మోసం చేసేవే అధికం. అందుకే క్రెడిట్, డెబిట్ కార్డులు వినియోగం, భద్రత విషయంలో జాగ్రత్తలు అవసరం.




కార్డుదారుడికి సంబంధించి కొన్ని ప్రాథమిక విషయాలు.. చెప్పి.. నిర్ధారణ కోసం అంటూ మిగతా విషయాలను తెలివిగా అడుగుతారు. కొన్నిసార్లు కార్డు సంఖ్య, సీవీవీలను కార్డును స్వైప్ చేసేప్పుడు దొంగిలిస్తారు. మీరు సంఖ్యను కొట్టేప్పుడు దాన్ని గుర్తు పెట్టుకొంటారు. వీటన్నింటి తర్వాత... ఖాతాదారుడికి ఫోన్ చేసి, మీ కార్డు వివరాలు చెప్పి.. మీ దగ్గర్నుంచి 'వన్ టైం పాస్‌వర్డ్' పుట్టిన తేదీ వివరాలు, ఈ మెయిల్ తదితర వివరాలను రాబట్టి, మోసానికి పాల్పడతారు.

మరో మోసం ఏమిటంటే.. క్రెడిట్ కార్డును క్లోనింగ్ లేదా స్కిమ్మింగ్ చేయడం. అంటే.. మీ అసలు కార్డు వివరాలతో నకిలీ కార్డును రూపొందిస్తారన్నమాట. ఇలాంటి మోసాలను నివారించేందుకు బ్యాంకులు తగిన చర్యలు తీసుకుంటూనే ఉన్నాయి. 'మ్యాగ్నటిక్ స్ట్రిప్' స్థానంలో చిప్ కార్డులను అందిస్తున్నాయి. పిన్ ఆధారంగా పనిచేసే ఈ కార్డుల ద్వారా మోసాలను అరికట్టేందుకు వీలుంది.

జాగ్రత్తలు అవసరం

ఖాతాదారులు కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పిన్, పాస్‌వర్డ్‌ను ఎవరికీ, ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదు. మొబైల్ ఫోన్లలో నమోదు చేసి పెట్టుకోవడం కూడా మంచిది కాదు. జ్ఞాపకం ఉంచుకోవడమే మేలు. అలాగే.. విదేశీ కరెన్సీ, లాటరీల్లో గెలిచారని చెప్పి వచ్చే మెయిళ్లను, ఫోన్లను నమ్మకూడదు.



నిబంధనలు తెలియాలి

కార్డు పోయినా.. లేదా మీకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసిందని గమనించినా వెంటనే బ్యాంకుకు ఆ విషయాన్ని తెలియజేయాలి.

కార్డు పోయిన సమాచారం బ్యాంకుకు చేరనంత వరకూ.. దానికి సంబంధించిన లావాదేవీలకు కార్డుదారుడే బాధ్యత వహించాల్సి ఉంటుంది. అయితే, ఖాతాదారుడి తప్పు లేకుండా మోసాలు జరిగినప్పుడు వాటి గురించి ఫిర్యాదు చేయవచ్చు. క్రెడిట్, డెబిట్ కార్డులను అందించేప్పుడు తప్పనిసరిగా ఖాతాదారుడికి మాత్రమే అందించాలి. ఎవరికి వాటిని జారీ చేశారో వారే వాటిని అందుకునేలా ఆధారాలు తీసుకోవాలి. ప్రతి లావాదేవీకీ సంబంధించిన విషయాన్ని ఈమెయిల్, ఎస్ఎంఎస్ రూపంలో సందేశం పంపించాలి. ఒకవేళ ఖాతాదారులకు ఈ సమాచారం రాకపోతే బ్యాంకులను సంప్రదించాలి.

-చైతన్య



చిన్నారి

పొదుపు కథ

నాకు తోకవుంది కాని, కోతిని కాను, పైకి ఎగరగలను గాని పక్షినికాను.. ఎవరిని నేను?



జవాబు : గాలిపటం

జోక్:

తల్లి : ఏంట్రా తింటున్నావు బయటితిండి తినవద్దని ఎన్ని సార్లు చెప్పనురా?

కొడుకు : అందుకే అమ్మా బయటకొనుక్కొని.. ఇంటికే తెచ్చి తింటున్నా..

నీడ కనిపెట్టండి!



పిల్లలూ! ఈ చిత్రంలో కొన్ని జంతువులు వాటి నీడలు ఉన్నాయి. ఏ జంతువు నీడ ఏదో కనిపెట్టండి

సైన్సు సంక్రాంతి

సంక్రాంతి వస్తుందంటే మనందరికీ సందడే! కొత్త బట్టలు, పిండివంటలు, గంగిరెద్దులాట, తాడుపెద్దుల పాట ... ఇలా సందళ్లు ఉంటాయి. అవన్నీ చూడడం, ఆడడం మనకు చాలా ఆనందాన్నిస్తాయి. సంక్రాంతికి నెలగంట మొదలవగానే చాలా ఇళ్ల ముంగిట చక్కని ముగ్గులు ప్రత్యేకంగా కనిపిస్తాయి. మీలో చాలామంది పిల్లలు అలాంటి ముగ్గులు పెడతారు కూడా!

మరి చదువును, సంక్రాంతి కలిపి జరుపుకోవటం మీరెప్పుడైనా చూశారా? విశాఖ జిల్లా మాకవరపాలెం జెడ్పీ హైస్కూలు పిల్లలు అలా జరుపుకున్నారు. దానికి సైన్సు సంక్రాంతి అని పేరు పెట్టారు. ఇది ఎంత గొప్ప ఆలోచనో కదా? ఆ స్కూల్లోని పిల్లలు ఆ పాఠశాల ఆవరణలోనే రంగురంగుల ముగ్గులు వేశారు. అయితే, అవి చుక్కలను, గీతలను కలిపే ముగ్గులు కాదు. విజ్ఞానాన్ని విరబూసిన చిత్రాలు. సైన్సు పాఠాల్లోని కీలకమైన రేఖాచిత్రాలు. అలా నేలమీద బొమ్మలు వేయటం ద్వారా సంక్రాంతికి విజ్ఞాన శోభను అద్దారు వాళ్లు. ఈ ప్రదర్శనను చూసి, ఆ మండల పెద్దలు, అధికారులూ విద్యార్థులను అభినందించారు. మండల కేంద్రంలో నిర్వహించిన సంబరాల సంక్రాంతిలో ఆ పిల్లలను పిలిచి.. సైన్సు ముగ్గులు వేయించి.. బహుమతులు కూడా ఇచ్చారు. వారికి అలాంటి ఆలోచన, ప్రోత్సాహం ఇచ్చి తోడ్పడ్డారు ఉపాధ్యాయులు, జెవివి నాయకులు ఎంఎస్‌వీఎస్‌పి వర్మ, రాధారాణి. మీరు కూడా తిలకించండి ఆ సైన్సు సంక్రాంతిని. ఇక్కడ ఇచ్చిన బొమ్మలు కొన్ని మాత్రమే! ఆ స్కూలు ప్రాంగణంలో వెల్లివిరిసినవి ఎన్నో ..!


- సుజయ సాహితి





సైన్సు సంక్రాంతిలో రాకెట్టు నమూనా వద్ద వర్మ, రాధారాణి, విద్యార్థులు

నేను గీసిన బొమ్మ





యం. కళ్యాణ్
8వ తరగతి
జడ్‌పిహెచ్ స్కూల్
పెనుమాక
తాడేపల్లి మండలం
గుంటూరుజిల్లా

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవల్సిన మాచిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - Chinnaarips@gmail.com



ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్

విజేత బెంగళూరు

హోరాహోరీ ఫైనల్లో ముంబయిపై గెలుపు

బెంగళూరు : ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్ నాల్గో సీజన్ విజేతగా బెంగళూరు ర్యాప్టర్స్ జట్టు అవతరించింది. ఆదివారం ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోటీలో బెంగళూరు ర్యాప్టర్స్ జట్టు ముంబయి రాకెట్స్‌ను 4-3తో ఓడించి టైటిల్ విజేతగా నిలిచింది. ముంబయి ట్రంప్ మ్యాచ్‌గా తీసుకున్న మిక్స్‌డ్ డబుల్స్‌లో జంగ్- బెర్నాండెత్ జోడీ 15-8, 15-14 పాయింట్ల తేడాతో ఎల్లీస్-స్మిత్ (బెంగళూరు) ను ఓడించి 2-0 ఆధిక్యతను సాధించింది. ఆ తర్వాత పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్(బెంగళూరు) 15-7, 15-10తో అంటోన్సెన్‌ను ఓడించి ముంబయి ఆధిక్యతను 1-2కు తగ్గించాడు. బెంగళూరు ట్రంప్ మ్యాచ్‌గా తీసుకున్న మహిళల సింగిల్స్‌లో టిటి వూ 15-8, 15-9తో పర్‌దేశీ (ముంబయి) పై గెలిచి 3-1 ఆధిక్యతలో బెంగళూరు నిలిచింది. రెండో పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో సమీర్‌వర్మ(ముంబయి) 7-15, 15-12, 15-3 పాయింట్ల తేడాతో సాయిప్రణీత్(బెంగళూరు)ను ఓడించి 3-3తో సమం చేశాడు. ఇక నిర్ణయాత్మక పురుషుల డబుల్స్ ఆఖరి మ్యాచ్‌లో అహసన్-సాతివాన్(బెంగళూరు) జోడీ 15-13, 15-10 పాయింట్ల తేడాతో జంగ్-డియో(ముంబయి)ను ఓడించి 4-3తో బెంగళూరుకు టైటిల్‌ను సంపాదించిపెట్టారు. విజేత బెంగళూరు ర్యాప్టర్స్ జట్టుకు రూ.3 కోట్లు, రన్నరప్ ముంబయి రాకెట్స్ జట్టుకు రూ.1.50 కోట్ల రూపాయల ప్రైజ్ మనీ లభించింది.

నేటినుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్

టాప్‌సీడ్స్‌గా జకోవిచ్, హెలెప్

సిడ్నీ : గ్రాండ్‌స్లామ్ తొలిటోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్ సోమవారంనుంచి ప్రారంభం కానుంది. టాప్‌సీడ్స్‌గా సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్, హెలెప్‌లు బరిలోకి దిగనున్నారు. జనవరి 26, 27న రోడ్‌లేవర్ ఎరేనాలో మహిళల, పురుషుల ఫైనల్ మ్యాచ్‌తో ఈ పోటీలు ముగియనున్నాయి. ఈ ఏడాది టోర్నీ బరిలో 128మంది పురుష, మహిళా ఆటగాళ్లు టోర్నీ బరిలో దిగనున్నారు. 104మంది ఆటగాళ్లు నేరుగా, మరో 24మంది టోర్నీ లీగ్ మ్యాచ్‌ల ద్వారా అర్హత సాధించారు. భారత్‌కు చెందిన ప్రజ్నేశ్ గుణేశ్వరన్ తొలిసారి సింగిల్స్‌కు అర్హత సాధించి టోర్నీ బరిలోకి దిగనున్నాడు. మూడోసీడ్ రోజర్ ఫెదరర్ 20వ గ్రాండ్‌స్లామ్ గెలిచి చరిత్ర సృష్టించాలని ఉవ్విళ్లూరుతున్నాడు. గత ఏడాది యుఎస్ ఓపెన్ గెలిచిన జకో 7వ సారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌పై కన్నేశాడు. రెండోసీడ్ రఫెల్ నాదల్, గత ఏడాది విజేత క్రొయేషియాకు చెందిన మారిన్ సిలిక్‌లు టైటిల్ ఫేవరేట్స్‌గా బరిలోకి దిగనున్నారు. మహిళల విభాగంలో వాజ్నియోంకీ, హెలెప్‌లు ఫైనల్‌కు చేరే అవకాశముంది.



ఛెత్రీ సేనకు

చావో రేవో

• నేడు బహ్రెయిన్‌తో ఆఖరి లీగ్‌మ్యాచ్ • గెలిచినా, డ్రా చేసుకున్నా నాకౌట్‌కు

అబుదాబి : భారత ఫుట్‌బాల్ జట్టు నేడు బహ్రెయిన్‌తో ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడనుంది. ఎఎఫ్‌సి ఆసియాకప్ ఫుట్‌బాల్ టోర్నీలో భాగంగా భారతజట్టు గ్రూప్-ఏలో మూడు పాయింట్లతో థాయ్‌లాండ్‌తో సమంగా రెండోస్థానంలో కొనసాగుతోంది. ఈ గ్రూప్‌లోనే ఉన్న ఆతిథ్య యుఏఈ జట్టు నాలుగు పాయింట్ల అగ్రస్థానంలో ఉంది. సోమవారం జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లలో రెండోస్థానంలో భారతజట్టు ఒక పాయింట్‌తో నాల్గోస్థానంలో ఉన్న బహ్రెయిన్‌తో ఆఖరిలీగ్ మ్యాచ్‌లో తలపడనుంది. నేడు జరిగే మరో మ్యాచ్‌లో యుఏఈ జట్టు థాయ్‌లాండ్‌తో తలపడనుంది.

ఈ మ్యాచ్‌లో భారత జట్టు బహ్రెయిన్‌పై గెలిచినా, కనీసం డ్రా చేసుకున్నా తొలిసారి ప్రీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించనుంది. 97వ ర్యాంక్ భారతజట్టు 113వ ర్యాంక్‌లో ఉన్న బహ్రెయిన్‌పై సునాయాసంగా గెలిచే అవకాశముంది. బహ్రెయిన్ జట్టు తొలిమ్యాచ్‌లో ఆతిథ్య యుఏఈతో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. కానీ ఆ తర్వాత థాయ్‌లాండ్ చేతిలో అనూహ్యంగా 0-1తో ఓడింది. దీంతో ఆ జట్టు కూడా నాకౌట్‌కు చేరాలంటే సోమవారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిస్తేనే ముందుకెళ్లనుంది.

ఆసియాకప్ ఫుట్‌బాల్ టోర్నీ చరిత్రలో భారతజట్టు 1984 నుంచి 2011 మధ్యకాలంలో ఒక్కసారి కూడా నాకౌట్‌కు చేరలేదు. కానీ 1964 టోర్నీలో రన్నరప్‌గా నిలిచింది. కానీ అప్పుడు రౌండ్ రాబిన్‌లీగ్ పద్ధతిలో మ్యాచ్‌లు జరిగాయి. కేవలం నాలుగు దేశాల జట్లు మాత్రమే ఆ టోర్నీలో బరిలోకి దిగాయి. కానీ ఈసారి జరిగే ఎఎఫ్‌సి ఆసియాకప్ టోర్నీలో అత్యధికంగా 24 జట్లు పాల్గొంటున్నాయి. 24 జట్లను ఆరు గ్రూపులుగా విభజించి ప్రతి గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచిన రెండుజట్లు నేరుగా ప్రి క్వార్టర్స్‌కు చేరతాయి. అలాగే ఆయా గ్రూపుల్లో గోల్స్, పాయింట్ల పరంగా మూడోస్థానంలో నిలిచిన నాలుగు జట్లు నాకౌట్ దశకు చేరడానికి మరో మ్యాచ్ ఆడేందుకు అవకాశముంది. ఈ మ్యాచ్‌లో ఇరుజట్లు మ్యాచ్ డ్రా అయిన పక్షంలో గోల్స్ అంతరం, ముఖాముఖి పోటీలో గెలిచిన జట్టు ముందుకు వెళ్తుంది.

సోమవారం జరిగే పోటీల్లో భారత్-థాయ్‌లాండ్ జట్లు ఓడిన పక్షంలో టోర్నీనుంచి నిష్క్రమించే ప్రమాద ముంది. కోచ్ స్టెఫెన్ మాట్లాడుతూ భారతజట్టు 2011 ఆసియాకప్‌లో బహ్రెయిన్ చేతిలో 2-5 గోల్స్‌తో పరాజయంపాలైందని, కానీ ఈసారి ఛెత్రీసేన తప్పక గెలుస్తుందనే ధీమా వ్యక్తం చేశాడు. ఈ మ్యాచ్‌ను ఛెత్రీ సేన కనీసం డ్రా చేసుకున్నా నాకౌట్‌కు చేరే అవకాశముంది. థాయ్‌లాండ్ చివరిమ్యాచ్‌లో పటిష్ట యుఏఈతో మ్యాచ్‌ను డ్రా చేసుకున్నా భారత్-థాయ్ జట్లు నాలుగు పాయింట్లతో రెండు, మూడు స్థానాల్లో నిలుస్తాయి. ముఖాముఖి పోటీలో భారతజట్టు 4-1తో థాయ్‌లాండ్‌ను ఓడించడంతో గ్రూప్-ఏ నుంచి ప్రి క్వార్టర్‌ఫైనల్‌కు ఛెత్రీసేన అర్హత సాధించే అవకాశముంది.

భారతజట్టు తరపున సునీల్ ఛెత్రీ ప్రాతినిధ్యం వహించడం ద్వారా మాజీ సారథి బైచుంగ్ భూటియా అత్యధిక మ్యాచ్‌లు ఆడిన(107) రికార్డుకు చేరుకుంటాడు. థాయ్‌లాండ్, యుఏఈతో మ్యాచ్‌ల సందర్భంగా బరిలోకి దిగిన 4-4-2 పొజిషన్‌లోనే ఆఖరి మ్యాచ్‌లోనూ మైదానంలోకి దిగుతామని కోచ్ స్టీఫెన్ తెలిపారు.



భారత జట్టు

సుమీత్ పస్సి, బల్వంత్ సింగ్, సునీల్ ఛెత్రీ(కెప్టెన్), జేజే లాల్‌పేఖుల్వా, ఉదంత సింగ్, జాకీచాంద్ సింగ్, జెర్మన్‌ప్రీత్ సింగ్, ప్రణయ్ హల్దెర్, అనిరుధ్ థాపా, వినిత్ రాయ్, రోలిన్ బోర్గస్, ఆశిక్ కురునియన్, హాలీచరణ్, ప్రీతమ్ కోటల్, సర్థక్ గొలా, సందేశ్ జింగాన్, అనాస్ ఎడథోడికా, సలామ్ రంజన్‌సింగ్, సుభాషిస్ బోస్, నారాయణ్ దాస్, గుర్‌ప్రీత్‌సింగ్ సంధూ, విశాల్ కైత్, అమిందర్ సింగ్.

ఆసీస్‌కు పయనమైన గిల్, శంకర్



న్యూఢిల్లీ : సస్పెన్షన్‌కు గురైన కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యాల స్థానాల్లో శుభ్‌మన్ గిల్, విజయ్ శంకర్‌లు భర్తీ చేయనున్నారు. ఆస్ట్రేలియాతో రెండో వన్డే అడిలైడ్‌లో మంగళ వారం జరగనున్న దృష్ట్యా భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ) వీరిద్దరినీ ఆఘమేఘాలమీద ఆసీస్‌కు పంపింది. అయితే గిల్ న్యూజిలాండ్ టూర్‌లో జరగబోయే ఐదు వన్డేలు, మూడు టీ20ల కోసం జట్టుతో కలవనున్నాడు. శంకర్ ఆస్ట్రేలియాతో జరగనున్న రెండో వన్డేలో ఆడే అవకాశముంది. మరోపక్క పాండ్యా, రాహుల్‌లపై విచారణ త్వరగా ముగించాలని పాలకుల కమిటీ సీఓఏ ఛైర్మన్ వినోద్ రాయ్ భావిస్తుండగా సీఓఏ సభ్యురాలు ఎడుల్జీ ఇందుకు నిరాకరించారు.

రాయుడు బౌలింగ్‌పై ఐసిసికి ఫిర్యాదు

టీమిండియా క్రికెటర్, హైదరాబాద్ ఆటగాడు అంబటి రాయుడు బౌలింగ్‌పై ఐసిసికి ఫిర్యాదు అందింది. శనివారం ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేమ్యాచ్‌లో రాయుడు రెండు ఓవర్లు బౌలింగ్ చేసిన విషయం తెలిసిందే. అయితే రాయుడి బౌలింగ్ యాక్షన్ అనుమానాస్పదంగా ఉందని మ్యాచ్ రిఫరీ ఐసిసికి ఫిర్యాదు చేశాడు. దీన్ని స్వీకరించిన ఐసిసి రాయుడు మరో 14 రోజుల్లో బౌలింగ్ యాక్షన్ నిరూపించుకోవాలని పేర్కొంది.

రాజస్థాన్ రాయల్స్‌కు కొత్త కోచ్



ముంబయి : ఐపీఎల్ తొలి ఎడిషన్ విజేత రాజస్థాన్ కొత్త కోచ్‌ను ఎంపిక చేసు కుంది. టీమిండియా మాజీ మెంటల్ కండీషనింగ్ కోచ్ ప్యాడీ అప్టన్‌ను తిరిగి తన బృందంలో చేర్చుకుంది. గతంలోనూ ఆయన నాలుగుసార్లు రాజస్థాన్‌కు కోచ్‌గా పనిచేశారు. ఆయన శిక్షణలోనే 2013లో ఆ జట్టు సెమీస్ చేరుకుంది. అదే ఏడాదిలో శ్రీశాంత్ సహా ముగ్గుర్ని పోలీసులు అరెస్టు చేయడంతో జట్టు పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. అప్పుడే ఛాంపియన్స్ లీగ్ టీ20 ఫైనల్ చేరుకుంది. అప్టన్‌ను కోచింగ్‌లో మంచి అనుభవం ఉంది. ఐపీఎల్, బిగ్‌బాష్, పీఎస్‌ల వంటి లీగుల్లో జట్లకు మార్గనిర్దేశకుడిగా ఉన్నారు. బిగ్‌బాష్‌లో సిడ్నీ థండర్స్‌కు నాలుగేళ్లు కోచ్‌గా ఉండి 2016లో విజేతగా నిలిపారు.



బాల్‌బాడ్మింటన్ విజేత మంగుళూరు

నాల్గో స్థానంలో కృష్ణా విశ్వవిద్యాలయం

(ప్రజాశక్తి - స్పోర్ట్స్ డెస్క్)

కృష్ణా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వర సిద్దార్ధ మహిళా కళాశాలలో ఐదు రోజుల పాటు జరిగిన అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల బాల్‌బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌ను మంగుళూరు(కర్ణాటక) విశ్వవిద్యాలయం జట్టు చేజిక్కించుకుంది. ఆదివారం జరిగిన ఆఖరి లీగ్‌మ్యాచ్‌లో కాలికట్(కేరళ) వర్సిటీ జట్టు 35-13, 35-14 పాయింట్ల తేడాతో కృష్ణా వర్సిటీపై, మంగుళూరు వర్సిటీ 27-35, 35-26, 35-29 పాయింట్ల తేడాతో గెలిచాయి. ద్వితీయ స్థానంలో కాలికట్(కేరళ) విశ్వవిద్యాలయం జట్టు నాలుగు పాయింట్లతో నిలిచి రన్నరప్‌గా ట్రోఫీని, ఎస్‌ఆర్‌ఎమ్(చెన్నై) జట్టు రెండు పాయింట్లతో తృతీయ, కృష్ణా విశ్వవిద్యాలయం(మచిలీపట్నం) జట్టు నాల్గోస్థానంలో నిలిచి ట్రోఫీలను గెల్చుకున్నాయి. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ, మచిలీపట్నం ఎంపి కొణకళ్ల నారాయణరావు విజేతలకు ట్రోఫీలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌వి బసవేశ్వరరావు, ఎన్ ఉష, టార్జన్, నళిని, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసి ఆస్పత్రిలో సౌకర్యాలపై సంక్రాంతి తరువాత ఆందోళన : ఆర్టీసి ఇయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడలోని విద్యాధరపురం ఆర్టీసి ఆస్పత్రిలో సౌకర్యాల లేమిపై సంక్రాంతి తరువాత ఆస్పత్రి వద్ద ఆందోళన చేపడతామని ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్(ఇయు) విజయవాడ నాన్ ఆపరేషన్ రీజియన్ అధ్యక్షులు బివి పాపారావు, నాయకులు వి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. విజయవాడలో ఉన్న జోనల్ వర్కుషాపు, నాన్ ఆపరేషన్ విభాగాల్లో పని చేస్తున్న సిబ్బందికి గతంలో విద్యాధరపురం ఆర్టీసి డిస్పెన్సరిలో వైద్య సౌకర్యం అందించేవారని, ఇప్పుడు రాష్ట్ర స్థాయి సెంట్రల్ ఆస్పత్రి ఏర్పాటు చేసిన తరువాత నాన్ ఆపరేషన్ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సరైన వైద్య సౌకర్యాలు అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని చాలా సార్లు ఆసుపత్రి ఛీఫ్ మెడికల్ ఆఫీసర్‌కు విన్నవించినా పట్టించుకోకపోవడంతో ఆస్పత్రి వద్దే ఆందోళన చేస్తామని తెలిపారు. నాన్ ఆపరేషన్ ఉద్యోగులకు ప్రతి రోజూ 12 గంటల నుండి 12.50 గంటల వరకే సమయం ఉంటుందని, ప్రస్తుతం ఆస్పత్రిలో వైద్యులు లేని కారణంగా ఆన్ డ్యూటీలో మందులు తీసుకోవాలని వస్తే కనీసం మూడు గంటలు పడుతోందని పేర్కొన్నారు. కేటాయించిన సమయంలో వైద్యులు ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

65.29 లక్షలు దాటిన టిడిపి సభ్యత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



టిడిపి సభ్యత్వ నమోదు తెలుగు రాష్ట్రాల్లో 2018-20కి గాను 65.29 లక్షలు దాటిందని ఆ పార్టీ తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. కార్యకర్తలకు పార్టీ పరంగా ఇప్పటి దాకా రూ.14 కోట్లకు పైగా సహాయం చేసినట్లు ఈ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాదాల్లో చనిపోయిన 3,031 మందికి, రూ.60.62 కోట్ల సహాయం అందించారు. ప్రమాదాల్లో గాయపడిన 89 మంది కార్యకర్తలకు రూ.52. 80లక్షలు, 815 మంది విద్యార్థులకు రూ.2.28 కోట్లను సహాయం అందించినట్లు తెలిపారు. 365 మంది నూతన జంటలకు పట్టు వస్త్రాలు కానుకలు అందజేసినట్లు పేర్కొన్నారు.

గురువులకు జీతాల్లేవ్

- రెండు మాసాలుగా అందని వేతనాలు
- ఆరు వేల మందికిపైగా ఉపాధ్యాయులు నిరీక్షణ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వం నిర్లక్ష్యంగా కారణంగా గురువులకు జీతాలు ఆగిపోయాయి. గత రెండు మాసాలుగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తోన్న ఉపాధ్యాయులకు వేతనాలు నిలిచిపోయాయి. దీని ప్రభావం ఆరు వేల టీచర్ల కుటుంబాలపై పడింది. దీంతో అందరూ సంక్రాంతి పండుగ చేసుకుంటున్నా వీరు మాత్రం విషాదంలో ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తోన్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి నవంబర్, డిసెంబర్ వేతనాలు నేటికీ అందలేదు. సుమారు 378 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో టీచింగ్, నాన్ టీచింగ్ కలిపి దాదాపు ఆరు వేలకు పైగా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, హెచ్‌డబ్ల్యూవోలకు డ్రాయింగ్ అండ్ డిస్‌బర్స్‌మెంట్ అధికారాలు ఉండేవి. అయితే ఇటీవల వారికి ఆ అధికారాలను తొలగించి, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారుల (ఏటిడబ్ల్యూవో)కు ఈ అధికారాలను అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు సాంఘిక, గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్ ఆగస్టు మాసంలో జీవో 132ను జారీ చేశారు. అయితే ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఉపాధ్యాయులకు, ఇతర సిబ్బందికి ఇబ్బందిగా మారింది. ఈ విధానం వల్ల క్షేత్ర స్థాయిలో పనిచేసే ఉద్యోగులకు సరిగా వేతనాలు అందడం లేదు. అంతేకాకుండా విద్యార్థులకు ఉపకార వేతనాలు, వసతి గృహాల బిల్లులు సకాలంలో మంజూరు కావడం లేదు. దీంతో పాటు ప్యానల్ గ్రేడ్ హెచ్‌ఎంలు తమ అధికారాలను కోల్పోయినట్లైంది. సర్వీసు రూల్స్ ప్రకారం ప్యానల్ గ్రేడ్ హెచ్‌ఎంల కంటే ఏటిడబ్ల్యూవోలు ర్యాంకు కూడా తక్కువ. ఈ పరిస్థితుల్లో డ్రాయింగ్, డిసబర్స్‌మెంట్ అధికారాలు ఏటిడబ్ల్యూవోలకు అప్పగించడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. అభ్యంతర కరంగా ఉన్న జీవో 132ను రద్దు చేయాలని, పాత విధానాన్ని కొనసాగించాలని అన్ని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో వివిధ పద్ధతుల్లో నిరసనలు చేపడుతూ పలుమార్లు వినతి పత్రాలను సమర్పించారు. అందులో భాగంగా ఇటీవల పాడేరులో చేపట్టిన నిరాహార దీక్షను గిరిజన సంక్షేమ శాఖ మంత్రి విరమింపజేస్తూ జీవో 132ను రద్దు చేసి, గతంలో ఉన్న విధానాన్నే పునరుద్దరింపజేస్తామని హామీ కూడా ఇచ్చారు. కానీ ఇంత వరకు అది అమలు కాకపోవడం గమనార్హం. ఈ విధానం ఎప్పుడు రద్దు అవుతుందో, ఆరు వేల మందికి పైగా ఉన్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి ఎప్పుడు వేతనాలు చెల్లిస్తారో అనేది ప్రశ్నార్థకంగా మారింది.



తెనాలిలోని నాదెళ్ల మనోహర్ పంట పొలంలో భోగి మంటను వెలిగిస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్

చివరి పొలాలకు నీళ్ళు అందేలా కృషి చేస్తా : మంత్రి ఉమ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్ర రైతు సంఘం డైరీ, క్యాలెండర్‌ని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు విజయవాడలోని నీటి పారుదల శాఖా కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు వై కేశవరావు, రాష్ట్ర కార్యదర్శి పోల పెద్దిరెడ్డి, రైతువాణి సంపాదకులు పి నర్సింహారావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి పమిడి వెంకటరావు మంత్రిని కలిసి రాష్ట్రంలోని రైతు సమస్యలపై మంత్రికి వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిలువున ఉన్న పంటని కాపాడటానికి వెంటనే చర్యలు తీసుకుంటామని, చివర ఉన్న పొలాలకు కూడా నీళ్ళు అందించటానికి కృషి చేస్తామనీ హామీ ఇచ్చారు. ఈ విషయమై మంత్రి సంబంధిత అధికారితో ఫోన్‌లో మాట్లాడగా, మంత్రి ఆదేశాల మేరకు ఒఎస్‌డి కె రాజేంద్రప్రసాద్ సోమవారం జిల్లాలో పర్యటించి వెంటనే చర్యలు చేపడతామని హామీనిచ్చారని, రాష్ట్ర సహాయ కార్యదర్శి పమిడి వెంకటరావు తెలిపారు.



సెపక్ తక్రా విజేత ఆంధ్రా

(ప్రజాశక్తి-స్పోర్ట్స్ డెస్క్) : జిల్లా స్కూల్‌గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో విజయవాడలోని గాంధీనగర్ ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్ ఆవరణలో జరిగిన 64వ జాతీయస్థాయి (అండర్-17) స్కూల్‌గేమ్స్ సెపక్‌తక్రా ఛాంపియన్‌షిప్‌లను ఆంధ్ర, ఒడిస్సా జట్లు చేజిక్కించుకున్నాయి. ఆదివారం జరిగిన బాలుర ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 21-6, 21-16 పాయింట్ల తేడాతో ఒరిస్సాపై గెలిచింది. బాలికల ఫైనల్లో ఒరిస్సా జట్టు 21-16, 21-15 పాయింట్ల తేడాతో మహారాష్ట్రపై గెలిచాయి. ముగింపు కార్యక్రమానికి హాజరైన ఆంధ్ర అసోసియేషన్ సెక్రటరీ అరుణ్ కుమార్, జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీ లక్ష్మి కుమారి విజేతలకు ట్రోఫీలను అందజేశారు.



తలపడుతున్న ఎజిసి హైదరాబాద్, ట్రిపుల్ ఐటి నూజివీడు

హోరా హోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-నూజివీడు

కృష్ణాజిల్లా నూజివీడులోని ధర్మ అప్పారావు కళాశాలలో 43వ కళాప్రపూర్ణ రాజా వెంకటాద్రి బహుద్దూర్ అప్పారావు బాస్కెట్‌బాల్ పోటీలు ఆయా జట్ల మధ్య అత్యంత రసవత్తరంగా జరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రానికి ఆయా జట్ల మధ్య జరిగిన పోటీల వివరాలిలావున్నాయి. పురుషుల విభాగంలో సిఎంపి హైదరాబాద్ జట్టు డాన్ బాస్కో-బి పై 45-22 పాయింట్ల తేడాతో గెలుపొందింది. శాప్ జట్టు వైహెచ్‌ఒబి జట్టుపై 28-12 తేడాతోను, ఎపిసిఎస్ జట్టు ఈగల్-బి జట్టుపై 32-20 తేడాతోను, కర్నూలు జట్టు సిబిఎ రాజమండ్రి జట్టుపై 35-29 తేడాతోను, వైబిఎం మార్టేరు జట్టు ఈగల్స్-ఎ జట్టుపై 35-33 తేడాతోను, చిత్తూరు జట్టు నోవా ఇబ్రహీంపట్నం జట్టుపై 45-35 తేడాతోను, డిఎస్సీ కాకినాడ జట్టు అనంతపురం జట్టుపై 34-17 తేడాతోను, ఎజిసి జట్టు ఖమ్మం జట్టుపై 46-08 పాయింట్ల తేడాతోను, ఎన్‌టిఆర్ స్టేడియం గుంటూరు జట్టు ఎస్‌ఆర్‌ఆర్ నూజివీడు జట్టుపై 36-5 పాయింట్ల తేడాతో విజయం సాధించాయి. అలాగే ఎపి పోలీసు జట్టు కొత్తగూడెం జట్టుపై 33-21 తేడాతోను, ఏలూరు జట్టు ట్రిపుల్ ఐటి నూజివీడుపై 32-26 తేడాతోను, జిఎస్సీ జట్టు సిబిఎ విజయవాడ జట్టుపై, ఎఎఎ గుంటూరు జట్టు ఆర్‌బిఎ రాజమండ్రిపై 38-29 తేడాతోను, ఖమ్మం జట్టు కర్నూలు జట్టుపై 32-21 తేడాతోను, సిఎంపి జట్టు ఏలూరు జట్టుపైన, డాన్‌బాస్కో ఎన్‌టిఆర్ జట్టు గుడివాడ జట్టుపైన 50-22 తేడాతోను, డిఎస్సీ కాకినాడ జట్టు ఎస్‌ఆర్‌ఆర్ నూజివీడు జట్టుపై 38-22 తేడాతో విజయం సాధించాయి. మహిళల విభాగంలో ఎన్‌టిఆర్ గుంటూరు జట్టు సిబిఎ విజయవాడ జట్టుపై 26-06 తేడాతోను, జిఎస్సీ గుంటూరు ఎన్‌టిఆర్ జట్టు గుడివాడ జట్టుపై 32-18 తేడాతోను, అనంతపురం జట్టు డిఎ విజయవాడ జట్టుపైన, ఎన్‌టిఆర్ గుంటూరు జట్టు సిబిఎ రాజమండ్రి జట్టుపై 25-06 తేడాతో, జిఎన్‌ఆర్ హైదరాబాద్ జట్టు కర్నూలు జట్టుపై 32-21 పాయింట్లు తేడాతో, చిత్తూరు జట్టు లిటిల్ ఏంజెల్స్ జట్టుపై 28-08 పాయింట్ల తేడాతో గెలుపొందాయి.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68